www.trinetnews.com

# ట్రైనెట్ తెలంగాణ న్యూస్

నిజం • బాధ్యత • నిబద్ధత

తెలుగు దిన పత్రిక

సంపుటి 01 సంచిక 24 ఎడిటర్ :వెంకటేశ్వర్లు రాపోలు బుధవారం సెప్టెంబర్ 02, 2026 పేజీలు:12 వెల.10/-

## ఈసారి లక్షా 40 వేల గణేష్ మండపాలు



2లో

## పేపర్ లీకేజీ కేసులో..అడ్డంగా దొరికిన ఏడో ర్యాంకర్



2లో

## రాంచందర్‌రావుకు బీజేపీ జాతీయ అధ్యక్షుడి ఫోన్

- పార్టీ కార్యాలయంపై దాడులపై నబిన్ ఆరా
- నేతల అరెస్టులపై వివరాలు అడిగిన నితిన్ నబిన్
- కాంగ్రెస్ నిరంకుశ విధానంపై పోరాడాలని సూచన
- బీజేపీ--కాంగ్రెస్ పరస్పర దాడులతో తెలంగాణలో ఉద్రిక్తత
- బీజేపీ కార్యాలయ గేటుకు కాంగ్రెస్ శ్రేణుల నల్లరంగు
- గాంధీభవన్ ముట్టడికి బీజేవైఎం యత్నం
- నల్లగొండలో మంత్రి కోమటిరెడ్డి కార్యాలయంపై దాడి



2లో

## హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు హైకోర్టులో ఊరట

- సింగిల్ జడ్జి తీర్పుపై డివిజన్ బెంచ్ స్టే
- రంగనాథ్‌ను తప్పించాలన్న ఆదేశాలపై తాత్కాలిక సస్పెన్షన్
- శాంతా శ్రీరాం కన్‌స్ట్రక్షన్ కేసులో కీలక పరిణామం
- డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించిన రంగనాథ్
- రంగనాథ్ తరపున వాదించిన మాజీ సీజే రాజీవ్ శక్దర్



2లో

# కేసీ వేణుగోపాల్‌తో సీఎం రేవంత్ కీలక భేటీ



దిల్లీ:
ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి భేటీ అయ్యారు. రాష్ట్రంలో ఇటీవలి రాజకీయ పరిణామాలపై ఇరువురి మధ్య కీలక చర్చ జరిగినట్లు సమాచారం. మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ, నామినేటెడ్ పోస్టుల భర్తీ అంశాలపై వీరిద్దరి మధ్య చర్చ జరగనున్నట్లు సమాచారం. మంత్రి కొండా సురేఖ, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డికి క్రమశిక్షణ కమిటీ షోకాజ్ నోటీసులు, వారు ఇచ్చిన వివరణ తదితర అంశాలపై కేసీ వేణుగోపాల్‌తో రేవంత్ చర్చించినట్లు తెలుస్తోంది.



# 1000 రోజుల ప్రజాపాలన..

## ఆర్టీసీలో విప్లవాత్మక మార్పులు

### మహిళలకు ఫ్రీ జర్నీ.. రూ.12,167 కోట్ల ఆదా

- 600 బస్సులకు మహిళలే యజమానులు
- 2,932 కొత్త బస్సుల కొనుగోలు
- 1,024 ఈవీ బస్సులు ఇప్పటికే రోడ్డుపై
- హైదరాబాద్‌లో త్వరలో మరో 2,200 ఈవీ బస్సులు
- ఆర్టీసీ ఆక్యుపెన్సీ 67% నుంచి 89%కి
- 1,424 కారుణ్య నియామకాలు.. 4,538 ఉద్యోగాల భర్తీ
- 244 మంది తొలగించిన ఉద్యోగులకు తిరిగి విధులు
- చెక్‌పోస్టుల ఎత్తివేత.. ఎన్‌ఫోర్స్‌మెంట్ బలోపేతం

2లో

ప్రజల జీవితాల్లో వెలుగులు నింపుతూ టీజీఎస్‌ఆర్టీసీ దేశంలోనే నెంబర్ వన్ స్థానంలో నిలుస్తోందన్నారు మంత్రి పొన్నం ప్రభాకర్. తెలంగాణలో ప్రజా పాలన ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1000 రోజులు పూర్తయిన సందర్భంగా... రవాణా శాఖ,ఆర్టీసీ రంగంలో విప్లవాత్మక మార్పులు,సాధించిన విజయాలను పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. ప్రభుత్వం కొలువుదీరిన కేవలం 48 గంటల్లోనే మహిళల కోసం అద్భుతమైన మహా లక్ష్మి పథకాన్ని ప్రారంభించాం. ఇప్పటివరకు 347 కోట్ల 36 లక్షల మంది మహిళలు ఉచితంగా ప్రయాణించి, దాదాపు రూ. 12,167 కోట్లు ఆదా చేసుకున్నారు. అంతేకాదు, దేశంలోనే మొదటిసారిగా 600 బస్సులకు మహిళలనే యజమానులను చేసి, వారి ఆర్థిక వృద్ధికి బాటలు వేసింది మన ప్రభుత్వం.ప్రయాణికుల సౌకర్యార్థం ఇప్పటివరకు 2,932 కొత్త బస్సులు కొనుగోలు చేశాం. ఇప్పటికే 1,024 ఎలక్ట్రిక్ బస్సులు విజయవంతంగా నడుస్తుండగా... త్వరలోనే హైదరాబాద్ నగరంలో మరో 2,200 కొత్త ఈవీ బస్సులు రోడ్డెక్కబోతున్నాయి. గతంలో 67 శాతంగా ఉన్న ఆక్యుపెన్సీ రేషియో, నేడు 89 శాతానికి



## షాదీ ముబారక్‌ల పై హైకోర్టు కీలక ఉత్తర్వులు

రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టులో ఊరట లభించింది. కల్యాణలక్ష్మీ, షాదీ ముబారక్ పథకాలపై సింగిల్ బెంచ్ విధించిన స్టేను సీజే ధర్మాసనం ఎత్తివేసింది. దీంతో ఈ రెండు పథకాల అమలుకు లైన్ క్లియర్ అయ్యింది.
కల్యాణలక్ష్మీ, షాదీ ముబారక్ పథకాలకు సంబంధించి 2014 నుంచి ప్రభుత్వం జారీ చేసిన ఎనిమిది జీవోలను సవాలు చేస్తూ విజయ్ గోపాల్ అనే న్యాయవాది

2లో



## నీట్ నిరసనలు.. విద్యార్థులపై కేసులు కొట్టేసిన సుప్రీంకోర్టు

నీట్ నిరసనలకు సంబంధించి దేశవ్యాప్తంగా విద్యార్థులపై నమోదైన కేసులను సుప్రీంకోర్టు కొట్టేసింది. ఆర్టికల్ 142 కింద విస్తృత అధికారాలను ఉపయోగించి ఎఫ్ఐఆర్‌లను రద్దు చేసింది. నిరసనలు చేపట్టిన వారిలో తీవ్ర నేర చరిత్ర కలిగి ఉన్న 2,873 మందిపై కొత్తగా కేసుల నమోదుకు కేంద్రం, దిల్లీ పోలీసులకు అనుమతినిచ్చింది.

# కలకలం.. మలేరియా మాత్రలు వికటించి ఇద్దరు విద్యార్థులు మృతి




ఎటపాక మండలం గొల్లగూడెం ప్రభుత్వ పాఠశాలలో విషాదం చోటుచేసుకుంది. మలేరియా నివారణలో భాగంగా విద్యార్థులకు సిబ్బంది పంపిణీ చేసిన క్లోరోక్విన్ మాత్రలు వికటించడంతో ఇద్దరు విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారు. మరో ఐదుగురి పరిస్థితి విషమంగా ఉంది. పాఠశాలలో మొత్తం 73 మంది విద్యార్థులకు ఈ మాత్రలు పంపిణీ చేయగా, వాటిని మింగిన కొద్దిసేపటికి వారిలో 20 మంది తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. అప్రమత్తమైన ఉపాధ్యాయులు, స్థానికులు వెంటనే బాధితులను మెరుగైన వైద్యం కోసం భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఇద్దరు విద్యార్థులు మృతి చెందగా, మరో ఐదుగురి పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. ఘటనపై సమాచారం అందుకున్న అధికారులు పాఠశాలకు చేరుకుని పరిస్థితిని సమీక్షిస్తున్నారు. విద్యార్థులకు మందుల పంపిణీలో జరిగిన పొరపాటుపై విచారణకు ఆదేశించే అవకాశం ఉంది. ఈ దుర్ఘటనతో విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలి

- » కాంగ్రెస్ 1000 రోజుల పాలనపై హరీశ్‌రావు ఫైర్
- » విద్యార్థుల భవిష్యత్తుతో ప్రభుత్వం చెలగాటం
- » బకాయిలు రాక.. సర్టిఫికెట్లు ఇవ్వని కాలేజీలు
- » ఉద్యోగాలు, పైచదువులకు విద్యార్థులకు ఇబ్బందులు
- » ప్రభుత్వ నిర్లక్ష్యంతో భవిష్యత్తు ప్రశ్నార్థకం
- » ప్రతిపక్షాలపై ప్రచారంపై ఉన్న శ్రద్ధ విద్యార్థులపై లేదా?
- » తక్షణమే బకాయిలు చెల్లించాలని హరీశ్‌రావు డిమాండ్



2లో..

హైదరాబాద్:
కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో చేసిన మంచి కంటే సృష్టించిన విధ్వంసమే ఎక్కువ అని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. దీనికి విద్యార్థుల భవిష్యత్తే ప్రత్యక్ష సాక్ష్యమన్నారు.

### కాంగ్రెస్ అధిష్ఠానం పిలుపు..

# దిల్లీకి కొండా సురేఖ

- కేసీ వేణుగోపాల్‌తో సురేఖ భేటీ
- ఖర్గే అపాయింట్‌మెంట్ కోరిన మంత్రి
- షోకాజ్ నోటీసుల నేపథ్యంలో కీలక పరిణామం
- అధిష్ఠానం నిర్ణయంపై ఉత్కంఠ
- మంత్రివర్గ విస్తరణపై హస్తినలో జోరుగా చర్చ
- మార్పులు, చేర్పులపై అధిష్ఠానం నిర్ణయం?
- దిల్లీకి చేరుకున్న సీఎం రేవంత్‌రెడ్డి



మిగతాది 2లో

హైదరాబాద్:
తెలంగాణ మంత్రి కొండా సురేఖ దిల్లీకి బయల్దేరారు. కాంగ్రెస్ అధిష్ఠానం పిలుపు నేపథ్యంలో ఆమె వెళ్లారు. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో సురేఖ సమావేశం కానున్నారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అపాయింట్‌మెంట్‌ను కూడా ఆమె కోరారు.



2లో

# వాయుసేనలో చరిత్ర సృష్టించిన శక్తి శర్మ

- ఎయిర్ వైస్ మార్షల్‌గా తొలి మహిళా అధికారి
- వైద్యేతర విభాగంలో అరుదైన ఘనత
- ఎయిర్ హెడ్‌క్వార్టర్స్‌లో కీలక బాధ్యతలు
- అసిస్టెంట్ చీఫ్ ఆఫ్ ది ఎయిర్ స్టాఫ్ (విద్య)గా బాధ్యతలు
- మూడు దశాబ్దాలకుపైగా విశిష్ట సేవలు
- గతంలోనూ తొలి మహిళా ప్రిన్సిపల్‌గా రికార్డు

భారత వైమానిక దళంలో చరిత్రాత్మక ఘట్టం ఆవిష్కృతమైంది. సాయుధ దళాల్లో ఎయిర్ వైస్ మార్షల్ లేదా దానికి సమానమైన హోదాను పొందిన మొట్టమొదటి మహిళా అధికారిగా (వైద్యేతర విభాగంలో) ఎయిర్ వైస్ మార్షల్ శక్తి శర్మ నిలిచారు. వాయుసేన ఈమేరకు 'ఎక్స్' వేదికగా పోస్టు చేసింది. మంగళవారం ఆమె దిల్లీలోని ఎయిర్ హెడ్‌క్వార్టర్స్‌లో అసిస్టెంట్ చీఫ్ ఆఫ్ ది ఎయిర్ స్టాఫ్ (విద్య)గా బాధ్యతలు స్వీకరించారని తెలిపింది.

# 1,931 ఏఎన్‌ఎం పోస్టులు..

## రెండో ప్రొవిజినల్ మెరిట్ లిస్టు విడుదల

తెలంగాణలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో మల్టీ పర్పస్ హెల్త్ అసిస్టెంట్స్ (ఫిమేల్) పోస్టుల భర్తీ ప్రక్రియ తుది దశకు చేరింది.



మిగతాది 2లో

తెలంగాణ ట్రైనెట్ న్యూస్
నిజం • బాధ్యత • నిబద్ధత
తెలుగు దిన పత్రిక
బుధవారం సెప్టెంబర్ 02, 2026
www.trinetnews.com

# హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు హైకోర్టులో ఊరట

మొదటిపేజీ తరువాయి
హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు తెలంగాణ హైకోర్టులో ఊరట లభించింది. శాంతా శ్రీరాం కన్‌స్ట్రక్షన్ కేసులో ఆయనపై సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును డివిజన్ బెంచ్ తాత్కాలికంగా సస్పెండ్ చేసింది. రంగనాథ్‌ను తప్పించి మరో అధికారిని నియమించాలని సింగిల్ జడ్జి గతంలో తీర్పు ఇచ్చారు. దీనిపై రంగనాథ్ డివిజన్ బెంచ్‌లో అప్పీల్ చేశారు. ఆ పిటిషన్‌పై నేడు విచారణ జరిగింది. హైడ్రా కమిషనర్ తరఫున హిమాచల్‌ప్రదేశ్ హైకోర్టు మాజీ సీజే జస్టిస్ రాజీవ్ శక్దర్ వాదనలు వినిపించారు.

# వాయుసేనలో చరిత్ర సృష్టించిన శక్తి శర్మ

మొదటిపేజీ తరువాయి
గతంలో ఆమె ఎయిర్ కమోడోర్ హోదాలో ఉండేవారని పేర్కొంది.శక్తి శర్మ 1994లో ఐఏఎఫ్ విద్యావిభాగంలో నియమితులయ్యారు. వైమానిక దళ శిక్షణ సంస్థలు, ఫీల్డ్ స్టేషన్లు, కమాండ్ హెడ్ క్వార్టర్స్, ఎయిర్ హెడ్ క్వార్టర్స్‌లలో విభిన్న బాధ్యతలు నిర్వర్తించారు. ఐఐటీ కాన్పుర్, పుణె విశ్వవిద్యాలయంలో 'ఐఏఎఫ్ చైర్స్ ఆఫ్ ఎక్సలెన్స్'ను నెలకొల్పడంలో కీలక పాత్ర పోషించారు. త్రివిధ దళాల నుంచి సైనిక పాఠశాలకు ప్రిన్సిపల్‌గా పనిచేసిన మొదటి మహిళా అధికారిగానూ గతంలో చరిత్ర సృష్టించారు. మూడు దశాబ్దాలకుపైగా విశిష్ట సేవలతో ఆమె అందరికీ స్ఫూర్తిగా నిలుస్తున్నారని వాయుసేన తెలిపింది.

## నీట్ నిరసనలు.. విద్యార్థులపై కేసులు కొట్టేసిన సుప్రీంకోర్టు

మొదటిపేజీ తరువాయి
అదేవిధంగా.. ఆత్మహత్య చేసుకున్న నీట్ విద్యార్థుల కుటుంబాలకు మూడు నెలల్లోగా పరిహారం అందించాలని ఆదేశాలు జారీ చేసింది. ఈ పరిణామాల నేపథ్యంలో సెప్టెంబర్ 5న నిర్వహించనున్న నిరసన కార్యక్రమాన్ని విరమించుకుంటున్నట్లు సర్వోన్నత న్యాయస్థానానికి కాక్రోచ్ జనతా పార్టీ తెలిపింది.
సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చీ, జస్టిస్ వి.మోహనలతో కూడిన సుప్రీం ధర్మాసనం ఎదుట ఈ అంశంపై వాదనలు సాగాయి. జులై 20-25 మధ్య దేశవ్యాప్తంగా నీట్ నిరసనకారులపై నమోదైన ఎఫ్ఐఆర్‌లను రద్దు చేసేందుకు సుప్రీంకోర్టు తన అధికారాలను ఉపయోగించాలని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కోరారు. నీట్ రద్దు అనంతరం ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు పరిహారం చెల్లిస్తామంటూ సీజేపీ ప్రతినిధులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకునేందుకు కేంద్రం కట్టుబడి ఉందని, దీనికి సంబంధించిన విధివిధానాల ఖరారుకు మూడు నెలల సమయం కోరారు. దీనికి అనుమతిస్తూ సుప్రీంకోర్టు ఆ కేసులను కొట్టేసింది.

# 1000 రోజుల ప్రజాపాలన.. ఆర్టీసీలో విప్లవాత్మక మార్పులు

మొదటిపేజీ తరువాయి
ఆర్టీసీ కార్మికుల సంక్షేమమే మా ధ్యేయం. సర్వీసు నుంచి తొలగించబడిన 244 మంది ఉద్యోగులను ప్రత్యేక కమిటీ ద్వారా తిరిగి విధుల్లోకి తీసుకున్నాం. కారుణ్య నియామకాల కింద 1,424 ఉద్యోగాలు ఇచ్చాం. అలాగే 4,538 ఉద్యోగాల నియామక ప్రక్రియ పారదర్శకంగా కొనసాగుతోంది.టీఎస్ నుంచి టీజీ గా మార్పులు చేసుకుంటూ... వాహన్ ఓ సారథి విధానాన్ని తెచ్చాం. రవాణా శాఖలో అవినీతికి తావులేకుండా చెక్‌పోస్టులను ఎత్తివేసి, ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలను బలోపేతం చేశాం.

సీఎం రేవంత్ నాయకత్వంలో, డిప్యూటీ సీఎం,ప్రజా ప్రతినిధుల సహకారంతో... గ్రామ స్థాయి నుంచి పట్టణాల వరకు మెరుగైన రవాణా సేవలను అందిస్తున్నాం. ఆర్టీసీ కార్మికుల సంక్షేమం, సంస్థ అభివృద్ధి, ప్రయాణికుల భద్రత మా ప్రభుత్వ ప్రధాన లక్ష్యం అని అన్నారు పొన్నం.

## కాంగ్రెస్ అధిష్ఠానం పిలుపు..

# ఢిల్లీకి కొండా సురేఖ

మొదటిపేజీ తరువాయి
ఇటీవల గీసుకొండలో సీఎం రేవంత్‌రెడ్డి, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డిపై కొండా సురేఖ కుమార్తె సుస్మిత చేసిన వ్యాఖ్యలు తీవ్ర చర్చనీయాంశమైన సంగతి తెలిసిందే. కుమార్తె వ్యాఖ్యలపై వివరణ ఇవ్వాలని కొండా సురేఖకు టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ (డీఏసీ) షోకాజ్ నోటీసులు ఇచ్చింది. కమిటీ ఛైర్మన్ మల్లు రవికి ఆమె వివరణ ఇచ్చారు. అనంతరం కొండా సురేఖతో పాటు వనపర్తి వ్యవహారంలో ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డిపై రూపొందించిన నివేదికను అధిష్ఠానానికి టీపీసీసీ పంపింది. ఈ పరిణామాల నేపథ్యంలో మంత్రి కొండా సురేఖ ఢిల్లీకి వెళ్లడం.. ఆమె విషయంలో అధిష్ఠానం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందోననే ఉత్కంఠ నెలకొంది.

**మంత్రివర్గ విస్తరణపై జోరుగా ప్రచారం..**
తెలంగాణ మంత్రివర్గ విస్తరణపై హస్తినలో జోరుగా ప్రచారం జరుగుతోంది. మంత్రివర్గంలో మార్పులు, చేర్పులపై కాంగ్రెస్ అధిష్ఠానం కీలక నిర్ణయం తీసుకోవచ్చని రాజకీయ వర్గాల్లో చర్చ కొనసాగుతోంది. నామినేటెడ్ పదవుల భర్తీపైనా నిర్ణయం ఉండే అవకాశముందని కాంగ్రెస్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. మంత్రివర్గ విస్తరణ, పదవుల పంపకాల ప్రచారం నేపథ్యంలో రాష్ట్ర కాంగ్రెస్ ముఖ్యనేతలు ఢిల్లీ బాటపట్టారు. సీఎం రేవంత్‌రెడ్డి కొద్దిసేపటి క్రితమే ఢిల్లీ చేరుకున్నారు. స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు ఇప్పటికే అక్కడ ఉన్నారు. అయితే పలువురు నేతలు మాత్రం బుధవారం స్వామినాథన్ ఫౌండేషన్‌కి వైఎస్ అవార్డు ప్రదాన కార్యక్రమం కోసం ఢిల్లీ వెళ్తున్నట్లు చెబుతున్నారు.

# 1,931 ఏఎన్ఎం పోస్టులు.. రెండో ప్రొవిజినల్ మెరిట్ లిస్టు విడుదల

మొదటిపేజీ తరువాయి



మొత్తం 1,931 పోస్టుల భర్తీకి సంబంధించి మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు మంగళవారం సాయంత్రం రెండో ప్రొవిజినల్ మెరిట్ లిస్ట్‌ను విడుదల చేసింది. 1:1.25 నిష్పత్తిలో అభ్యర్థులను షార్ట్‌లిస్ట్ చేసింది. ఎంపికైన అభ్యర్థులకు ఈ నెల 16 నుంచి 26వరకు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ నిర్వహించనున్నారు. సర్టిఫికెట్ వెరిఫికేషన్ అనంతరం తుది మెరిట్ లిస్ట్, సెలక్షన్ జాబితాలను విడుదల చేస్తారు.
ఈ పోస్టుల భర్తీ కోసం 2023 జులై 26న ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ ఏడాది మే 14న ప్రొవిజినల్ లిస్ట్ విడుదల చేసి అభ్యర్థుల నుంచి అభ్యంతరాలు స్వీకరించిన అనంతరం జులై 10న తొలి తాత్కాలిక మెరిట్ జాబితాను విడుదల చేశారు. మరోసారి అభ్యంతరాలను స్వీకరించి వాటిని పరిశీలించాక తాజాగా రెండో తాత్కాలిక జాబితాను విడుదల చేశారు. సర్టిఫికెట్ల వెరిఫికేషన్ కోసం అభ్యర్థులు హైదరాబాద్‌లోని వెంగళరావునగర్‌లో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్‌కు వెళ్లాల్సి ఉంటుంది. సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు ఈ నెల 28వ తేదీని రిజర్వ్‌డేగా నిర్ణయించారు. తమకు కేటాయించిన తేదీన వెరిఫికేషన్‌కు హాజరు కాలేకపోయిన వారు ఆ రోజు వెళ్లే అవకాశం కల్పించారు.

# రాంచందర్‌రావుకు పార్టీ జాతీయ అధ్యక్షుడి ఫోన్

మొదటిపేజీ తరువాయి
తెలంగాణలో కాంగ్రెస్ వర్సెస్ బీజేపీ అన్న చందంగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావుకు ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ ఫోన్ చేశారు. పార్టీ కార్యాలయంపై దాడులు, నేతల అరెస్ట్‌లపై ఆరా తీశారు. అదే సమయంలో కాంగ్రెస్ నిరంకుశ విధానంపై పోరాటాన్ని కొనసాగించాలని రాంచందర్‌రావుకు నబిన్ సూచించారు.
కాగా, తెలంగాణలో బీజేపీ, కాంగ్రెస్ కార్యకర్తల దాడులు, నిరసనలతో ఒక్కసారిగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న సంగతి తెలిసిందే. నిన్న(సోమవారం, ఆగస్టు 31వ తేదీ) బీజేపీ రాష్ట్ర కార్యాలయ గేటుకు కాంగ్రెస్ శ్రేణులు నల్లరంగు వేయగా, ప్రతిగా నల్లగొండలో మంత్రి కోమటిరెడ్డి కార్యాలయంపై బీజేపీ శ్రేణులు దాడికి దిగాయి. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేపై, బిహార్‌లో విద్యార్థులపై బీజేపీ వ్యవహరించిన తీరును నిరసిస్తూ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కిడి శివ చరణ్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయాన్ని ముట్టడించారు.
బీజేపీ రాష్ట్ర కార్యాలయ గేటుకు యూత్ కాంగ్రెస్ శ్రేణులు నల్ల రంగు పూయడంపై బీజేవైఎం శ్రేణులు మండిపడ్డారు. దీనిని నిరసిస్తూ బీజేవైఎం ఆధ్వర్యంలో గాంధీభవన్ ముట్టడికి యతి?నంచారు. గాంధీభవన్‌పై కోడిగుడ్లు విసిరేసి నిరసన వ్యక్తం చేశారు. నిరసన వ్యక్తం చేస్తున్న బీజేపీ శ్రేణులను పోలీసులు అడ్డుకోవడంతో తీవ్ర ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి.
బీజేపీ, కాంగ్రెస్ పరస్పర నిరసన దాడులతో నల్లగొండ జిల్లా కేంద్రం అట్టుడికింది. శ్రీనగర్ కాలనీలో ఉన్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి క్యాంపు కార్యాలయంపై (వ్యక్తిగత కార్యాలయం) సోమవారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి నేతృత్వంలో కోడి గుడ్లు, టమాటాలతో దాడి చేశారు. అక్కడే ఉన్న మంత్రి ఫ్లెక్సీకి నిప్పంటించారు. దీంతో మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి నేతృత్వంలో దేవరకొండ రోడ్డు చైతన్యపురికాలనీలో ఉన్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి నివాసంపై కాంగ్రెస్ కార్యకర్తలు దాడిచేశారు.

# పేపర్ లీకేజీ కేసులో..అడ్డంగా దొరికిన ఏడో ర్యాంకర్

మొదటిపేజీ తరువాయి




మహారాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ డ్రగ్ ఇన్‌స్పెక్టర్ (గ్రూప్-బి) పరీక్ష ప్రశ్నపత్రం లీకేజీ కేసులో సంచలనం వెలుగుచూసింది. ఈ కేసులో తాత్కాలిక మెరిట్ జాబితాలో ఏడో ర్యాంకు సాధించిన రుతుజా పాటిల్‌ను ముంబై క్రైమ్ బ్రాంచ్ పోలీసులు నందుర్బార్‌లో అరెస్ట్ చేశారు. దీంతో ఈ కుంభకోణంలో అరెస్టయిన వారి సంఖ్య ఏడుకి చేరింది.
పరీక్షకు ముందే రుతుజా పాటిల్‌కు లీకైన ప్రశ్నపత్రం అందిందని పోలీసులు తెలిపారు. అయితే, అధికారులకు ఎలాంటి అనుమానం రాకుండా ఉండాలనే ప్లాన్‌తో.. కావాలనే 10 ప్రశ్నలకు తప్పు సమాధానాలు రాయాలని నిందితులు ఆమెకు సలహా ఇచ్చినట్లు విచారణలో తేలింది. కోర్టులో హాజరుపరిచిన అనంతరం రుతుజాను పోలీసులు కస్టడీకి తీసుకున్నారు.
మార్చి 22న మహారాష్ట్ర వ్యాప్తంగా ఆరు డివిజనల్ కేంద్రాల్లో డ్రగ్ ఇన్‌స్పెక్టర్ స్క్రీనింగ్ పరీక్ష ఆఫ్‌లైన్‌లో జరిగింది. జూన్ 12న వెలువడిన ఫలితాల్లో 506 మంది ఇంటర్వ్యూలకు అర్హత సాధించగా, జూలైలో ఇంటర్వ్యూలు పూర్తయ్యాయి. అయితే, పరీక్షలో అక్రమాలు జరిగాయంటూ జూలై 22 నుంచి 26 మధ్య అభ్యర్థులు, ప్రజాప్రతినిధుల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తాయి. లీకైన ప్రశ్నపత్రాలు సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా సర్క్యులేట్ అయినట్లు ప్రాథమిక విచారణలో తేలింది. దీంతో అప్రమత్తమైన ఎంపీఎస్సీ మొత్తం రిక్రూట్‌మెంట్ ప్రక్రియను రద్దు చేస్తున్నట్లు ప్రకటించి, పారదర్శకత కోసం త్వరలో మళ్లీ పరీక్ష నిర్వహిస్తామని స్పష్టం చేసింది.

ఈ పేపర్ లీక్ కుంభకోణంలో ఇప్పటికే ముగ్గురు ఎంపీఎస్సీ అధికారులతో పాటు మొత్తం ఆరుగురిని క్రైమ్ బ్రాంచ్ అరెస్ట్ చేసింది. విశ్వేశ్వర్ దత్తాత్రేయ నకాతే (ఎంపీఎస్సీ అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్),గోపాల్ భట్టు మరాతే (ఎంపీఎస్సీ అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్) అభిజీత్ గణపత్రావ్ లెండ్వే (ఎంపీఎస్సీ అండర్ సెక్రటరీ),ప్రవీణ్ దిలీప్ పాటిల్ (కౌటిల్య అకాడమీ డైరెక్టర్),అమృత్ నామ్‌దేవ్ పాటిల్, లోకేష్ అలియాస్ గౌరవ్ రాజేంద్ర పాటిల్ (సహ నిందితులు),నిందితులంతా కలిసి పరీక్షకు ముందే ప్రశ్నలను సేకరించి, ప్రత్యేక సెట్‌గా తయారు చేసి అనధికార వ్యక్తులకు చేరవేసినట్లు పోలీసులు గుర్తించారు. ప్రస్తుతం ఈ కేసులో అధికారులు దర్యాప్తు ముమ్మరం చేశారు.

# బెర్త్ బుక్ చేసినా.. పడుకోకూడదు!




రైలు ప్రయాణంలో మిడిల్ బెర్త్, లోయర్ బెర్త్ ప్రయాణికుల నడుమ వివాదాలు రావడం సర్వసాధారణం. ఇటీవల సికింద్రాబాద్ నుంచి విశాఖపట్నం వెళ్లే ఒక రైలులో జరిగిన సంఘటనే దీనికి ఉదాహరణ. సురేష్ అనే ప్రయాణికుడు లోయర్ బెర్త్ బుక్ చేసుకోగా, రమేష్ అనే వ్యక్తి మిడిల్ బెర్త్ బుక్ చేసుకున్నాడు. మధ్యాహ్నం 2 గంటల సమయంలో రమేష్ తన మిడిల్ బెర్త్‌ను ఓపెన్ చేసి పడుకుంటానని పట్టుబట్టగా లోయర్ బెర్త్‌లో కూర్చోవాలనుకున్న సురేష్ దానికి నిరాకరించాడు. దీంతో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగి టీటీఈ జోక్యం చేసుకోవాల్సి వచ్చింది. ఇలాంటి పరిస్థితుల్లో భారతీయ రైల్వే నిబంధనలు స్పష్టమైన మార్గదర్శకాలను అందిస్తున్నాయి.

**రైల్వే నిబంధనలు - వేళలు**
రాత్రి పూట 10:00 నుంచి ఉదయం 6:00 వరకు నిద్రపోయే వేళగా రైల్వే వర్గీకరించింది. ఈ సమయంలో మిడిల్ బెర్త్ ప్రయాణికుడు తన బెర్త్‌ను తెరచి పడుకునే పూర్తి హక్కు కలిగి ఉంటాడు. పగటి పూట అంటే ఉదయం 6:00 నుంచి రాత్రి 10:00 వరకు సీటింగ్ (కూర్చోవడానికి) కోసం కేటాయించారు. ఈ సమయంలో మిడిల్ బెర్త్‌ను తప్పనిసరిగా కిందకు దించి ఉంచాలి (ఫోల్డ్ చేయాలి). మిడిల్ బెర్త్, అప్పర్ బెర్త్ ప్రయాణికులు లోయర్ బెర్త్‌పై కూర్చోవడానికి అవకాశం ఇవ్వాలి. పైన పేర్కొన్న ఉదాహరణలో మధ్యాహ్నం 2 గంటలకు మిడిల్ బెర్త్ తెరవాలని రమేష్ కోరడం రైల్వే నిబంధనలకు విరుద్ధం. సురేష్ ఆ సమయంలో లోయర్ బెర్త్‌పై కూర్చునే హక్కు కలిగి ఉంటాడు. ఉదయం 6 గంటల నుంచి రాత్రి 10 గంటల మధ్య మిడిల్ బెర్త్ ప్రయాణికుడు పడుకోవాలని భావిస్తే అది లోయర్ బెర్త్ ప్రయాణికుడి పరస్పర అంగీకారంతో మాత్రమే జరగాలి. అలాగే, గర్భిణులు, వయోవృద్ధులు లేదా అనారోగ్యంతో ఉన్న ప్రయాణికులకు అనధికారికంగా సీట్లు సర్దుబాటు చేసుకోవడంలో తోటి ప్రయాణికులు మానవత్వంతో సహకరించాలని రైల్వే కోరుతోంది. ఒకవేళ ఏకాభిప్రాయం కుదరకపోతే టీటీఈ దృష్టికి తీసుకెళ్తే ఆయన నిబంధనల ప్రకారం సమస్యను పరిష్కరిస్తారు. ప్రయాణికులు ఈ ప్రాథమిక నిబంధనలు తెలుసుకోవడం వల్ల అనవసర గొడవలను నివారించి సుఖవంతమైన ప్రయాణాన్ని సాగించవచ్చు.

# ఈసారి లక్షా 40 వేల గణేష్ మండపాలు



మొదటిపేజీ తరువాయి
ఈసారి భాగ్య నగర పరిధిలో లక్షా నలభై వేల గణేష్ మండపాల సిద్ధమవుతున్నాయని భాగ్యనగర్ ఉత్సవ కమిటీ స్పష్టం చేసింది. ఈ మేరకు వాటి నిమజ్జనాలకు అవసరమయ్యే ఏర్పాట్లను చేయాలని ప్రభుత్వాన్ని కోరామని తెలిపింది. బడ్జెట్ కేటాయిపులో ప్రభుత్వం స్పీడ్ పెంచాలని మంత్రి దృష్టికి తీసుకెళ్ళామని, ఎప్పటిలాగే అన్నీ చెరువులు, వినాయక సాగర్‌లో నిమజ్జనం కొనసాగుతుందని బాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ప్రధాన కార్యదర్శి రావి నూతుల శశిధర్ సాక్షి టీవీకి తెలిపారు.
'అధికారుల తప్పుడు నివేదిక కారణంగా హైకోర్టు వినాయక సాగర్‌పై స్టే ఇచ్చింది. ఎక్కడ వినాయక నిమజ్జనం వల్ల పొల్యూషన్ జరిగినట్లు సరైన ఆధారాలు లేవు. కావాలనే కొందరు అధికారులు హిందూ పండుగలను ఆంక్షలు పెట్టాలని చూస్తున్నారు. కాప్రా చెరువుతో పాటు హైడ్రా డెవలప్ చేసిన అన్నీ చెరువుల్లో నిమజ్జనం చేస్తాం. అడ్డుకోవడానికి హైడ్రాకు ఎలాంటి అధికారం లేదు. చెరువులకు ఓనర్లు ప్రజలు.. అధికారులు, నాయకులు కాదు. చెరువుల్లో నిమజ్జనం చేయడం మా సంప్రదాయం. అందుకే అన్నీ చెరువుల్లో నిమజ్జనం కొనసాగిస్తాం. అడ్డుకోవాలని చూస్తే.. పరిణామాలు మరోలా ఉంటాయి' అని పేర్కొన్నారు.

## షాదీ ముబారక్‌ల పై హైకోర్టు కీలక ఉత్తర్వులు

మొదటిపేజీ తరువాయి
హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై ప్రభుత్వం కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయకపోవడంతో, విచారణ చేపట్టిన సింగిల్ జడ్జి పథకాల అమలుపై మధ్యంతర స్టే విధించారు.సింగిల్ జడ్జి ఉత్తర్వులను సవాలు చేస్తూ తెలంగాణ ప్రభుత్వం డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించింది. ప్రభుత్వం తరఫున అడ్వకేట్ జనరల్ (ఏజీ) సుదర్శన్ రెడ్డి వాదనలు వినిపిస్తూ, ఈ పథకాలు 2014 నుంచి నిరంతరాయంగా అమలవుతున్నాయని, పిటిషనర్ లబ్ధిదారుడు కానందున ఆయనకు ఎలాంటి నష్టం వాటిల్లలేదని కోర్టుకు తెలిపారు. ఇది ప్రజాప్రయోజన వ్యాజ్యం కాదని, ప్రభుత్వ విధానపరమైన నిర్ణయాలపై దాఖలైన ఇలాంటి వ్యాజ్యాలను డివిజన్ బెంచ్ మాత్రమే విచారించాలని వాదించారు. షాదీ ముబారక్ వంటి పథకాలకు సుప్రీంకోర్టు కూడా గతంలో అనుమతినిచ్చిందని ఈ సందర్భంగా గుర్తుచేశారు.అడ్వకేట్ జనరల్ వాదనలతో ఏకీభవించిన డివిజన్ బెంచ్, సింగిల్ జడ్జి ఇచ్చిన స్టే ఉత్తర్వులను ఎత్తివేస్తూ తీర్పునిచ్చింది. హైకోర్టు తాజా నిర్ణయంతో కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల అమలు రాష్ట్రవ్యాప్తంగా యథావిధిగా కొనసాగనుంది.

# ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలి

మొదటిపేజీ తరువాయి
ప్రభుత్వం ఫీజుల బకాయిలు చెల్లించకపోవడంతో కాలేజీ యాజమాన్యాలు ఒరిజినల్ సర్టిఫికెట్లు ఇవ్వకుండా విద్యార్థులను వేధిస్తున్నాయని ఆరోపించారు. కాంగ్రెస్ పాలనకు నేటితో వెయ్యి రోజులు పూర్తయ్యాయని పేర్కొంటూ 'ఎక్స్'లో హరీశ్‌రావు పోస్ట్ చేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌పై విమర్శలు గుప్పించారు."ప్రతిపక్షాలపై అసత్యాలు ప్రచారం చేయడంపై ఉన్న శ్రద్ధ.. క్షేత్రస్థాయిలో పిల్లలు పడుతున్న గోస మీద ఎందుకు లేదు? ప్రభుత్వం ఫీజుల బకాయిలు చెల్లించకపోవడంతో కాలేజీలు విద్యార్థులను వేధిస్తున్నాయి. కష్టపడి చదువుకున్నా సర్టిఫికెట్లు చేతికి రాక.. అటు ఉద్యోగాలకు, ఇటు పైచదువులకు వెళ్లలేక వారు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. తక్షణమే ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి" అని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

ట్రైనెట్ తెలంగాణ న్యూస్
నిజం • బాధ్యత • నిబద్ధత
తెలుగు దిన పత్రిక

బుధవారం సెప్టెంబర్ 02, 2026

www.trinetnews.com

# రాష్ట్రంలో ని లక్షలాది మంది విద్యార్థుల జీవితాలతో ఆటలాడుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి గట్టిగా బుద్ధి చెప్పాలని మాజీమంత్రి,

**హైదరాబాద్ , ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు 1:** బిఆర్ఎస్ పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తలసాని శ్రీనివాస్ యాదవ్ పిలుపునిచ్చారు. పీజు రీ యంబర్స్ మెంట్, స్కాలర్ షిప్ బకాయిలను వెంటనే విడుదల చేసేలా ప్రభుత్వం పై వత్తిడి తీసుకురావాలని కోరుతూ మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ కు ాదీవూ ఆధ్వర్యంలో విద్యార్థులు పెద్ద సంఖ్యలో ర్యాలీగా వచ్చి వెస్ట్ మారేడ్ పల్లి లోని క్యాంప్ కార్యాలయం వద్ద కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ పేద విద్యార్థుల ఉన్నత చదువులకు ఆర్థిక ఇబ్బందులు ఏర్పడవద్దనే ఆలోచనతో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి పీజు రీ యంబర్స్ మెంట్ ను తీసుకొచ్చారని చెప్పారు. కేసీఆర్ ముఖ్యమంత్రి అయిన తర్వాత కూడా విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సకాలంలో స్కాలర్ షిప్ లు, ఫీజు రీ యంబర్స్ లు చెల్లించిన విషయాన్ని గుర్తు చేశారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం వచ్చిన తర్వాత సుమారు 11 వేల కోట్ల రూపాయలు బకాయిలు పెట్టిందని మండిపడ్డారు. ప్రభుత్వం బకాయిలు చెల్లించని కారణంగా చదువు పూర్తయిన విద్యా సంస్థల యాజమాన్యాలు




సర్టిఫికెట్ లు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో విద్యార్థులే కాకుండా వారి తల్లిదండ్రులు కూడా మానసికంగా ఆందోళన చెందుతున్నారని అన్నారు. విద్యార్థులు తమ సమస్యల పరిష్కారం కోసం నిర్వహించే పోరాటాలకు బిఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని ప్రకటించారు. ప్రభుత్వం బకాయిలు చెల్లించేలా ఈ నెల 7 వ తేదీ నుండి జరిగే అసెంబ్లీ సమావేశాలలో వత్తిడి తీసుకొస్తామని చెప్పారు. విద్యార్థులు ఐక్య పోరాటాలు చేయడం ద్వారానే సమస్యలు



పరిష్కారం అవుతాయని గుర్తించాలని పిలుపునిచ్చారు. నీట్ ప్రశ్నాపత్రం లీక్ విషయంలో జెన్ జీ లు నిర్వహించిన ఆందోళనతో కేంద్ర ప్రభుత్వం వనికిపోయిందని, కేంద్రమంత్రి రాజీనామా చేయాల్సి వచ్చిందని చెప్పారు. అదే స్ఫూర్తితో విద్యార్థులు కాంగ్రెస్ ప్రభుత్వం పై పోరాటానికి సిద్ధం కావాలని కోరారు. ఎమ్మెల్యే కు వినతిపత్రం అందజేసిన వారిలో ాదీవూ నాయకులు బాలు, అభినయ్, గౌతమ్, రేవంత్ తదితరులు ఉన్నారు

# బిజెపి సాంస్కృతిక విభాగం సభ్యురాలిగా డా. బోనాల కిరణ్మయి ఎన్నిక

**హైదరాబాద్, రవీంద్ర భారతి ట్రైనెట్ న్యూస్, సెప్టెంబర్ 1:** బీజేపీ రాష్ట్ర సాంస్కృతిక విభాగంమేడ్చల్, మల్కాజిగిరి జిల్లా రాష్ట్ర సాంస్కృతిక విభాగం సభ్యురాలిగా డా. బోనాల కిరణ్మయి ఎన్నికైయ్యారు. ఈ మేరకు బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రా రావు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..బిజెపి సంస్కృతిక బోనాల కిరణ్మయి చేస్తున్న సేవలకు గుర్తింపుకు గాను సంస్కృతిక



రంగంలో అవకాశం కల్పించినట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం సంస్కృతిక రంగానికి పెద్ద పీట వేస్తుందని పేర్కొన్నారు. డా. బోనాల కిరణ్మయి మాట్లాడుతూ .. తనపై నమ్మకంతో బీజేపీ పార్టీ సంస్కృతిక విభాగంలో అవకాశం కల్పించినందుకు సంతోషంగా ఉందన్నారు. తెలుగు సంస్కృతి, సాంప్రదాయాలను విశ్వవ్యాప్తం చేయడానికి మరింత కృషి చేస్తానన్నారు. తనకు పార్టీలో పదవి ఇచ్చినందుకు రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు , సంస్కృత విభాగం కన్వీనర్ బీజేపీ రాష్ట్ర సాంస్కృతిక విభాగం రాష్ట్ర కన్వీనర్ నాగుపురం రాజమౌళి గౌడ్ కృతజ్ఞతలు తెలిపారు.

# వన మహోత్సవంలో ఆర్యవైశ్యుల సందడి



**నల్లగొండ జిల్లా ఇన్‌చార్జ్: విశ్వనాథ్**

**హాలియా, ట్రైనెట్ న్యూస్:** అనుముల మండల ఆర్యవైశ్య సంఘం, హాలియా పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వన మహోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆటపాటలు, నృత్యాలు, చిన్నారుల ఆటలు, మహిళల కోలాటాలు, యువకుల సందడితో కార్యక్రమం అంగరంగ వైభవంగా సాగింది. ఈ సందర్భంగా పాల్గొన్న వారందరికీ పసందైన విందు ఏర్పాటు చేశారు.

వన మహోత్సవం అనంతరం నూతనంగా ఎన్నికైన అనుముల మండల ఆర్యవైశ్య సంఘం, హాలియా పట్టణ ఆర్యవైశ్య సంఘం, అనుముల మండల యువజన సంఘం, హాలియా పట్టణ యువజన సంఘం కార్యవర్గాలతో ప్రమాణ స్వీకారం




చేయించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షులు వనమా వెంకటేశ్వర్లు, నల్లగొండ జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు తేలుకుంట్ల చంద్రశేఖర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. నూతన కార్యవర్గాలతో జిల్లా అధ్యక్షులు ప్రమాణ స్వీకారం చేయించారు. అనుముల మండల ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులుగా పోలా సైదులు, ప్రధాన కార్యదర్శిగా కొండూరు గణేష్, కోశాధికారిగా కట్ట మనోహర్ ప్రమాణ స్వీకారం చేశారు. హాలియా పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులుగా మంచుకొండ ప్రభాకర్, కార్యదర్శిగా మంచుకొండ శ్రీను, కోశాధికారిగా ఆకీ నాగరాజు బాధ్యతలు స్వీకరించారు. అనుముల మండల యువజన సంఘం అధ్యక్షులుగా బచ్చు వెంకన్న, కార్యదర్శిగా సముద్రాల అరవింద్, కోశాధికారిగా తేలప్రోలు ఉదయ్ కుమార్ ప్రమాణం చేశారు. హాలియా పట్టణ ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షులుగా బచ్చు సతీష్, కార్యదర్శిగా గందే



మహేష్, కోశాధికారిగా ఊరే వినోద్ బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో నల్లగొండ జిల్లా ఆర్యవైశ్య మహాసభ ప్రధాన కార్యదర్శి లక్ష్మీశెట్టి శ్రీనివాస్, కోశాధికారి జైనాల వెంకటేశ్వర్లు, అదనపు ప్రధాన కార్యదర్శి తేలుకుంట్ల జానయ్య, రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ కార్యవర్గ సభ్యులు, జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు నాంపల్లి భాగ్యలక్ష్మి, గుండా నాగరాజు, నల్లగొండ జిల్లా యువజన సంఘం అధ్యక్షులు వజ్రతేజ, రైస్ ఇండస్ట్రీస్ మేనేజింగ్ చైర్మన్ చిట్టిప్రోలు యాదగిరి, అనుముల మండల ఆర్యవైశ్య మహాసభ గౌరవ అధ్యక్షులు వీరమల్ల కృష్ణయ్య, మిట్టపల్లి వాసులు, చీదల్ల లింగయ్య, హాలియా పట్టణ గౌరవ అధ్యక్షులు కొత్తమాసు శ్రీనివాస్ మరియు గౌరవ సలహాదారులు కొత్తమాసు కృష్ణమూర్తి, తేలప్రోలు శేఖర్, పాంపాటి శ్రీను, వెంపటి శ్రీను, పాంపాటి పాండయ్య, సముద్రాల శ్రీను, వీరమల్ల శ్రీను, కొండూరు శోభన్ బాబు తదితరులు పాల్గొన్నారు. వన మహోత్సవం సందర్భంగా ఆర్యవైశ్య సంఘాల సభ్యులు, మహిళలు, యువకులు, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# రాహుల్ గాంధీ పై నమోదు చేసిన కేసును వెంటనే రద్దు చేయాలి

**హైదరాబాద్, అంబర్ పేట్ ట్రైనెట్ న్యూస్, సెప్టెంబర్ 1:** ఉత్తరాఖండ్ రాష్ట్రంలో రాహుల్ గాంధీ పై నమోదు చేసిన అట్రాసిటీ కేసును వెంటనే రద్దు చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వ సలహాదారుడు వి . హనుమంత రావు డిమాండ్ చేశారు. రాహుల్ గాంధీ పై నమోదు చేసిన ఎఫ్ఐఆర్ ను నివసిస్తూ.. అంబర్ పేట్ అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా



**హనుమంతరావు మాట్లాడుతూ..**

దళితులపై కులవివక్ష, అఘాయిత్యాలకు వ్యతిరేకంగా మాట్లాడే వారిని కేంద్ర ప్రభుత్వం అణిచివేయడానికి కుట్ర చేస్తుందని ఆరోపించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఆర్ లక్ష్మణ్ యాదవ్, ఖైరతాబాద్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి తొలుపునూరి కృష్ణ గౌడ్, దిలీప్ కుమార్ నేత తదితరులు పాల్గొన్నారు.

# పాత పెన్షన్ విధానాని వెంటనే అమలు చేయాలి

**ప్రభుత్వ సిటీ జూనియర్ కళాశాలలో అధ్యాపకుల నిరసన**



**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, సెప్టెంబర్ 1: సిపీస్** విద్రోహ దినం సందర్భంగా ప్రభుత్వ సిటీ కళాశాలలో అధ్యాపకులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఉద్యోగుల భవిష్యత్ భద్రతకు పెన్షన్ ఎంతో కీలకమని, కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ను రద్దు చేసి, పాత పెన్షన్ విధానాని వెంటనే అమలు చేయాలని అధ్యాపకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉద్యోగులు తమ జీవితంలో ఎన్నో సంవత్సరాలు ప్రభుత్వ సేవకు అంకితం చేసిన అనంతరం పదవీ విరమణ సమయంలో ఆర్థిక భద్రత కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు. పెన్షన్ అనేది కేవలం ఒక ఆర్థిక ప్రయోజనం కాదని, ఉద్యోగి భవిష్యత్ భద్రతకు సంబంధించిన హక్కు అని తెలిపారు. ఈ నిరసన కార్యక్రమంలో ప్రభుత్వ సిటీ కళాశాల ప్రిన్సిపాల్ అంజన్ కుమార్, కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొని సిపిఎస్ విధానంపై తమ నిరసనను వ్యక్తం చేశారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, అధ్యాపకుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం అందరూ ఐక్యంగా ఉద్యమించాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

సిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్ స్కీమ్ అమలు చేసే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని అధ్యాపకులు హెచ్చరించారు.

# దళిత బంధు పెండింగ్ నిధులను తక్షణమే విడుదల చేయాలి..

- **మూడు సంవత్సరాలుగా నిధులు నిలిచిపోయాయి: దళిత బంధు సాధన సమితి రాష్ట్ర కన్వీనర్ డా. బుషిపాక గణేశ్..**
- **ఫ్రీజింగ్ ఎత్తివేసి గ్రౌండింగ్ పూర్తి చేసి రూ.10 లక్షలు లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్..**

**తార్నాక, ట్రైనెట్ న్యూస్, సెప్టెంబర్ 1:** రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్ లో ఉన్న దళిత బంధు నిధులను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ దళిత బంధు సాధన సమితి రాష్ట్ర కన్వీనర్ డా. బుషిపాక గణేశ్ ఆధ్వర్యంలో మోత్కూర్, అడ్డగూడూరు మండలాలకు చెందిన దళిత బంధు లబ్ధిదారులు ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాలలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డా. బుషిపాక గణేశ్ మాట్లాడుతూ.. పేదల సంక్షేమం కోసం గత



ప్రభుత్వం దళిత బంధు పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. రెండో విడతలో భాగంగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో రూ.3 లక్షలు జమ చేసిన అనంతరం 2023 అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో కలెక్టర్లు బ్యాంకు ఖాతాలను ఫ్రీజ్ చేశారని తెలిపారు. రెండో విడత దళిత బంధు నిధులను విడుదల చేయాలని రాష్ట్ర కార్పొరేషన్ ఎండీ ఆదేశాలు ఇచ్చినప్పటికీ, ఇప్పటివరకు నిధులు పూర్తిస్థాయిలో విడుదల కాలేదని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడు సంవత్సరాలు గడిచినా దళిత బంధు నిధుల సమస్య పరిష్కారం కాలేదని, దీంతో లబ్ధిదారుల కుటుంబాలు అనేక సంక్షేమ పథకాలకు దూరమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే బ్యాంకు ఖాతాలపై ఉన్న ఫ్రీజింగ్‌ను ఎత్తివేసి, గ్రౌండింగ్ ప్రక్రియను పూర్తి చేసి ప్రతి లబ్ధిదారుడి ఖాతాలో మిగిలిన రూ.10 లక్షల దళిత బంధు నిధులను జమ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టిఎస్ఎస్ఏ రాష్ట్ర అధ్యక్షుడు తాళ్ల అజయ్, బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొంపల్లి నరేష్ తో పాటు దళిత బంధు లబ్ధిదారులు జిల్లా శివాజీ, జక్కుల గిరిబాబు, ఇటీకాల అంజన్న, చేడే సైదులు, బాలెంల నరేందర్, శ్రీరామ్‌ల ప్రదీప్, బుషిపాక సంజీవ, బట్ట చిన్న వెంకన్న, మంద విష్ణు తదితరులు పాల్గొన్నారు.

# కొత్తగూడెం విమానాశ్రయ ప్రతిపాదనపై సెప్టెంబర్ 7న కేంద్ర సాంకేతిక బృందం పర్యటన

- **నాలుగు నుంచి ఐదు ప్రత్యామ్నాయ స్థలాల పరిశీలన**
- **సాంకేతిక నివేదిక అనంతరం తదుపరి చర్యలు చేపడతామని కేంద్ర మంత్రి హామీ**
- **కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడితో రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు భేటీ**

**భద్రాద్రి, ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు 1 :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో విమానాశ్రయం ఏర్పాటు ప్రతిపాదనకు సంబంధించి నాలుగు నుంచి ఐదు ప్రత్యామ్నాయ స్థలాలను పరిశీలించేందుకు కేంద్ర సాంకేతిక బృందం సెప్టెంబర్ 7న తెలంగాణలో పర్యటించనుంది. న్యూఢిల్లీలో మంగళవారం కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడితో సమావేశమైన అనంతరం రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఈ విషయాన్ని వెల్లడించారు. గతంలో పరిశీలించిన రెండు స్థలాలు సాంకేతిక కారణాలతో విమానాశ్రయ నిర్మాణానికి అనుకూలంగా లేవని తేలడంతో, తాజాగా నాలుగు నుంచి ఐదు ప్రత్యామ్నాయ స్థలాలను గుర్తించినట్లు మంత్రి తెలిపారు. ఈ స్థలాల్లోని భౌగోళిక, వాతావరణ పరిస్థితులతోపాటు విమానాశ్రయ నిర్మాణానికి అవసరమైన సాంకేతిక సాధ్యాసాధ్యాలను కేంద్ర బృందం క్షేత్రస్థాయిలో పరిశీలిస్తుందని చెప్పారు. కేంద్ర సాంకేతిక బృందం నివేదిక అనుకూలంగా వచ్చిన అనంతరం కొత్తగూడెం విమానాశ్రయం ఏర్పాటుకు అవసరమైన తదుపరి చర్యలను కేంద్ర ప్రభుత్వం చేపడుతుందని కేంద్ర మంత్రి




రామ్మోహన్ నాయుడు హామీ ఇచ్చినట్లు మంత్రి తుమ్మల తెలిపారు. తెలంగాణలోని మామునూరు (వరంగల్), ఆదిలాబాద్ విమానాశ్రయాల ప్రతిపాదనలపై ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి సెప్టెంబర్ 2న కేంద్ర ప్రభుత్వంతో చర్చించే అవకాశం ఉందని పేర్కొన్నారు. కేంద్ర మంత్రి శ్రీ రామ్మోహన్ నాయుడు తండ్రి, దివంగత ఎర్రన్నాయుడు తన చిరకాల మిత్రుడని మంత్రి తుమ్మల గుర్తుచేసుకున్నారు. భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం ఉన్న ఈ ప్రాంత ప్రాధాన్యాన్ని, జిల్లా ప్రజలకు విమానాశ్రయం అవసరాన్ని కేంద్ర మంత్రికి వివరించినట్లు తెలిపారు.

“భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రజల దీర్ఘకాల ఆకాంక్షను కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లాను. నా విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించి, వెంటనే కేంద్ర సాంకేతిక బృందాన్ని పంపేందుకు చర్యలు చేపట్టిన కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడికి, కేంద్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు” అని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు.

# ఎస్ఐఆర్ ఓటర్ల సర్వేలో భాగంగా గ్రామసభ నిర్వహణ



**నల్లగొండ, ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు 1 :** మంగళవారం ఉదయం. 10.00 గంటలకు అమ్మనబోలు గ్రామపంచాయతీ కార్యాలయం ఆవరణంలో ఓటర్ల ఎస్ ఐ ఆర్ సర్వే కార్యక్రమంలో భాగంగా గ్రామసభ గౌరవ గ్రామ సర్పంచ్ శ్రీ కొంపెల్లి సైదులు గారి అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి నార్కట్ పల్లి మండలం తహసిల్దార్ గారు హాజరై ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎస్ ఐ ఆర్ సర్వేలో నోటీసులు వచ్చిన ఓటర్లకు సంబంధించిన ధ్రువపత్రాలు సమర్పించాలని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ గారు మరియు వార్డ్ మెంబర్లు గ్రామ కార్యదర్శి బి ఎల్ ఓ ల సూపర్వైజర్ సార్ గ్రామ జి పి ఓ సార్ మరియు మాజీ సర్పంచ్ మాజీ ఎంపీటీసీలు ఇతర మాజీ ప్రజాప్రతినిధులు గ్రామ యువకులు మహిళా సంఘాల సభ్యులు నోటీసులు వచ్చిన ఓటర్లు మరియు గ్రామ ప్రజలు మరియు బి ఎల్ ఓ లు మరియు బి ఎల్ ఏ లుపాల్గొని ఇట్టి కార్యక్రమాన్ని విజయవంతం చేసినారు.

త్రైనెట్ తెలంగాణ న్యూస్
నిజం • బాధ్యత • నిబద్ధత
తెలుగు దిన పత్రిక
బుధవారం సెప్టెంబర్ 02, 2026
www.trinetnews.com

# వెలుగుగుట్టపై రామాలయ నిర్మాణానికి ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి చొరవ..

- ఐలా అధికారులతో చర్చించి ఆలయ నిర్మాణానికి సహకరించాలని విజ్ఞప్తి..
- ప్రజల మనోభావాలను గౌరవిస్తూ సమస్యను సామరస్యంగా పరిష్కరించాలని సూచన..





**నాచారం, త్రైనెట్ న్యూస్, సెప్టెంబర్ 1:**
హబ్సిగూడ వెలుగుగుట్ట ప్రాంతంలో రామాలయ నిర్మాణానికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి చొరవ తీసుకున్నారు. రామాలయ నిర్మాణానికి సంబంధించిన గేటు, ఇతర నిర్మాణాలను ఐలా అధికారులు తొలగించడంతో స్థానికంగా నెలకొన్న పరిస్థితిపై ఎమ్మెల్యే స్పందించారు. స్వయంగా వెలుగుగుట్ట ప్రాంతానికి వెళ్లి పరిస్థితిని పరిశీలించారు. అనంతరం ఐలా అధికారులను కలిసి రామాలయ నిర్మాణాన్ని కొనసాగించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని కోరారు. ఆలయ నిర్మాణం స్థానిక ప్రజల విశ్వాసం, ఆధ్యాత్మిక భావోద్వేగాలతో ముడిపడి ఉన్నందున వారి మనోభావాలను గౌరవిస్తూ సమస్యను సానుకూలంగా పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఎమ్మెల్యే విజ్ఞప్తికి ఐలా అధికారులు సానుకూలంగా స్పందించి, రామాలయ నిర్మాణానికి సహకరిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ప్రజల విశ్వాసాలు, ఆధ్యాత్మిక భావాలకు గౌరవం కల్పిస్తూ సమస్య పరిష్కారానికి ఎమ్మెల్యే చొరవ తీసుకోవడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# తప్పిపోయిన వారి కోసం వెతికి.. కుటుంబాల చెంతకు చేర్చిన పోలీసులు..

- ఆశ్రయం కల్పించి ఆచూకీ కోసం విస్తృతంగా గాలింపు..
- పత్రికల్లో వచ్చిన ఫొటోలతో కుటుంబ సభ్యుల గుర్తింపు..

**చిలకలగూడ, త్రైనెట్ న్యూస్, సెప్టెంబర్ 1:**






దిక్కుతోచని స్థితిలో ఉన్న ఇద్దరు వృద్ధ మహిళలకు చిలకలగూడ పోలీసులు అండగా నిలిచారు. తప్పిపోయిన వారిని కేవలం గుర్తించడమే కాకుండా, వారి కుటుంబ సభ్యుల చెంతకు క్షేమంగా చేర్చి మానవత్వాన్ని చాటుకున్నారు. ఆగస్టు 31న చిలకలగూడ పోలీసుల పరిధిలో కనిపించిన బాలమణి, గోవిందమ్మలను ముందుగా డ్రీమ్ ఇండియా హోమ్‌లో ఆశ్రయం కల్పించారు. అనంతరం వారి వివరాలు, ఫొటోల ఆధారంగా కుటుంబ సభ్యుల కోసం పోలీసులు ఆరా తీశారు. పోలీసుల ప్రయత్నాలకు ఫలితం దక్కింది. గోవిందమ్మ కుటుంబ సభ్యులు సమాచారం అందుకుని పోలీస్ స్టేషన్‌కు చేరుకుని ఆమెను గుర్తించి ఇంటికి తీసుకెళ్లారు. మరోవైపు వికారాబాద్ కు చెందిన బాలమణి ఫొటోను పత్రికల్లో చూసిన కుటుంబ సభ్యులు చిలకలగూడ పోలీసులను సంప్రదించారు. వివరాలను పరిశీలించి గుర్తింపును నిర్ధారించిన పోలీసులు డ్రీమ్ ఇండియా హోమ్ నుంచి బాలమణిని తీసుకొచ్చి ఆమె బంధువులకు అప్పగించారు. ఇన్‌స్పెక్టర్ వలిశెట్టి రామకృష్ణ ఆదేశాల మేరకు హెడ్ కానిస్టేబుల్ పూస శ్రీనివాస్ ప్రత్యేక చొరవ చూపి ఇద్దరు మహిళలు తిరిగి తమ కుటుంబాలను చేరుకునేలా చర్యలు చేపట్టారు. ఎన్నో ఆందోళనల తర్వాత తమ వారిని సురక్షితంగా తిరిగి చూసుకున్న కుటుంబ సభ్యులు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఘటనలో చిలకలగూడ పోలీసులు చూపిన చొరవ, ఆప్యాయతకు స్థానికుల నుంచి అభినందనలు వ్యక్తమయ్యాయి.

# తెలంగాణలో ప్రమాదంలో ప్రజాస్వామ్యం: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు..

- నల్గొండకు వెళ్లకుండా మరోసారి బీజేపీ చీఫ్ హౌస్ అరెస్ట్..
- బీజేపీ జిల్లా అధ్యక్షుడి ఇంటిపై దాడిని ఖండించిన రాంచందర్‌రావు..





**తార్నాక, త్రైనెట్ న్యూస్, సెప్టెంబర్ 1:**
తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాం చందర్ రావును పోలీసులు మరోసారి హౌస్ అరెస్ట్ చేశారు. నల్గొండ జిల్లా బీజేపీ అధ్యక్షుడు నాగం వర్షిత్ రెడ్డి నివాసంపై కాంగ్రెస్ కార్యకర్తలు దాడి చేసి ధ్వంసం చేశారని ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో, ఆయనను పరామర్శించేందుకు బీజేపీ చీఫ్ నల్గొండ వెళ్లకుండా ఉస్మానియా యూనివర్సిటీ పోలీసులు రాం చందర్ రావు ను తార్నాకలోని ఆయన నివాసంలో హౌస్ అరెస్ట్ చేశారు. పోలీసుల చర్యను రాం చందర్ రావు తీవ్రంగా ఖండించారు. వారం రోజుల్లోనే తనను రెండోసారి హౌస్ అరెస్ట్ చేశారని ఆయన మండిపడ్డారు. గతంలో విద్యార్థులు తమ సమస్యల పరిష్కారం కోసం ఆందోళన చేస్తున్న సమయంలో వారిని కలవకుండా తనను అడ్డుకున్నారని, ఇప్పుడు పార్టీ జిల్లా అధ్యక్షుడి ఇంటిపై దాడి జరిగిన నేపథ్యంలో ఆయనను పరామర్శించేందుకు వెళ్లకుండా నిరోధించారని పేర్కొన్నారు.. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని వ్యవస్థాగతంగా అణచివేస్తుందని రాం చందర్ రావు విమర్శించారు. ప్రతిపక్ష నాయకులు విద్యార్థులు, పార్టీ కార్యకర్తలు, రాజకీయ దాడులకు గురైన బాధితులకు అండగా నిలవకుండా పోలీసు ఆంక్షలు విధించడం సరికాదన్నారు. ఒక చేతిలో రాజ్యాంగాన్ని ప్రదర్శిస్తూ, అధికారంలో ఉన్నప్పుడు ప్రజాస్వామ్య హక్కులను కాలరాయడం కాంగ్రెస్ పార్టీ ద్వంద్వ వైఖరికి నిదర్శనమని ఆయన విమర్శించారు.

# మాణికేశ్వరి నగర్ లో ఎస్ఐఆర్




# ఫేజ్--2 హెల్ప్ డెస్క్ ఏర్పాటు..

- ఓటర్ల సందేహాల నివృత్తికి ప్రత్యేక కేంద్రం..
- బీఎల్ఏ ల పనితీరును పరిశీలించి అవగాహన కల్పించిన గండికోట కుమార్..

**తార్నాక, త్రైనెట్ న్యూస్, సెప్టెంబర్ 1:**
ఎస్ఐఆర్ రెండో దశ (ఫేజ్--2) ప్రక్రియలో భాగంగా సీతాఫల్మండి డివిజన్ పరిధిలోని మాణికేశ్వరి నగర్ లో డీసీసీ ప్రధాన కార్యదర్శి గండికోట కుమార్ ఆధ్వర్యంలో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశారు. ఎస్ఐఆర్ ఫేజ్-2 కు సంబంధించి నోటీసులు అందుకున్న ఓటర్లకు అవసరమైన సహాయాన్ని అందించడంతో పాటు వారి సందేహాలను నివృత్తి చేసేందుకు ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సికింద్రాబాద్ డీసీసీ అధ్యక్షుడు దీపక్ జాన్, అసెంబ్లీ నియోజకవర్గ కాంటెస్టెడ్ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆదం సంతోష్ కుమార్, ఆదేశాల మేరకు హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసినట్లు గండికోట కుమార్ వెల్లడించారు. ఎస్ఐఆర్ కు సంబంధించి ఏవైనా సందేహాలు లేదా సమస్యలు ఉన్న ఓటర్లు హెల్ప్ డెస్క్ ను సంప్రదించి

# సికింద్రాబాద్ న్యూ క్లబ్ నూతన కార్యవర్గానికి ఎమ్మెల్యే శ్రీగణేష్ అభినందనలు

**నూతన అధ్యక్షుడు నోముల ప్రకాశ్ రావుకు సన్మానం**

**సికింద్రాబాద్, త్రైనెట్ న్యూస్, సెప్టెంబర్ 1:**



సికింద్రాబాద్ వెస్ట్ మారేడ్‌పల్లిలోని న్యూ క్లబ్‌కు నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు, కమిటీ సభ్యులు మంగళవారం పికెట్‌లోని క్యాంపు కార్యాలయంలో కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.
ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు నోముల ప్రకాశ్ రావుతో పాటు కమిటీ సభ్యులను ఎమ్మెల్యే శ్రీగణేష్ అభినందించారు. నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలియజేస్తూ, న్యూ క్లబ్ అభివృద్ధితో పాటు సభ్యుల సంక్షేమానికి కమిటీ సమర్థవంతంగా పనిచేయాలని ఆకాంక్షించారు. క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించే సామాజిక, క్రీడా, సాంస్కృతిక కార్యక్రమాలను మరింత విస్తృతంగా, పెద్ద ఎత్తున నిర్వహించాలని సూచించారు. న్యూ క్లబ్ అభివృద్ధికి భవిష్యత్తులో తన పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని ఎమ్మెల్యే శ్రీగణేష్ హామీ ఇచ్చారు.
ఈ కార్యక్రమంలో న్యూ క్లబ్ కమిటీ సభ్యులు కిరణ్ కుమార్, వినయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# జూబ్లీహిల్స్ డివిజన్లో మీటింగ్ ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ జిల్లా సెక్రెటరీ రాజేందర్ యాదవ్

**హైదరాబాద్, త్రైనెట్ న్యూస్, సెప్టెంబరు 1:**



సికింద్రాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ ( డిసిసి ) జూబ్లీహిల్స్ నియోజకవర్గం లో కార్మిక నగర్ డివిజన్ కి అబ్జర్వర్ గా సికింద్రాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ జనరల్ సెక్రటరీ శ్రీ ర్యాల రాజేందర్ యాదవ్ గారు ఈరోజు జూబ్లీహిల్స్ డివిజన్ లో Booth numbers( 180,181,179,178,186, 189,150,151,196,110, 111,112, 113, 114, 115, 116, 93, 95, 97,98)సందర్శించారు ూ×= గురించి ఓటరికి ఓటు ప్రముఖ్యత ఓటు ప్రతి ఒకరి హక్కు గురించి వారి సలహాలు సూచనలు పై తెలియచేయండి జరిగింది.ఈ కార్యక్రమం లో జూబ్లీహిల్స్ నియోజకవర్గం కార్మికనగర్ డివిజన్ ప్రెసిడెంట్ అందాలు సాబీర్, విజయ్, రాములు రోషి రెడ్డి కాంగ్రెస్ అందరు పాల్గొన్నారు.

# ప్రకాశ్‌నగర్‌లో వైభవంగా మంగళగౌరీ పూజ



**హైదరాబాద్, ప్రకాశ్‌నగర్, త్రైనెట్ న్యూస్ సెప్టెంబరు 1 :**
ప్రకాశ్‌నగర్‌లో లాస్య, రాఘవ దంపతుల నివాసంలో మంగళగౌరీ పూజ భక్తిశ్రద్ధలతో, వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డా. రాధిక, సారిక ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించి లాస్య--రాఘవ దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు. కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల సందడితో కార్యక్రమం ఆధ్యాత్మిక వాతావరణంలో ఘనంగా జరిగింది.

# విద్యార్థులు కెనడా వెళ్లాలంటే మరింత సొమ్ము అవసరం..!




కెనడా వీసా (ఝుఋఝు) కోసం దరఖాస్తు చేసుకుంటున్న విదేశీ విద్యార్థులకు అక్కడి ప్రభుత్వం కొత్త నిబంధన పెట్టింది. సెప్టెంబర్ 1వ తేదీ నుంచి ఏడాది జీవన వ్యయాల కోసం 23,448 కెనడా డాలర్లు (దాదాపు రూ.16లక్షలు) దరఖాస్తుల్లో చూపాల్సిందేనని పేర్కొంది. ఈ మేరకు ఇమిగ్రేషన్, రెఫ్యూజీస్ అండ్ సిటిజన్‌షిప్ కెనడా (×=జజ) నిబంధనల్లో మార్పు చేసింది. క్యూబెక్ మినహా అన్ని రాష్ట్రాలకు వచ్చే వారు దీనిని పాటించాల్సి ఉంటుంది.కెనడాలో ఉన్నత చదువుల (ొబఎఎ అఅ ఝుఋఝు) కోసం వెళ్లే విదేశీ విద్యార్థులు ఏడాది పాటు ఆర్థిక అవసరాలకు సరిపడా నిధులు తమ దగ్గర ఉన్నట్లు ఇమిగ్రేషన్ అధికారులకు చూపించాల్సి ఉంటుంది. ఈ పరిమితి (ట్యూషన్ ఫీజు, ట్రావెల్ ఖర్చులు కాకుండా) ప్రస్తుతం ఒక్కో వ్యక్తికి ఏడాదికి 22,895 కెనడియన్ డాలర్లుగా ఉండగా.. ఈ ఏడాది సెప్టెంబర్ 1 నుంచి 23,448 డాలర్లకు పెంచింది.
కుటుంబంతో ప్రయాణించే విద్యార్థులపైనా మరింత భారం పడనుంది. దరఖాస్తుదారుతో సహా ఇద్దరు కుటుంబ సభ్యులు ఉంటే వారు అప్లికేషన్‌లో 29,192 కెనడియన్ డాలర్లు (దాదాపు రూ.19లక్షలు) చెల్లించాల్సి ఉంటుంది. కెనడా స్టడీ పర్మిట్ కోసం దరఖాస్తు చేసుకునే సమయంలోనే వారి ట్యూషన్ ఫీజు, ట్రావెల్ ఖర్చులకు అదనంగా.. నివాసం, ఆహారం, రవాణా వంటి అవసరాల కోసం సరిపడా నిధులు తమ ఖాతాల్లో ఉన్నాయని నిరూపించుకోవాల్సి ఉంటుంది.

# జీవిత భాగస్వామికిచ్చే హెచ్4 వీసాలు ఇక ఉండవా?

వాషింగ్టన్: అమెరికా వీసా నిబంధనలను కఠినతరం చేయడంపై దృష్టిపెట్టిన ట్రంప్ సర్కారు.. హెచ్-4 వీసాలకు సంబంధించి ఓ గట్టి షాక్ ఇచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. హెచ్-4 వీసాదారులు తమ దేశంలో పని చేసేందుకు అనుమతులిచ్చే (వర్క్ పర్మిట్) విధానానికి మంగళం పాడే యోచనలో అది ఉన్నట్లు తెలుస్తోంది. ఈ ప్రతిపాదన కార్యరూపం దాలిస్తే.. హెచ్-1బీ వీసాలపై అమెరికాకు వెళ్లే భారతీయ నిపుణులకు గట్టి ఎదురుదెబ్బే. సాధారణంగా హెచ్-1బీ వీసాదారులు తమ జీవిత భాగస్వాములను హెచ్-4 వీసాలతో అమెరికాకు తీసుకెళ్తుంటారు. హెచ్-4 వీసాదారులు అక్కడ ఎంప్లాయిమెంట్ ఆథరైజేషన్ డాక్యుమెంట్లు (ఈఏడీలు) పొంది చట్టబద్ధంగా పని చేసుకోవచ్చు.



# అభివృద్ధి పనులను వేగవంతం చేసి పకడ్బందీగా చేపట్టాలి,

**•మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్,**





**ట్రైనెట్ న్యూస్, సెప్టెంబర్ 1:** ప్రభుత్వ పాఠశాలలలో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తిచేయాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని బెల్లంపల్లి మండల కేంద్రంలో గల కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్ తో కలిసి సందర్శించి భోజనశాల నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, మాట్లాడుతూ అన్ని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన సకల సదుపాయాలు కల్పించి నాణ్యమైన విద్య అందించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, ఈ క్రమంలో పాఠశాలలో చేపట్టిన భోజనశాల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని తెలిపారు. మెనూ ప్రకారం విద్యార్థులకు సకాలంలో పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందించాలని, విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. బెల్లంపల్లి మండల కేంద్రంలో చేపట్టిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణ పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. మండలంలోని చాకేపల్లి గ్రామంలో మండల తహసిల్దార్ కృష్ణ, సర్వే అధికారులు తో కలిసి రీ సర్వే ప్రక్రియను ప్రారంభించారు. ప్రభుత్వం భూ సమస్యల పరిష్కారం కోసం భూభారతి చట్టంను తీసుకువచ్చి రెవెన్యూ సదస్సులు నిర్వహించడం జరిగిందని , భూ సమస్యల శాశ్వత పరిష్కారంలో భాగంగా రీ-సర్వే కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో 11 నాన్ కడస్టల్ గ్రామాలు, 70 కడస్టల్ గ్రామాలు మొత్తంగా 81 గ్రామాలు రీ -సర్వేకు ఎంపిక కావడం జరిగిందని, తెలంగాణ సర్వే ఒ బౌండరీ చట్టం ప్రకారం రీ -సర్వే నిర్వహించడం జరుగుతుందని, చట్టం గురించి అవగాహన కలిగి ఉండి, క్షేత్రస్థాయిలో అమలు చేయాలని తెలిపారు. గ్రామసభల ద్వారా పట్టదారులకు సమాచారం అందించాలని, మొదట గ్రామసభ నిర్వహించి ప్రజలకు సమాచారం అందించి గ్రామ సరిహద్దును నిర్ణయించాలని, గ్రామ కంఠం, ప్రభుత్వ భూములు, చెరువులు, కుంటలు, అటవీ సంబంధిత భూములను సాధారణ సర్వేయర్, రెవెన్యూ ఇన్స్పెక్టర్, జి.పి.ఓ.ల ఆధ్వర్యంలో గుర్తించాలని తెలిపారు. తదుపరి సర్వే బృందంతో పాటు రెవెన్యూ బృందాలు ఏర్పాటు చేసి సర్వే నిర్వహించడం, సర్వే సమయంలో ఖచ్చితంగా ఫీల్డ్ రిజిస్టర్ నిర్వహించాలని, సంబంధిత జిపిఓలు అందుబాటులో ఉండి వివరాలను రికార్డు చేయడం ద్వారా క్లెయిమ్స్, అభ్యంతరాల పరిష్కరణ సులభతరం అవుతుందని తెలిపారు. ప్రతి బృందం లక్ష్యానికి అనుగుణంగా కార్యాచరణ రూపొందించుకొని సర్వే పనులను పూర్తి చేయాలని తెలిపారు. గ్రామాల హద్దుల నిర్ధారణకు సంబంధించిన సమాచారం సర్పంచ్ లు, రైతులకు అందించాలని, రీ-సర్వే ప్రక్రియలో ప్రజల సహకారం తీసుకుని పారదర్శకంగా పనులను పూర్తి చేయాలని తెలిపారు. రీ-సర్వేకు సంబంధించి నిర్ణీత ప్రొఫార్మాలో ఫారాలు అందుబాటులో ఉన్నాయని, నిబంధనల ప్రకారం సక్రమంగా పూర్తి చేసి రికార్డులను సిద్ధం చేయాలని సూచించారు. జి.పి.ఓ.లు భూములకు సంబంధించిన రెవెన్యూ రికార్డులను సక్రమంగా సిద్ధం చేసి, రీ-సర్వేకు అవసరమైన సమాచారాన్ని అందుబాటులో ఉంచాలని తెలిపారు.

అనంతరం తాండూర్ మండలం మధునాపూర్ గ్రామ శివారులో వరి సాగు చేస్తున్న రైతులతో బెల్లంపల్లి సబ్ కలెక్టర్, మండల తహసిల్దార్ జ్యోత్స్నతో కలిసి మాట్లాడారు. ఎల్ నినో ప్రభావంతో లోటు వర్షపాతం నమోదు అయ్యే అవకాశం ఉందని, వ్యవసాయ, వ్యవసాయ విస్తరణ అధికారుల ద్వారా రైతులకు అవగాహన కల్పించడం జరిగిందని తెలిపారు. రైతులు మాట్లాడుతూ తమ పొలాలకు సమీపంలో చెరువు ఉందని, అందువల్లనే వరి సాగు చేస్తున్నామని తెలిపారు. మండల తహసిల్దార్ కార్యాలయాన్ని సందర్శించి ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో నోటీసుల ప్రక్రియ నిర్వహణ వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో భాగంగా నో మ్యాపింగ్, అనమలిస్ జాబితాలో నోటీసులు ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలని, నిర్ణీత గడువులోగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రక్రియను వేగవంతం చేసి భారత ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని తెలిపారు. సాదా బైనమా, భూభారతి, రెవెన్యూ సదస్సులలో వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి రికార్డులతో సరిచూసి త్వరగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. భూ వివాదాల పరిష్కారం కోసం చేపట్టిన రీ సర్వే ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని తెలిపారు. భూముల రిజిస్ట్రేషన్ సమయంలో తహసిల్దార్ కార్యాలయాలలో సీలింగ్ డిక్లరేషన్‌ను పరిశీలించి, నిబంధనల ప్రకారం రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేపట్టాలని సూచించారు. భూభారతి దరఖాస్తులలో భూమి విస్తీర్ణానికి సంబంధించిన వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి, రికార్డులతో సరిపోల్చి చర్యలు చేపట్టాలని తెలిపారు.

ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కవ్వాల్ టైగర్ జోన్ రద్దు చేయాలని నిరాహార దీక్ష



**ట్రైనెట్ న్యూస్, సెప్టెంబర్ 1:** సెప్టెంబర్ 1 మంచిర్యాల జిల్లా జన్నారం మండల కేంద్రంలోని కవ్వాల టైగర్ జోన్ రద్దు చేయాలని భూమచారి గత 15 రోజులుగా నిరాహార దీక్ష చేస్తున్నాడు దీనికి మద్దతుగా జన్నారం మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు ఆయనకు మద్దతుగా నిరాహార దీక్షలో పాల్గొంటున్నారు ఇదిలా ఉంటే గత కొన్ని సంవత్సరాల క్రితం యధావిధిగా అడవిలోని పశువులను మేపుకోవడానికి ఎంతో వెసులుబాటు ఉండేదని ఇప్పుడు పశువులను అడవిలోకి తీసుకొని వెళితే కవ్వాల టైగర్ రిజర్వే పేరుతో పశువుల కాపర్లపై అక్రమంగా కేసులు పెట్టడమే కాకుండా వారికి ఇష్టం వచ్చినట్టు కొడుతున్నారనీ అన్నారు

### మనుషులు చనిపోతే కాల్చడానికి కట్టెలు ఇవ్వరా

యధావిధిగా గత కొన్ని సంవత్సరాల క్రితం నుండి వచ్చే సాంప్రదాయ పద్ధతిగా గ్రామాలలో మనుషులు చనిపోతే అడవి నుండి కట్టెలు తీసుకొచ్చి మనుషుల అంత్యక్రియలు చేసుకునేవారని అలాంటి కార్యక్రమాలు చేయడానికి కూడా అడవికి వెళ్ళిన అక్రమ కేసులు పెడుతున్నారని భూమాచారి ఆవేదన వ్యక్తం చేశారు

### ఇందిరమ్మ ఇండ్లకు ఇసుక ఇవ్వరా

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదలకు ఇచ్చిన ఇందిరమ్మ ఇల్లు కట్టుకోవడానికి ఇసుక తీసుకువస్తుంటే టైగర్ రిజర్వ్ అని కోర్ ఏరియా అని అటవీ శాఖ అధికారులు కొత్త కొత్త చట్టాలను తీసుకువస్తూ నిరుపేదలకు రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన ఇందిరమ్మ ఇండ్లకు ఇసుక ఇవ్వకుండా ఆటంకాలు కలిగించడంతోపాటు ట్రాక్టర్లను తీసుకువచ్చి అక్రమంగా సీజ్ చేసి వాటిపై కూడా కేసులు వేస్తూ ట్రాక్టర్ యజమానులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారు దీనిని కూడా వెంటనే రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వం కలిసి రద్దుచేసి పేదలకు ఇచ్చిన ఇందిరమ్మ ఇంళ్లకు యధావిధిగా ఇసుక ఇచ్చేంతవరకు నిరాహార దీక్ష ఆగదని భూమచారి ఆగ్రహం వ్యక్తం చేశారు

### అటవీశాఖ అధికారులకు ఇసుక ఎక్కడిది

అటవీశాఖ అధికారులు అడవిలో నిర్మిస్తున్న భారీ భారీ వాస్ టవర్లకు ఇసుక ఎక్కడి నుండి తీసుకొస్తున్నారని వారు కూడా అక్రమంగా వాగుల నుండి తీసి వాష్ టవర్లను కడుతున్నారని అన్నారు అటవీశాఖ అధికారులు ఏమైనా కాళేశ్వరం నుండి టాక్సీలు కట్టి కొనుగోలు చేస్తున్నారా ఏంటి అని ఆయన పేర్కొన్నారు మరి అటవీ శాఖ అధికారులకు ఒక చట్టం మండలంలోని ప్రజలకు మరొక చట్టం అని ఆయన అన్నారు వెంటనే రాష్ట్ర ప్రభుత్వం మరియు కేంద్ర ప్రభుత్వం కవ్వాల్ టైగర్ జోన్ ను రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేస్తే నే గాని నా యొక్క నిరాహార దీక్ష ఆగదని ఆయన జన సముద్రం న్యూస్ తో ఈరోజు మాట్లాడారు

# రేషన్ కార్డుల పంపిణీపై కాంగ్రెస్ నాయకుల హర్షం



**ట్రైనెట్ న్యూస్, సెప్టెంబర్ 1:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజల వద్దకే పాలనను తీసుకువెళ్తోందని జిల్లా కాంగ్రెస్ సీనియర్ నాయకుడు శనిగరపు వెంకటేష్ అన్నారు.రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు.ఎల్కతుర్తి మండల కేంద్రంలో 1,400 స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాల మేరకు అర్హులైన ప్రతి కుటుంబానికి రేషన్ కార్డు అందేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు. కొత్త రేషన్ కార్డుల ద్వారా పేద కుటుంబాలకు సన్నబియ్యం, పౌష్టికాహారం అందడంతో వారి ఆకలి తీర్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.రేషన్ కార్డులు లేని అర్హులైన పేదలను గుర్తించి ప్రతి కుటుంబానికి కార్డు అందేలా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కృషి చేస్తున్నారని వెంకటేష్ తెలిపారు. కలెక్టర్ నుంచి ఆర్డీవో, తహసీల్దార్ వరకు అధికారులు ప్రజలకు సేవలందిస్తూ అర్హులైన వారందరికీ రేషన్ కార్డులు అందించాలని కోరారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు శీలం అనిల్‌కుమార్, ఇందిరమ్మ కమిటీ సభ్యుడు కడారి సురేందర్, సీనియర్ యూత్ కాంగ్రెస్ నాయకులు అంచనగిరి వెంకటరమణ, ఎలకంటి అరుణ, కొమ్మిడి కల్పనాదేవి, గొల్లె రాధ, అల్లం భాగ్య, ప్రమీలారెడ్డి, కందాల మొగిలి, బోనగిరి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# దేవరకొండ ప్రాంతీయ ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచిత అంబులెన్స్ సేవలు ప్రారంభం

**•జెండా ఊపి ప్రారంభించిన స్థానిక ఎమ్మెల్యే బాలు నాయక్, జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్**



**ట్రైనెట్ న్యూస్, సెప్టెంబర్ 1:** పేద ప్రజలకు అత్యవసర వైద్య సేవలను మరింత చేరువ చేయాలనే లక్ష్యంతో దేవరకొండ ప్రాంతీయ ఆసుపత్రికి 'సమాచార హక్కు ప్రచార్ సమితి' రాష్ట్ర అధ్యక్షులు కాట్రవత్ రాజు నాయక్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత అంబులెన్స్ సేవలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి

?స్థానిక ప్రాంతీయ ఆసుపత్రి ప్రాంగణంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్, జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్, డీసీహెచ్ఎస్ మాతృ నాయక్ ముఖ్య అతిథులుగా హాజరై, జెండా ఊపి అంబులెన్స్ సేవలను లాంఛనంగా ప్రారంభించారు.

?ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ ఆపదలో ఉన్న పేద రోగులకు సకాలంలో అత్యవసర వైద్యం అందేలా ఉచిత అంబులెన్స్ సేవలను అందుబాటులోకి తీసుకురావడం ఎంతో అభినందనీయమని కొనియాడారు. అనంతరం సమాచార హక్కు ప్రచార్ సమితి రాష్ట్ర అధ్యక్షులు కాట్రావత్ రాజు నాయక్ మాట్లాడుతూ ఆపదలో ఉన్న ప్రజల ప్రాణాలను కాపాడటం, అత్యవసర సమయాల్లో పేద రోగులకు అండగా నిలవడమే తమ సంస్థ ప్రధాన ధ్యేయమని పేర్కొన్నారు.

?ఈ కార్యక్రమంలో దేవరకొండ ఆర్డీవో పద్మప్రియ, మున్సిపల్ చైర్‌పర్సన్ పున్న శైలజ, ఆర్‌టీఐ కమిటీ సభ్యులు ఎస్.కె. కైసర్, ఎం. నరేష్, లక్ష్మీనారాయణ, హరీష్, వెంకటేశ్వర్లు, ఆంజనేయులు, అరుణ్, అఫ్రోజ్ తదితరులతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ఆసుపత్రి సిబ్బంది, స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

# ప్రభుత్వ పథకాల అమలులో వేగం పెంచాలి,





**• మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య,**

**ట్రైనెట్ న్యూస్, సెప్టెంబర్ 1:** ప్రభుత్వ పథకాల అమలులో అధికారులు వేగం పెంచి, నిర్దేశిత లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య అన్నారు. మంగళవారం జిల్లాలోని తాండూర్ మండలంలో కొనసాగుతున్న వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల పురోగతిని పరిశీలించారు. మాదారం గ్రామపంచాయతీని సందర్శించి ఎస్ఐఆర్ నోటీసుల పంపిణీ ప్రక్రియను పరిశీలించి సిబ్బందితో ప్రక్రియ నిర్వహణ వివరాలు తెలుసుకుని, నోటీసుల పంపిణీ, విచారణకు సంబంధించిన పనులను నిబంధనల ప్రకారం పారదర్శకంగా నిర్వహిస్తూ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

అనంతరం మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయాన్ని సందర్శించి చేయూత పింఛన్లకు సంబంధించిన పనులు, వ్యక్తిగత మరుగుదొడ్ల తదితర కార్యక్రమాల పురోగతిని సమీక్షించారు. ఆయా పథకాల కింద చేపడుతున్న పనులు, పెండింగ్ అంశాలు, లబ్ధిదారులకు అందుతున్న సేవలపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. క్షేత్రస్థాయిలో పనులను వేగవంతం చేసి, అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. టెక్నికల్ అసిస్టెంట్లు తమ పరిధిలోని పనులపై ప్రత్యేక దృష్టి సారించి త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.మండలంలోని బోయపల్లి ప్రీ-ప్రైమరీ పాఠశాల, ప్రాథమిక ఉన్నత పాఠశాల లను సందర్శించి విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి వారి పఠన సామర్థ్యాలను తెలుసుకున్నారు. బేస్‌లైన్ పరీక్షల ఫలితాలను పరిశీలించి, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను బట్టి బోధనా విధానాలను రూపొందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించి ప్రత్యేక తరగతులు నిర్వహించాలని, విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వాతావరణం, అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. బోయపల్లి గ్రామపంచాయతీ కార్యాలయాన్ని సందర్శించి ఎస్ఐఆర్ విచారణ ప్రక్రియను పరిశీలించారు. విచారణకు హాజరైన వారి నుంచి వివరాలు తెలుసుకుని, ప్రతి అంశాన్ని నిబంధనల ప్రకారం పరిశీలించి పారదర్శకంగా నమోదు చేయాలని అధికారులకు సూచించారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా విచారణ ప్రక్రియ నిర్వహించాలని తెలిపారు.ఈ పర్యటనలో తహసిల్దార్ జ్యోత్స్న, మండల పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీనివాస్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ పనులు కల్పించండి: పుల్లల చెరువు ఎస్సీ కాలనీ వాసులు.

**వర్షాలు లేక పొలం పనులు లేక ఇళ్ల వద్దనే ఉంటున్నాం ఎంపీడీవోకు అర్జీ అందజేసిన పుల్లలచెరువు ఎస్సీ కాలనీ వాసులు**

**ట్రైనెట్ న్యూస్, సెప్టెంబర్ 1:** పుల్లలచెరువు గ్రామపంచాయతీ పరిధిలోని ఎస్సీ కాలనీకి చెందిన ఉపాధి హామీ కూలీలు తమకు ఉపాధి హామీ పథకం కింద పనులు కల్పించాలని కోరుతూ మంగళవారం మండల పరిషత్ అభివృద్ధి అధికారికి (ఎంపీడీవో) అర్జీ అందజేశారు.

ప్రస్తుతం వర్షాలు లేకపోవడంతో వ్యవసాయ పనులు కూడా అందుబాటులో లేవని, దీంతో తాము పనులు లేక ఇళ్ల వద్దనే ఖాళీగా ఉండాల్సి వస్తోందని కూలీలు తెలిపారు. తమకు ఉపాధి కల్పించేందుకు గ్రామంలో ఉపాధి హామీ పనులు వెంటనే ప్రారంభించాలని వారు ఎంపీడీవోను కోరారు.అలాగే ఉపాధి హామీ పనులు కల్పించాలని కోరుతూ డిమాండ్ పారం కూడా సమర్పించినట్లు కూలీలు తెలిపారు. దీనిపై స్పందించిన ఎంపీడీవో ఉపాధి హామీ పథకం కింద కూలీలకు పనులు కల్పిస్తామని హామీ ఇచ్చినట్లు వారు వెల్లడించారు.వ్యవసాయ పనులు లేని సమయంలో ఉపాధి హామీ పథకం ద్వారా పనులు కల్పిస్తే తమ కుటుంబాలకు ఆర్థికంగా ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని కూలీలు పేర్కొన్నారు.

# ఎల్లమ్మబండ హిందు, ముస్లిం క్రిస్టియన్ స్మశానవాటిక సుందరికరణ పనులను పరిశీలించిన దొడ్ల వెంకటేష్ గౌడ్



**ట్రైనెట్ న్యూస్, సెప్టెంబర్ 1:** కూకట్పల్లి ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఎల్లమ్మబండ హిందు, ముస్లిం మరియు క్రిస్టియన్ స్మశానవాటిక లో జరుగుతున్న అభివృద్ధి పనులను ఉమ్మడి ఆల్విన్ కాలనీ డివిజన్ మాజీ కార్పొరేటర్ శ్రీ దొడ్ల వెంకటేష్ గౌడ్ పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్మశాన వాటికలో నిర్మిస్తున్న కాంపౌండ్ వాల్ నిర్మాణ పనులను నాణ్యత ప్రమాణాలతో యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని తెలియచేసారు అంతిమయాత్రలో కూడా ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా స్మశానవాటికకు కావలిసిన అన్ని మౌలిక వసతులు చేకూర్చుతామని తెలియచేశారు. ఈ కార్యక్రమంలో షౌకత్ అలీ మున్నా, ఖాజా, నవాజ్, సమ్మద్, కైసర్, సుల్తాన్, ఖాజా, ఖలీమ్, ఇంతియాజ్, గౌస్, ఇస్మాయిల్, తదితరులు పాల్గొన్నారు.

# కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పై స్టే ఎత్తివేత



**ట్రైనెట్ న్యూస్, సెప్టెంబర్ 1:** కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల అమలుకు సంబంధించి సింగిల్ బెంచ్ విధించిన స్టేను ఎత్తివేస్తూ గౌరవ న్యాయస్థానం ఇచ్చిన తీర్పు పట్ల కల్వకుర్తి శాసనసభ్యులు శ్రీ కసిరెడ్డి నారాయణరెడ్డి హర్షం వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే. మాట్లాడుతూ, పేద, మధ్యతరగతి కుటుంబాలకు అండగా నిలిచే కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు ఎంతో కీలకమైనవని పేర్కొన్నారు. వివాహ సమయంలో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొనే అర్హులైన కుటుంబాలకు ఈ పథకాల ద్వారా ప్రభుత్వం అందించే ఆర్థిక సాయం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు.

స్టే కారణంగా పెండింగ్‌లో ఉన్న అర్హులైన లబ్ధిదారుల దరఖాస్తులను వెంటనే పరిశీలించి, నిబంధనల ప్రకారం త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అర్హత ఉన్న ఒక్క లబ్ధిదారుడికి కూడా అన్యాయం జరగకుండా పారదర్శకంగా ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు.

కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పేద, బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, సంక్షేమ పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే. తెలిపారు.

# ప్రజా పాలన ప్రభుత్వంలో 1000 రోజుల్లో రవాణా రంగంలో విప్లవాత్మక సంస్కరణలు

**మహిళా సాధికారత, ఉద్యోగ సంక్షేమం, ఆధునిక ప్రజా రవాణాకు పెద్దపీట**

**2,932 కొత్త బస్సుల కొనుగోలు.. 1,024 ఎలక్ట్రిక్ బస్సుల సేవలు**

**హైదరాబాద్‌లో మరో 2,200 ఎలక్ట్రిక్ బస్సులు త్వరలో రోడ్డెక్కనున్నాయి**

**ఆర్టీసీని దేశంలోనే నంబర్-1గా నిలిపేందుకు కృషి**

**విజన్ 2047 కి అనుగుణంగా ఆర్టీసీ మరింత ముందుకు పోతున్నాం -మంత్రి పొన్నం ప్రభాకర్**



**ట్రైనెట్ న్యూస్, సెప్టెంబర్ 1:** ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలోని ప్రజా పాలన ప్రభుత్వం 1000 రోజుల పాలనను విజయవంతంగా పూర్తి చేసుకున్న సందర్భంగా తెలంగాణ రవాణా శాఖ, టీజీఎస్ఆర్టీసీలో అనేక విప్లవాత్మక సంస్కరణలు చేపట్టామని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. మంగళవారం బస్ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో రవాణా శాఖ, ఆర్టీసీ ప్రగతిని వివరించారు.ప్రజలకు సురక్షితమైన, సౌకర్యవంతమైన, ఆధునిక ప్రజా రవాణా అందించడంతో పాటు ఉద్యోగుల సంక్షేమం, మహిళా సాధికారత, పర్యావరణ పరిరక్షణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి తెలిపారు.

## 48 గంటల్లోనే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 48 గంటల్లోనే మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని ప్రారంభించామని మంత్రి తెలిపారు.

ఇప్పటివరకు 347.36 కోట్ల మంది మహిళలు ఉచితంగా ప్రయాణించారని, తద్వారా మహిళలు సుమారు రూ.12,167 కోట్లు ఆదా చేసుకున్నారని చెప్పారు. ఈ పథకం వల్ల మహిళల ఆర్థిక సాధికారత పెరిగిందని, కుటుంబ ఆర్థిక వ్యవస్థకు మహిళలు మరింత అండగా నిలుస్తున్నారని పేర్కొన్నారు.మహాలక్ష్మి పథకం అమలుకు ముందు ఆర్టీసీ ఆక్యుపెన్సీ సుమారు 67 శాతం ఉండగా, ప్రస్తుతం 89 శాతానికి పెరిగిందని మంత్రి తెలిపారు.

## మహిళలను బస్సుల యజమానులుగా తీర్చిదిద్దుతున్నాం

మహిళలను కేవలం ప్రయాణికులుగా కాకుండా రవాణా రంగంలో యజమానులుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో దేశంలోనే తొలిసారిగా ాజు్రూ/మహిళా సంఘాల ద్వారా 600 బస్సులను కొనుగోలు చేయించి వాటి నిర్వహణ బాధ్యతలను మహిళా సంఘాలకు అప్పగించామని మంత్రి తెలిపారు.ప్రతి బస్సుకు నెలకు సుమారు రూ.69,468 చొప్పున జుఙీ× చెల్లిస్తున్నామని, ఇప్పటివరకు సుమారు రూ.29.31 కోట్లు చెల్లించామని చెప్పారు.

## ఆర్టీసీలో 2,932 కొత్త బస్సులు

ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 2,932 కొత్త బస్సులను కొనుగోలు చేశామని మంత్రి తెలిపారు.ప్రస్తుతం రాష్ట్రంలో 1,024 ఎలక్ట్రిక్ బస్సులు విజయవంతంగా నడుస్తున్నాయని, హైదరాబాద్ నగరంలో త్వరలో మరో 2,200 ఎలక్ట్రిక్ బస్సులను రోడ్డెక్కించనున్నామని చెప్పారు.ూవీ జు-ఐ=×ఎజు కార్యక్రమం కింద హైదరాబాద్‌లో ఎలక్ట్రిక్ బస్సులను నడుపుతున్నామని, ఇప్పటికే 240 డీజిల్ బస్సులను రెట్రోఫిట్ చేస్తున్నామని తెలిపారు. హైదరాబాద్‌లో కాలుష్యాన్ని తగ్గించేందుకు ఎలక్ట్రిక్ వాహనాల విధానాన్ని అమలు చేస్తూ సుమారు రూ.1,400 కోట్ల మేర పన్ను మినహాయింపులు కల్పించామని మంత్రి వెల్లడించారు.

## ఆర్టీసీ ఉద్యోగుల సంక్షేమానికి ప్రాధాన్యత

ఆర్టీసీ ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. 4,538 ఉద్యోగాల భర్తీకి చర్యలు చేపట్టామని, అందులో 1,000 డ్రైవర్, 743 శ్రామిక పోస్టుల నియామక ప్రక్రియ పూర్తయిందని చెప్పారు. త్వరలో ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారి చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేస్తామని తెలిపారు.అలాగే 1,500 కండక్టర్ పోస్టుల భర్తీకి ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని వెల్లడించారు. నియామకాల్లో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పోలీస్ శాఖ ద్వారా పారదర్శకంగా ప్రక్రియ చేపట్టామని చెప్పారు. గతంలో సర్వీసు నుంచి తొలగించబడిన సుమారు 244 మంది ఉద్యోగులను ప్రత్యేక ఞూా కమిటీ పరిశీలన అనంతరం తిరిగి విధుల్లోకి తీసుకున్నామని మంత్రి తెలిపారు.

## కారుణ్య నియామకాల సమస్యకు పరిష్కారం

విధి నిర్వహణలో మరణించిన లేదా అకాల మరణానికి గురైన ఆర్టీసీ ఉద్యోగుల కుటుంబాలను ఆదుకునేందుకు దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కారుణ్య నియామకాల సమస్యను పరిష్కరించామని మంత్రి తెలిపారు.బెడ్ విన్నర్స్ స్కీమ్ కింద 1,424 కారుణ్య నియామకాలు చేపట్టి బాధిత కుటుంబాలకు ఉద్యోగ భద్రత కల్పించామని చెప్పారు.

## ఉద్యోగులకు రెండు PRCలు -- 5 DAలు

ఆర్టీసీ కార్మికులకు ప్రభుత్వం రెండు ాూజులు ఇచ్చిందని, ఐదు ణూలు మంజూరు చేసిందని మంత్రి తెలిపారు. ప్రస్తుతం పెండింగ్ ణూలు లేవని చెప్పారు.

ప్రతి నెల మంగళవారం కార్మికుల గ్రీవెన్స్ డే నిర్వహిస్తూ వారి సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరిస్తున్నామని తెలిపారు.ఆర్టీసీ కార్మిక సంఘాల ఎన్నికలు నిర్వహిస్తున్నామని, ఎన్నికల్లో గెలిచిన ప్రతినిధులతో అధికారుల కమిటీ ఏర్పాటు చేసి విలీన ప్రక్రియను పూర్తి చేస్తామని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన ఇబ్బందులు పునరావృతం కాకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు.

## ఆర్టీసీ ఆర్థిక స్థిరత్వం దిశగా అడుగులు

ఆర్టీసీ ఆర్థిక పరిస్థితిని మెరుగుపరిచేందుకు పెండింగ్ బకాయిలను క్రమబద్ధీకరిస్తున్నామని మంత్రి తెలిపారు.

- జుజు బకాయిలు: రూ.1,096 కోట్ల నుంచి రూ.939 కోట్లకు తగ్గింపు-ూఖీ బకాయిలు: రూ.2,108 కోట్ల నుంచి రూ.1,710 కోట్లకు తగ్గింపు- ూ=దీూ ఃూదీు బకాయిలు: రూ.513 కోట్ల నుంచి రూ.485 కోట్లకు తగ్గింపుఉద్యోగులకు సంబంధించిన పెండింగ్ బకాయిల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు చేపడుతోందని తెలిపారు.

## తార్నాక సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి అభివృద్ధి

ఆర్టీసీ ఉద్యోగులు, వారి కుటుంబాల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని తార్నాక సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని అభివృద్ధి చేశామని మంత్రి తెలిపారు.

## గ్రామాలకు, కొత్త రూట్లకు విస్తరించిన బస్సు సేవలు

ప్రజా ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి వారు సూచించిన కొత్త రూట్లలో బస్సు సర్వీసులను ప్రారంభిస్తున్నామని మంత్రి తెలిపారు.హైదరాబాద్ నగరంలో 370 కొత్త రూట్లలో బస్సు సర్వీసులు నడుపుతున్నామని, గ్రామాల్లో కూడా ఇప్పటివరకు బస్సు సౌకర్యం లేని ప్రాంతాలకు సర్వీసులను విస్తరిస్తున్నామని చెప్పారు.ఎంఎంటీఎస్, మెట్రో రైలు, ఆర్టీసీ సమన్వయంతో లాస్ట్ మైల్ కనెక్టివిటీ మరింత మెరుగుపరుస్తామని తెలిపారు.టికెటింగ్‌లో ఎలక్ట్రానిక్ టికెటింగ్ మెషీన్ల వినియోగాన్ని విస్తరిస్తున్నామని చెప్పారు.

## బస్ స్టేషన్ల ఆధునికీకరణ

ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు రాష్ట్రవ్యాప్తంగా బస్ స్టేషన్లను ఆధునీకరిస్తున్నామని మంత్రి తెలిపారు.పెద్దపల్లి, ఏటూరునాగారం ప్రాంతాల్లో కొత్త డిపోలను ఏర్పాటు చేశామని, రాబోయే గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని బస్ స్టేషన్లను ఆధునీకరించడంతో పాటు ప్రత్యేక బస్సు సర్వీసులను నడుపుతామని చెప్పారు.మేడారం జాతరకు కూడా విజయవంతంగా ప్రత్యేక బస్సు సర్వీసులు నిర్వహించామని తెలిపారు.

## రవాణా శాఖలో ఆధునిక సాంకేతికత

తెలంగాణలో వాహన రిజిస్ట్రేషన్‌లో యా స్థానంలో ు+ విధానాన్ని 15 మార్చి 2024 నుంచి అమల్లోకి తీసుకొచ్చామని మంత్రి తెలిపారు. ఇప్పటివరకు 23.41 లక్షల కొత్త వాహనాలు ు+ రిజిస్ట్రేషన్‌తో నమోదయ్యాయని చెప్పారు.రవాణా శాఖ సేవలను ప్రజలకు మరింత సులభతరం చేసేందుకు వాహన్, సారథి సేవలను విస్తృతంగా అందుబాటులోకి తీసుకొచ్చామని తెలిపారు.

గత పదేళ్లుగా తెలంగాణ మాత్రమే వాహన్ వ్యవస్థలో చేరలేదని, ముఖ్యమంత్రి సూచనల మేరకు తెలంగాణను వాహన్ వ్యవస్థలోకి తీసుకొచ్చామని చెప్పారు.పాత వాహనాలను దశలవారీగా తొలగించి కాలుష్యాన్ని తగ్గించడం, రోడ్డు భద్రతను పెంచడం లక్ష్యంగా వాహన స్క్రాపింగ్ పాలసీ తీసుకొచ్చామని తెలిపారు.ఎలక్ట్రిక్ వాహనాలకు భారీ ప్రోత్సాహరాష్ట్రంలో ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని ప్రోత్సహించేందుకు రిజిస్ట్రేషన్ ఫీజు, మోటార్ వెహికల్ ట్యాక్స్‌లో మినహాయింపులు కల్పిస్తున్నామని మంత్రి తెలిపారు.ఇప్పటివరకు 1,58,157 ఎలక్ట్రిక్ వాహనాలకు రూ.1,493 కోట్ల మేర మినహాయింపు లభించిందని చెప్పారు.

## ఆటో కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

ఆటో కార్మికులు సమ్మెకు వెళ్లకుండా వారి న్యాయమైన డిమాండ్లపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించిందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.2012 తర్వాత ఆటో చార్జీలు పెరగలేదని, చార్జీల పెంపుపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని చెప్పారు.ఆటో కార్మికుల కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని, వారం రోజుల్లో సమావేశం నిర్వహించి దీనిపై నిర్ణయం తీసుకుంటామని ప్రకటించారు.హైదరాబాద్‌లో డీజిల్, పెట్రోల్ ఆటోలను ఎలక్ట్రిక్ వాహనాలుగా రెట్రోఫిట్ చేసుకునేందుకు ఒక్కో వాహనానికి రూ.1.50 లక్షల వరకు ప్రభుత్వ సహాయం అందిస్తామని తెలిపారు.బైక్ ట్యాక్సీలకు ఎల్లో ప్లేట్ ఏర్పాటు చేసే అంశంపై కూడా ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామని మంత్రి వెల్లడించారు.

## ORR పరిధిలో కొత్త ఆటోలకు అనుమతులు

ూ== పరిధిలో కొత్త వాహనాల నమోదుకు ప్రభుత్వం అనుమతులు కల్పించిందని మంత్రి తెలిపారు.ఎలక్ట్రిక్ త్రీ వీలర్లకు 20,000, జఙీ+ ఆటోలకు 10,000, ఞూ+ ఆటోలకు 10,000, రెట్రోఫిటెడ్ ఎలక్ట్రిక్ త్రీ వీలర్లకు 25,000 అనుమతులు కేటాయించినట్లు చెప్పారు.

## రోడ్డు భద్రతకు అత్యధిక ప్రాధాన్యత

రోడ్డు భద్రత కోసం జుఙబష్అఙీఅ, జుఅలశీఖఎవత్, జుఅస్ర్గఅవవతీఅన్ర, జుఎవతీస్రవఅఎం అనే 4జు వ్యూహంతో కార్యక్రమాలు చేపడుతున్నామని మంత్రి తెలిపారు.పాఠశాలల్లో రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, పోలీస్ శాఖతో కలిసి 'ూతీతీఱవ --ూత్రీఱవ' కార్యక్రమం ద్వారా ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు.ప్రమాదాలు జరిగినప్పుడు బాధితులను వెంటనే ఆసుపత్రులకు తరలించి చికిత్స అందించేందుకు రహవీర్ స్కీమ్ అమలు చేస్తున్నామని తెలిపారు.రోడ్డు భద్రతా సెస్‌ను రోడ్డు భద్రతా కార్యక్రమాలకే వినియోగించేలా చట్టపరమైన చర్యలు చేపడుతున్నామని మంత్రి పేర్కొన్నారు.

## ఎలక్ట్రానిక్ ఎన్‌ఫోర్స్‌మెంట్

ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలను గుర్తించేందుకు 60 ూచీూ= కెమెరాల ఏర్పాటుకు చర్యలు చేపట్టామని మంత్రి తెలిపారు.రవాణా వ్యవస్థలో ూ× సాంకేతికతను వినియోగించి పర్యవేక్షణను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు ప్రణాళిక రూపొందించామని చెప్పారు.

రవాణా శాఖలో 113ూవీఎ×లు, 50 మంది కానిస్టేబుళ్లు, 20 మంది జూనియర్ అసిస్టెంట్లు, 4 వీఎ×లను నియమించామని తెలిపారు.రవాణా శాఖలో వేధింపులకు తావులేకుండా చెక్‌పోస్టులను ఎత్తివేశామని, జిల్లాల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలను పెంచామని మంత్రి వెల్లడించారు.

## ఆర్టీసీ పేద ప్రజలకు లైఫ్‌లైన్

ఆర్టీసీ కేవలం రవాణా సంస్థ మాత్రమే కాదని, పేద, మధ్యతరగతి ప్రజలకు లైఫ్‌లైన్ అని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు.దేశంలో రైల్వేలకు ఉన్న ప్రాధాన్యత మాదిరిగానే తెలంగాణలో ఆర్టీసీ ప్రజల జీవితాల్లో కీలక పాత్ర పోషిస్తోందని తెలిపారు.ఆర్టీసీని దేశంలోనే ఉన్నత స్థానంలో నిలిపేందుకు డ్రైవర్లు, కండక్టర్లు, ఇతర సిబ్బంది చేస్తున్న కృషి అభినందనీయమన్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలో, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క గారి సహకారంతో రవాణా శాఖకు అవసరమైన నిధులు మంజూరు అవుతున్నాయని, ఆర్టీసీని మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి తెలిపారు.సిబ్బంది కృషి, అధికారుల పనితీరు, ప్రభుత్వ విధానాలతో ఆర్టీసీని భవిష్యత్తులో దేశంలోనే నంబర్-1 ప్రజా రవాణా సంస్థగా తీర్చిదిద్దుతామని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు.ఈ సమావేశంలో రవాణా శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్, టీజీఎస్ఆర్టీసీ ఎండీ వై. నాగిరెడ్డి, రవాణా శాఖ కమిషనర్ ఇలంబర్తి, జేటీసీ చంద్రశేఖర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్తు ఉద్యోగి కుటుంబానికి కోటి బీమా సొమ్ము

**ట్రైనెట్ న్యూస్, సెప్టెంబర్ 1:** ట్రాన్స్ కో హుజూరాబాద్ 132/11 సబ్ స్టేషన్ పరిధిలో ప్రమాదవశాత్తు మృతిచెందిన గ్రేడ్ -2 ఉద్యోగి శంకర్ రెడ్డి సతీమణి బోడ స్వాతికి మంగళవారం ప్రజాభవన్‌లో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క రూ.కోటి ప్రమాద బీమా చెక్కును అందించారు. హుజూరాబాద్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న శంకర్ రెడ్డి 2025 అక్టోబర్ 1న విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా విధి నిర్వహణలోనే ప్రాణాలు కోల్పోయారు. ఈ నేపథ్యంలో ఆయన సతీమణి బోడ స్వాతికి రూ.కోటి ప్రమాద బీమా మొత్తానికి సంబంధించిన చెక్కును ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్వయంగా అందించారు. ఈ సందర్భంగా బోడ స్వాతితో



మాట్లాడుతూ కుటుంబ వివరాలు తెలుసుకున్నారు. ఆర్థిక పరిస్థితి, పిల్లల చదువులు ఇతర వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ బీమా సొమ్ముతో పిల్లలను బాగా చదివించాలని చెప్పారు. విద్యుత్ ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ఈ సందర్భంగా అధికారులు తెలిపారు. ఉద్యోగులు విధి నిర్వహణలో ప్రమాదాలకు గురై ప్రాణాలు కోల్పోయిన సందర్భాల్లో వారి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు అమలు చేస్తున్న రూ.కోటి ప్రమాద బీమా పథకం మొదట సింగరేణి సంస్థలో ప్రారంభమై, ప్రస్తుతం రాష్ట్రంలోని అన్ని విద్యుత్ సంస్థల్లో అమలవుతోంది. ఉద్యోగుల కుటుంబాలకు భరోసా కల్పించే ఈ ప్రమాద బీమా పథకం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అధికారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాన్స్‌కో సీఎండీ కృష్ణ భాస్కర్, ట్రాన్స్‌కో అధికారులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

# ఇరాన్ ప్రయోగించే ప్రతి రాకెట్‌కు.. అమెరికాకు మూడు క్షిపణుల ఖర్చు!



అమెరికా- ఇరాన్ యుద్ధం మొదలై ఆరు నెలలు దాటింది. ఇరాన్‌పై దాడులకు అగ్రరాజ్యం ఇప్పటివరకు వేలాది క్షిపణులు వినియోగించింది. టెహ్రాన్ ఎదురుదాడులను అడ్డుకునేందుకు పెద్దఎత్తున ఇంటర్‌సెప్టర్లను ప్రయోగిస్తోంది. దీంతో అమెరికా తోమహాక్ క్షిపణులు, పేట్రియాట్ ఇంటర్‌సెప్టర్ల సహా కీలక ఆయుధాల కొరతను ఎదుర్కొంటోందని అంతర్జాతీయ మీడియాలో కథనాలు వస్తున్నాయి. ఒక ఇరానీ డ్రోన్‌ను లేదా క్షిపణిని కూల్చేందుకు అమెరికా రెండు, మూడు ఇంటర్‌సెప్టర్లను ప్రయోగిస్తోంది.'సెంటర్ ఫర్ స్ట్రాటజిక్ అండ్ ఇంటర్నేషనల్ స్టడీస్' (జూఎూ) విశ్లేషణ ప్రకారం.. ఫిబ్రవరి- జులై మధ్యకాలంలో అమెరికా పేట్రియాట్ ఇంటర్‌సెప్టర్ల నిల్వల్లో సుమారు 65 శాతం హరించుకుపోయాయి. యుద్ధానికి ముందు దాదాపు 2,330 ఇంటర్‌సెప్టర్లు ఉండగా.. ఇప్పుడు వాటి సంఖ్య 850లోపే పడిపోయింది. 1,500కుపైగా పేట్రియాట్ ఇంటర్‌సెప్టర్లను అమెరికా ఉపయోగించింది. ఒక ఇరానీ డ్రోన్‌ను లేదా క్షిపణిని కూల్చేందుకు అమెరికన్ కమాండర్లు రెండు, మూడు ఇంటర్‌సెప్టర్లను ప్రయోగిస్తున్నారు. అదేవిధంగా యుద్ధానికి ముందు స్థాయిలతో పోలిస్తే థాడ్ (ఎూూూ) ఇంటర్‌సెప్టర్ల లభ్యత 38 శాతం తగ్గింది. తోమహాక్, ఏటీఏసీఎంఎస్ వంటి సుదూర లక్ష్యాలను ఛేదించే క్షిపణుల నిల్వలూ భారీగా తగ్గిపోయినట్లు నివేదికలు చెబుతున్నాయి.మరోవైపు.. తరిగిపోతున్న ఆయుధ నిల్వల్ని పెంచడానికి ఉత్పత్తిని వేగవంతం చేయాలని ఆయుధ కంపెనీలపై అమెరికా రక్షణశాఖ ఒత్తిడి తెస్తోంది. దూకుడుగా ఉత్పత్తి పెంచే ప్రణాళికల్ని సమర్పించాలని రక్షణ పరిశ్రమలకు ఆ శాఖ ఉప మంత్రి స్టీవ్ ఫీన్‌బర్గ్ ఇటీవల లేఖ రాసిన విషయం తెలిసిందే. ఏళ్ల తరబడి సమయం తీసుకుంటామంటే అంగీకరించేది లేదని తేల్చి చెప్పారు. ముప్పును ఎదుర్కొనేందుకు తమ సైనికులకు కావాల్సిన ఆయుధాల నిల్వల పెంపుపై చురుగ్గా దృష్టి సారించామని పెంటగాన్ అధికార ప్రతినిధి సియాన్ పార్నెల్ ధ్రువీకరించారు.

# పాక్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్‌కు భారీ ఊరట



అవినీతి సంబంధిత కేసుల్లో జైలుశిక్ష అనుభవిస్తోన్న పాకిస్థాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్, ఆయన సతీమణి బుష్రా బీబీకి భారీ ఊరట లభించింది. రావల్పిండిలోని అడియాలా కారాగారంలో ఉన్న ఈ ఇద్దరిని జైలులో ఒంటరిగా నిర్బంధించకుండా చూడాలని అధికారులను ఇస్లామాబాద్ హైకోర్టు ఆదేశించింది. నిబంధనలకు అనుగుణంగా ఇమ్రాన్‌ను కుటుంబ సభ్యులు కలిసేందుకు అనుమతించాలని, తన కుమారులతో ఆయన టెలిఫోన్‌లో మాట్లాడేందుకు ఏర్పాటు చేయాలని తెలిపింది.ఇమ్రాన్ ఖాన్ (ఎఙీఱఎ ఖష్ఱఅ), బుష్రా బీబీలను జైలులో ఒంటరిగా నిర్బంధించారని ఆరోపిస్తూ.. కుటుంబసభ్యులు వేర్వేరుగా దాఖలు చేసిన పిటిషన్లపై హైకోర్టు ఆగస్టు 6న తీర్పును రిజర్వ్ చేసింది. మంగళవారం దాన్ని వెలువరించింది. ఇమ్రాన్ ఖాన్‌కు రోజూ వార్తాపత్రికలు, పుస్తకాలు ఇవ్వాలని, వైద్య సౌకర్యాలు అందేలా చూడాలని సూచించింది. కోర్టు ఉత్తర్వుల అమలుపై 15 రోజుల్లోగా నివేదికను సమర్పించాలని అడియాలా జైలు సూపరింటెండెంట్‌కు ఆదేశాలు జారీ చేసింది.2023 ఆగస్టు నుంచి ఇమ్రాన్ ఖాన్ జైల్లోనే ఉన్నారు. కుటుంబ సభ్యులను కలవనీయకుండా, తగిన వైద్య సేవలు అందనీయకుండా అధికారులు అడ్డుకుంటున్నారని ఆయన మద్దతుదారులు, బంధువులు పదేపదే ఆరోపిస్తున్నారు. ఈ ఆరోపణలను ప్రభుత్వం ఖండిస్తూ వస్తోంది. ఇటీవల పాకిస్థాన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లో వైద్య పరీక్షల అనంతరం ఇమ్రాన్‌ను తిరిగి జైలుకు తరలించింది. అల్ షిఫా ఆస్పత్రి డాక్టర్ల సమక్షంలో వైద్యపరీక్షలు నిర్వహించామని, ఆయన ఆరోగ్యంగా ఉన్నట్లు తేలిందని ప్రకటించింది.

# రష్యా సైన్యంలో చేరిన 51 మంది భారతీయులు మృతి: కేంద్రం



రష్యా సాయుధ దళాల్లో 227 మంది భారతీయులు చేరారని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. వారిలో 51 మంది ప్రాణాలు కోల్పోయారని, 139 మందిని విధుల నుంచి తొలగించారని తెలిపింది. మిగిలిన వారిని కూడా రష్యా సైన్యం నుంచి బయటకు రప్పించి, స్వదేశానికి తీసుకువచ్చేందుకు రెండు దేశాల మధ్య నిరంతరం సంప్రదింపులు జరుగుతున్నాయని విదేశాంగ శాఖ కార్యదర్శి మిస్రీ వెల్లడించారు.

తెలంగాణ ట్రైనెట్ న్యూస్
నిజం • బాధ్యత • నిబద్ధత
తెలుగు దిన పత్రిక
బుధవారం సెప్టెంబర్ 02, 2026
www.trinetnews.com

# వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలన వైఫల్యాలపై బీఆర్ఎస్ పోరుబాట

**నడిగూడెం ఆగస్టు01**

నడిగూడెం :కోదాడ ధర్నాకు బీఆర్ఎస్ శ్రేణులు భారీగా తరలిరావాలి: మండల అధ్యక్షుడు పల్లా నర్సిరెడ్డి
2023 శాసనసభ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను వంద రోజుల్లో అమలు చేస్తామని ప్రకటించి.. అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు పూర్తవుతున్నా ఒక్క హామీని కూడా పూర్తిస్థాయిలో అమలు చేయలేదని బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు పల్లా నర్సిరెడ్డి విమర్శించారు.మంగళవారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయనమాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ పథకాల అమలులో పూర్తిగా



విఫలమైందనిఆరోపించారు.రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు, కోదాడ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ ఆదేశానుసారం నేటి నుంచి సెప్టెంబర్ 8 వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.సెప్టెంబర్ 2న కోదాడలో నిర్వహించే ధర్నాకు మండలంలోని బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పల్లా నర్సిరెడ్డి పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో మండల సమన్వయ సమితి సభ్యులు అనంతుల ఆంజనేయులు, గార్లపాటి శ్రీనివాస్‌రెడ్డి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు దాసరి శ్రీను, మాజీ కోఆప్షన్ సభ్యుడు ఎస్కే జలీల్, బీఆర్ఎస్ విద్యార్థి విభాగం నాయకుడు మేకల వీరబాబు, నాయకులు వల్లెపు శ్రీను, తిరుమలి తదితరులు పాల్గొన్నారు.

# కోటగిరి మండలంలోని ఇరిగేషన్ ఆఫీసులో నల్ల బ్యాడ్జితో నిరసన

**నిజామాబాద్ జిల్లా సెప్టెంబర్ 01** కోటగిరి: మండల కేంద్రంలోని ఇరిగేషన్ ఆఫీస్ లో నిరసన కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో రాగానే సిపిఎస్ రద్దు చేస్తామని హామీ ఇచ్చి మరిచారని తెలియజేశారు సిపిఎస్ రద్దు అంటూ ఓ పి ఎస్ మొద్దు అంటూ నల్ల బ్యాడ్జితో నిరసన కార్యక్రమం నిర్వహించారు ఈ ప్రభుత్వం ఇప్పటికైనా కండ్లు తెరిచి ఇచ్చిన హామీలను నిర్వహించాలని అన్నారు ఇకనైనా ఈ ప్రభుత్వం సిపిఎస్ రద్దు విషయంలో ఆలోచించి రద్దు చేయాలని కోరుతున్నారు ఓ పిఎస్ ముద్దు అంటూ ఓ పి ఎస్ వెంటనే అమలు చేయాలని ప్రభుత్వాన్ని



కోరుతున్నారు ప్రభుత్వ ఉద్యోగులకు మాత్రం ఈ పింఛన్ అవకాశం లేకుండా చేశారని కొనియాడారు ఉద్యోగులపై ఇంత చిన్న చూపు ఎందుకు ప్రభుత్వానికి అని అడిగినారు ఓ పి ఎస్ వెంటనే అమలు చేయాలని అన్నారు లేనియెడల ప్రభుత్వంపై పెద్ద ఎత్తున ధర్నా కార్యక్రమం నిర్వహిస్తామని ఈ నల్ల బ్యాడ్జిలతో నిరసన ఓ పి ఎస్ ముద్దు అంటూ నినాదాలు చేశారు సిపిఎస్ రద్దు చేసి ఇకనైనా ప్రభుత్వ ఉద్యోగులకు ఆదుకోవాలని అన్నారు ఈ ప్రభుత్వం ఓ పి ఎస్ అమలు చేస్తానని హామీ ఇచ్చి మార్చారని అన్నారు ఇప్పటికైనా కనులు తెరిచి ఓ పి ఎస్ అమలు చేయాలని తెలియజేశారు లేనియెడల పెద్ద మొత్తం మీద పోరాటం జరుగుతుందని నల్ల బ్యాడ్జీలతో నిరసన కార్యక్రమం చేపట్టారు ఈ కార్యక్రమంలో కోటగిరి ఇరిగేషన్ డి ఈ రఫీ ఇరిగేషన్ ఏఈ రవికుమార్ ఇరిగేషన్ జూనియర్ అసిస్టెంట్ పివి మోహన్ ఇరిగేషన్ ఔట్సోర్స్ ఉద్యోగులు ఇరిగేషన్ లస్కర్లు ఆఫీస్ సిబ్బంది. తదితరులు పాల్గొన్నారు

# రానబోతు వెంకట్ రెడ్డి సేవలు మరువలేనివి.



**నడిగూడెం ఆగస్టు01 ట్రైనెట్ న్యూస్**

నడిగూడెం మండల పరిధిలోని కరీరాల గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు రణబోతు వెంకటరెడ్డి సేవలు మరువలేనివని కోదాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ వేపూరి తిరపతమ్మ సుధీర్ అన్నారు మంగళవారం వెంకటరెడ్డి మొదటి వర్ధంతి కార్యక్రమంలో పాల్గొని చిత్రపటానికిపూలమాలవేసి అనంతరం ఆమె మాట్లాడుతూ గ్రామంలో పార్టీ బలోపేతం కోసం నిబద్ధత కలిగిన కార్యకర్తగా నాయకుడిగా పార్టీ కోసం ఎనలేని సేవలు చేశారని ఆయన సేవలను కొనియాడారు కార్యకర్తల పార్టీకి వెన్నుముకని పార్టీ కోసం కష్టపడా కార్యకర్తను పార్టీ ఎప్పుడు గుర్తుంచుకుంటుందన్నారు వరి వెంట కరివిరాల మాజీ సర్పంచ్ గుర్రం నీలిమా గాంధీ వార్డ్ నెంబర్లు దోసపాటి రమేష్ జానిమియా మేకల విజయ్ గార్ల పాటి శ్రీనివాస్ రెడ్డి పల్లపు గోపాల్ రామయ్య నాణేషబ్ పాతకోట్ల మహేష్ తదితరులు నివాళి అర్పించారు.

# పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని నల్ల బ్యాడ్జీలతో నిరసన

**నడిగూడెం ఆగస్టు01**

నడిగూడెం :పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని కోరుతూ మంగళవారం కేఎల్ఎన్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అధ్యాపకులు భోజన విరామ సమయంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు ప్రభుత్వం వెంటనే స్పందించి



సిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు కార్యక్రమంలోఅధ్యాపకులు కర్నాటి శ్రీధర్ ,సిహెచ్ కృష్ణ, ఈశ్వర్ ,జినాగరాజు ,రజిత, మదారు ,వీరన్న ,కొల్లు శ్రీనివాసు ,డి శ్రీనివాస్ రావు వెంకటేశ్వరరావు ,తేజశ్రీ నాగరాజు, ఉపేందర్, రాములు ,రవి వర్మ తదితరులు సంఘీభావం తెలిపారు.

# పనిచేయని లిఫ్టులను వెంటనే మరమ్మతులు చేసి చెరువులు నింపాలి

## బీజేపీ చిలుకూరు మండల అధ్యక్షుడు పారెల్లి మహేష్

**చిలుకూరు ఆగస్టు 01**

చిలుకూరు: నాగార్జునసాగర్ ఎడమ కాలువ పరిధిలోని పలు లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలు నిర్వహణ లోపం, మరమ్మతులులేకపోవడంతో పనిచేయడం లేదని బీజేపీ చిలుకూరు మండల అధ్యక్షుడు పారెల్లి మహేష్ ఆరోపించారు.జిల్లాలో సాగునీటి పరిస్థితులు ఆందోళనకరంగా ఉన్నప్పటికీ ఇరిగేషన్ శాఖ మంత్రి, సంబంధిత అధికారులు లిఫ్ట్ ఇరిగేషన్ వ్యవస్థలపై దృష్టి సాధించడం లేదని ఆయన విమర్శించారు. ఎడమ కాలువలో నీరు అందుబాటులో ఉన్నప్పటికీ, లిఫ్టులు పనిచేయకపోవడంతో చెరువులు నింపే అవకాశం లేకుండా పోయిందన్నారు.



వరి నాట్లు వేసుకున్న రైతులు ప్రస్తుతం తీవ్ర ఇబ్బందులుఎదుర్కొంటున్నారని మహేష్ తెలిపారు. రైతులు పెట్టిన పెట్టుబడి, చేసిన శ్రమ వృథా అవుతున్నాయని, మొగ్గ దశలోనే వరి నాట్లు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.
కనీసం లిఫ్ట్‌లను మరమ్మతులు చేయించి మోటార్లను రన్నింగ్‌లోకి తీసుకువచ్చి, విడతల వారీగా చెరువులను నింపాలని ఆయన డిమాండ్ చేశారు. చెరువులు నిండితే భూగర్భ జలాలు పెరిగి, బోర్లపై ఆధారపడే రైతులకు కొంత ఉపశమనంలభిస్తుందన్నారు రైతుల సమస్యలను పట్టించుకోకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే బీజేపీ తరఫున రైతుల పక్షాన ఉద్యమిస్తాం.కరువు--కాంగ్రెస్ కవల పిల్లలుగా వ్యవహరిస్తున్నాయి" అని బీజేపీ చిలుకూరు మండల పార్టీ అధ్యక్షుడు పారెల్లి మహేష్ అన్నారు.

# చిలుకూరులో ఘనంగా తెలంగాణ జలసిరి కార్యక్రమం -- భారీ ర్యాలీ



**చిలుకూరు ఆగస్టు 01**

చిలుకూరు:తెలంగాణ జలసిరి కార్యక్రమంలో భాగంగా చిలుకూరు గ్రామంలో రైతులు, గ్రామ ప్రజలతో కలిసి భారీ అవగాహన ర్యాలీ నిర్వహించారు. నీటి ఆవశ్యకత, భవిష్యత్‌లో ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడే నీటి కొరతనుఎదుర్కోవడం, నీటి పొదుపు, భూగర్భ జలాలను పెంచుకోవాల్సిన అవసరంపై ప్రజలకు అవగాహన కల్పించారు.
ఈ సందర్భంగా ప్రతి ఇంటికి ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయడం, వ్యవసాయ భూముల్లో నీటి కుంటలు నిర్మించడం, వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాలను రీచార్జ్ చేయడం వంటి అంశాలపై ప్రజలకు వివరించారు. వర్షపు నీటిని వృథా చేయకుండా సంరక్షించుకోవడం ద్వారా భవిష్యత్ తరాలకు నీటి కొరత లేకుండాచేయవచ్చని అధికారులు సూచించారు.
ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కొల్లు పుల్లమ్మ నాగయ్య పాల్గొనగా, ముఖ్య అతిథులుగా జిల్లా పరిషత్ సీఈఓ శిరీష, ఎంపీడీఓ ముక్కపాటి నరసింహారావు, ఏపీఓ నిర్మల, పంచాయతీ కార్యదర్శి షరీపుద్దీన్ హాజరయ్యారు.ఈ కార్యక్రమం ద్వారా చిలుకూరు గ్రామంలో నీటి సంరక్షణ, వర్షపు నీటి నిల్వ, భూగర్భ జలాల పెంపుపై ప్రజల్లో అవగాహన కల్పించడమే లక్ష్యంగా అధికారులు తెలిపారు.

# కాంగ్రెస్ హామీలపై బీఆర్ఎస్ పోరుబాట

## -హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

## సెప్టెంబర్ 2న కోదాడలో నియోజకవర్గ స్థాయి ధర్నా

## పార్టీ శ్రేణులు భారీగా తరలిరావాలి: భూపాల్‌రెడ్డి

**అనంతగిరి ఆగస్టు 01**

అనంతగిరికాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1000 రోజులు పూర్తవుతున్న సందర్భంగా ఎన్నికల హామీలఅమలులో ప్రభుత్వ వైఫల్యాలను నిరసిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 2 న కోదాడలో నియోజకవర్గ స్థాయి ధర్నా నిర్వహించనున్నట్లు ఆ పార్టీ అనంతగిరి మండల అధ్యక్షుడు నల్లా భూపాల్‌రెడ్డి తెలిపారు. అనంతగిరి మండల కేంద్రంలో



మంగళవారం ఏర్పాటుచేసినసమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో పాటు హామీల అమలుకు ఒత్తిడి తెచ్చేందుకు ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమానికి పార్టీ నాయకులు,ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు ఎండీ అఫ్జల్, సీనియర్ నాయకులు పందిరి వీరయ్య, శాంతినగర్ గ్రామశాఖ అధ్యక్షుడు అక్బర్, కొత్తపల్లి ఏసు, పల్లపు నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

# మత్తుకు దూరంగా ఉంటే యువతకు ఉజ్వల భవిష్యత్తు.



**నడిగూడెం ఆగస్టు 01**

నడిగూడెం గంజాయి ఇతర మత్తు పదార్థాలకు బానిస కాకుండా యువత ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగితే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని సమాజంలో చదువుతోనే గుర్తింపు లభిస్తుందని నడిగూడెం కే ఎల్ ఎన్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ డి విజయ నాయక్ అన్నారు. మంగళవారం కళాశాల ఆవరణలో బ్రహ్మకుమారి సంస్థ ,జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలోనిషాముక్తుభారత్ కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులకు అవగాహన కల్పించారు .ప్రభుత్వ కళాశాలలో విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని సత్ప్రవర్తన సన్మార్గంలో ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని బ్రహ్మకుమారి సంస్థ ప్రతినిధులు చుక్క వీరయ్య ,రాము ,కోరారు .ఈ కార్యక్రమంలో జాతీయ సేవా పథకం యూనిట్ ఆఫీసర్స్ కర్నాటి శ్రీధర్ గుండు నాగరాజు స్టాఫ్ క్లబ్ సెక్రటరీ తేరాల ఉపేందర్ అధ్యాపకులు బ్రహ్మకుమారి సంస్థ ప్రతినిధులు రవీందర్ నాగమణి తదితరులు పాల్గొన్నారు.

# కోదాడ అభయాంజనేయ స్వామి దేవాలయంలో అన్నదానం



**కోదాడ ఆగస్టు 01 ట్రైనెట్ న్యూస్**

కోదాడ పట్టణంలోని శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి దేవాలయ ప్రాంగణంలో వెలసిన శ్రీఅభయాంజనేయ స్వామి ఆలయంలో 212 వ మంగళవారం ను పురస్కరించుకుని భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమన్ని ఆలయ కమిటీ సభ్యులుభక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మహిళా భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం దాతలు అనంతరపు నాగ చారి, కళ్యాణి, విగ్నేష్, వెలిశాలరామాచారి,నాగమణి సింధు, చరణ్ నెలవారి దాతలు సహకారంతో ఆలయ కమిటీ సభ్యులు అన్నదానాన్నిప్రారంభించారు. ఆంజనేయ స్వామి కరుణా కటాక్షంతో ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు జూకూరి అంజయ్య, అన్నదాన నిర్వాహకులుడి.హనుమంతరావు,వి.కృష్ణమూర్తి,సెక్రటరీతిరుపతయ్య,శిరీష,బ్యాటరీచారిఉమామహేశ్వర రావు,పెద్ది శేషు,ఆకుల పుల్లారావు,క్రాంతి బిఎల్ఎన్ రెడ్డి బి. సత్యం,వి.రామారావు,కె రవి కుమార్,డాక్టర్ శ్రీకాంత్,పీ శ్రీనివాసరావు రామకృష్ణపవన్,సతీష్,రంగా.శ్రీను,ప్రకాష్,లక్ష్మారెడ్డి, నరేష్, గాంధీ,వి.రాంప్రసాద్, వెంకటకృష్ణ, విశాల్ మిశ్రా తదితరులుపాల్గొన్నారు

# ఎమ్మార్పీఎస్ అత్యవసర సమావేశం



**యాదాద్రి భువనగిరి జిల్లా సెప్టెంబర్ 01**

వలిగొండ :మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ అత్యవసర సమావేశం నిర్వహించడం జరిగింది. దీనికి ముఖ్య అతిథిగా భువనగిరినియోజకవర్గ ఇన్చార్జ్ దుబ్బ రామకృష్ణ మాదిగ హాజరై మాట్లాడుతూరాష్ట్రవ్యాప్తంగా పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగానూతనంగా కమిటీలు నిర్వహించాలి అదేవిధంగా జిల్లావ్యాప్తంగా మండలాల వారిగా కమిటీలు వేసుకోవడం జరుగుతుంది అందులో భాగంగానే వలిగొండ మండలంలో సెప్టెంబర్ మూడవ తారీకు నాడు ఎమ్మార్పీఎస్ ఎంఎస్పి మండల సభ ఉంటుంది కావున దీనికి అత్యధికంగా వలిగొండ మండలంలోని వివిధ గ్రామాల నుండి మాదిగలు అత్యధికంగా హాజరై విజయవంతం చేయాలని అదేవిధంగా నూతనంగా కమిటీ వేసుకోవాలని సెప్టెంబర్ 9వ తారీఖు నాడు వరంగల్ లో ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల జరిగే జాతీయ సమావేశానికిహాజరుకావాలని విజ్ఞప్తి చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో భువనగిరి నియోజకవర్గం ఇంచార్జ్ దుబ్బ రామకృష్ణ మాదిగ మండల అధ్యక్షులు పల్లెర్ల రామచంద్ర మాదిగ ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు సల్లంజి బిక్షపతి మాదిగ మోహన్ సదానందం సత్తయ్య తదితరులు పాల్గొన్నారు

# వర్కట్ పల్లి పి హెచ్ సి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం





**యాదాద్రి భువనగిరి జిల్లా :సెప్టెంబర్ 01: (విజన్ ప్రభ)**

వలిగొండ :మండల పరిధిలోని గోల్నేపల్లి గ్రామంలో మంగళవారం రోజున వర్కట్పల్లి పి హెచ్ సి ఆధ్వర్యంలోఉచిత టీబి ఎక్స్ రే క్యాంపునిర్వహించారు స్థానిక సర్పంచ్ రాణి మధు సమక్షంలో జరిగిన ఈ శిబిరంలో గ్రామస్తులకు క్షయ టిబి వ్యాధి నిర్ధారణ పరీక్షలతో పాటు ఉచితంగా ఎక్స్ రేలు తీశారు వ్యాధి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించి చికిత్స తీసుకోవాలని ఆరోగ్య సిబ్బంది అవగాహన కల్పించారు ఈ కార్యక్రమంలో ,ఎం ఎల్ హెచ్ . పి శిరీష ఏఎన్ఎం శాలిని ,ఆశ వర్కర్లు కాసుల సుష్మ రేగుల గడ్డ లక్ష్మ వంగాల ధనమ్మ తుర్కపల్లి మమత జానకి టీ బి, విభాగం ప్రతినిధి కారబోరు స్వామి గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు



# ఆగస్టులో జీఎస్టీ, యూపీఐ లావాదేవీలు భేష్

దిల్లీ: దేశంలో ఆర్థిక కార్యకలాపాలకు సూచికగా నిలిచే వస్తు, సేవల పన్ను , యూపీఐ లావాదేవీలు మరోసారి భారీగా నమోదయ్యాయి. ఆగస్టు నెలలో ఈ రెండూ మెరుగైన వృద్ధిని సాధించాయి. గడిచిన నెలలో జీఎస్టీ వసూళ్లు మరోసారి రూ.2 లక్షల కోట్ల మార్కు దాటగా.. యూపీఐ లావాదేవీలు రికార్డు స్థాయికి చేరువగా నమోదయ్యాయి.

ఆగస్టు నెలలో జీఎస్టీ వసూళ్లు రూ.2 లక్షల కోట్లుగా నమోదైనట్లు కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. గతేడాదితో పోలిస్తే 14.8 శాతం వృద్ధి నమోదైనట్లు పేర్కొంది. ఈ మొత్తం వసూళ్లలో దేశీయ లావాదేవీల నుంచి రూ.1.37 లక్షల కోట్లు రాగా.. దిగుమతుల ద్వారా రూ.62,604 కోట్లు సమకూరినట్లు కేంద్రం తెలిపింది. సెంట్రల్ జీఎస్టీ (జ+ూ) వసూళ్లు రూ.38,413 కోట్లు కాగా, స్టేట్ జీఎస్టీ వసూళ్లు రూ.46,316 కోట్లుగా నిలిచాయి. సమీకృత జీఎస్టీ వసూళ్లు రూ.1.15 లక్షల కోట్లుగా ఉన్నాయి. రిఫండ్ల అనంతరం నికర జీఎస్టీ వసూళ్లు 8.3 శాతం వృద్ధితో రూ.1.68 లక్షల కోట్లుగా నమోదైనట్లు కేంద్రం పేర్కొంది.

**యూపీఐ లావాదేవీలు భళా**

డిజిటల్ చెల్లింపుల వ్యవస్థకు ఆయువుపట్టుగా ఉన్న యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ ద్వారా ఆగస్టు నెలలో రూ.29.8 లక్షల కోట్ల విలువైన లావాదేవీలు జరిగినట్లు నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (చీూజ×) వెల్లడించింది. గతేడాది ఆగస్టులో ఈ మొత్తం రూ.24.85 లక్షల కోట్లుగా ఉంది. అంటే 20 శాతం వార్షిక వృద్ధి నమోదైంది. ఈ ఏడాది మే, జులై నెలల్లో రూ.29.9 లక్షల కోట్లు చొప్పున రికార్డు స్థాయిలో యూపీఐ లావాదేవీలు జరిగాయి. ఆగస్టులోనూ రికార్డు స్థాయికి చేరువ కావడం గమనార్హం. సంఖ్యాపరంగా చూస్తే జులైలో 23.66 బిలియన్ లావాదేవీలు జరగ్గా.. ఆగస్టులో ఆ సంఖ్య పెరిగి 24.51 బిలియన్‌లకు చేరింది.

# నష్టాల్లో ముగిసిన దేశీయ మార్కెట్ సూచీలు..



**దేశీయ మార్కెట్లు మంగళవారం నష్టాలతో ముగిశాయి** (Stock Market Today)**. ముడిచమురు ధరల పెరుగుదల, బ్యాంక్, ఆటో షేర్లలో అమ్మకాలు వంటి కారణాలతో సూచీలు నష్టపోయాయి.**

**సెన్సెక్స్**

**76,944.28**

▼ 12.00 (-0.02%)




**నిఫ్టీ**

**24,055.00**

▼ 8.60 (-0.04%)




క్రితం షెషన్లో 76,957 వద్ద సెన్సెక్స్ ముగియగా..
నేటి ట్రేడింగ్‌లో 76,994 వద్ద ప్రారంభమైంది.
ఒక దశలో 77,231 వరకు ఎగబాకింది.
చివరకు 12 పాయింట్ల నష్టంతో 76,944.28 వద్ద స్థిరపడింది.
నిఫ్టీ 24,055 వద్ద క్లోజ్ అయింది.
డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 27 పైసలు పెరిగి, 94.95 వద్ద ముగిసింది.

**నిఫ్టీ టాప్ గేయినర్స్**

| | |
|---|---|
| ▲ ITC | ఎయిర్‌టెల్ |
| ▲ airtel | భారతీ |
| ▲ adani | అదానీ పోర్ట్స్ |
| ▲ HCL | హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ |
| ▲ Reliance | రిలయన్స్ ఇండస్ట్రీస్ |

**నిఫ్టీ టాప్ లూజర్స్**

| | |
|---|---|
| ▼ Shriram Finance | శ్రీరామ్ ఫైనాన్స్ |
| ▼ Maruti Suzuki | మారుతీ సుజూకీ |
| ▼ Nestle India | నెస్లే |
| ▼ Max Healthcare | మ్యాక్స్ హెల్త్‌కేర్ |
| ▼ InterGlobe Aviation | ఇంటర్ గ్లోబ్ ఏవియేషన్ |

**రూపాయి మారకం విలువ**

1 డాలర్ = **94.95**

▲ 0.27 (27 పైసలు పెరిగింది)



## ఐస్‌క్రీమ్ మార్కెట్‌లోకి రిలయన్స్..

# 10 నుంచే లభ్యం

రిలయన్స్ ఇండస్ట్రీస్‌కు చెందిన ఎఫ్ఎంసీజీ విభాగం రిలయన్స్ కన్జ్యూమర్ ప్రొడక్ట్స్ లిమిటెడ్ మరో కొత్త వ్యాపారంలోకి ప్రవేశించింది. ఇప్పటికే శీతల పానీయాల విభాగంలో ఉనికి చాటుతున్న రిలయన్స్.. తన వ్యాపారాన్ని మరింత విస్తరిస్తూ ఐస్‌క్రీమ్ మార్కెట్‌లోకి అడుగుపెట్టింది. ఇందులో భాగంగా 'బాంబే క్రీమరీ' బ్రాండ్‌ను ఆవిష్కరించింది. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేసింది.

డెయిరీ క్రీమ్‌తో తయారుచేసిన ఐస్‌క్రీమ్‌లను ఈ బ్రాండ్ కింద విక్రయించనున్నట్లు రిలయన్స్ వెల్లడించింది. కోన్స్, కప్స్, టబ్స్, బార్స్, స్టిక్స్ రూపంలో వీటిని విక్రయిస్తామని తెలిపింది. వీటి ధరలు రూ.10 నుంచి ప్రారంభమవుతాయని పేర్కొంది. తొలుత పశ్చిమ రాష్ట్రాల్లో ఇవి అందుబాటులోకి వస్తాయని, క్రమంగా దేశవ్యాప్తంగా వినియోగదారులకు తేనున్నట్లు ప్రకటించింది. అందుబాటు ధరలో బాంబే క్రీమరీ ద్వారా అసలైన ఐస్‌క్రీమ్ రుచిని భారతీయులకు అందించడం తమ ముఖ్య ఉద్దేశమని రిలయన్స్ కన్జ్యూమర్ ప్రొడక్ట్స్ డైరెక్టర్ టి కృష్ణ కుమార్ తెలిపారు.

- 'బాంబే క్రీమరీ' పేరుతో కొత్త బ్రాండ్ ఆవిష్కరణ
- రిలయన్స్ కన్జ్యూమర్ ప్రొడక్ట్స్ కొత్త వ్యాపారంలోకి అడుగు
- రూ.10 నుంచే ఐస్‌క్రీమ్ ధరలు
- డెయిరీ క్రీమ్‌తో ఐస్‌క్రీమ్ తయారీ
- కోన్స్, కప్స్, టబ్స్, బార్స్, స్టిక్స్ రూపంలో లభ్యం
- తొలుత పశ్చిమ రాష్ట్రాల్లో విక్రయాలు
- క్రమంగా దేశవ్యాప్తంగా విస్తరణ
- అందుబాటు ధరలో నాణ్యమైన ఐస్‌క్రీమ్ అందించడమే లక్ష్యం




# సుభాష్‌చంద్ర వ్యవహారం..

## రూ.6.25 కోట్ల చెల్లింపు ఆదేశాలు నిలిపివేత



ఎస్సెల్ గ్రూప్ వ్యవస్థాపకులు సుభాష్‌చంద్ర వ్యక్తిగత దివాలా ప్రక్రియపై వివాదం కొనసాగుతోంది. రూ.22,006 కోట్ల క్లెయిమ్‌నకు గానూ రూ.6.25 కోట్లు మాత్రమే చెల్లించేందుకు జాతీయ కంపెనీ లా ట్రైబ్యునల్ (చీజూ) అనుమతించడంపై రుణాలు ఇచ్చిన బ్యాంకులు ఆగ్రహంగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. చెల్లింపు విషయంలో ద్విసభ్య బెంచ్ ఇచ్చిన తీర్పును ఐదుగురు సభ్యులతో కూడిన ఎన్‌సీఎల్‌టీ ధర్మాసనం నిలిపివేసింది. సుభాష్ చంద్రపై దాఖలైన వ్యక్తిగత దివాలా ప్రక్రియలో భాగంగా క్రెడిటర్లంతా కలిసి రూ.22,006.57 కోట్లు క్లెయిమ్ చేయగా.. కేవలం రూ.6.25 కోట్లు చెల్లించే పరిష్కార ప్రణాళికకు ఇటీవల ఎన్‌సీఎల్‌టీ ఆమోదం తెలిపింది. ఈ ప్రణాళికకు 80.81 శాతం క్రెడిటర్ల నుంచి ఆమోదం లభించడం గమనార్హం. ఈ కేసు విషయంలో డివిజన్ బెంచ్‌లోని ఇద్దరు సభ్యులు భిన్నాభిప్రాయాలతో వేర్వేరు తీర్పులు ఇవ్వడంతో మూడో సభ్యుడిని నియమించగా.. కేవలం రూ.6.5 కోట్లు చెల్లించే ప్రణాళికకే ఆయన ఆమోదం తెలిపిన సంగతి తెలిసిందే. అయితే, ఇందులో సుభాష్ చంద్ర కుటుంబంతో సంబంధం ఉన్న 5 సంస్థలు రుణదాతల కమిటీలో 61.78 శాతం ఓటింగ్ వాటాను కలిగి ఉన్నాయని, ఈ ప్రణాళిక ఆమోదించడంలో కీలక పాత్ర పోషించాయని బ్యాంకులు ఆరోపిస్తున్నాయి.

**బ్యాంకింగ్ వ్యవస్థలో రూ.5 లక్షల కోట్ల అదనపు నిధులు**

ఈ నేపథ్యంలో చంద్ర వ్యక్తిగత దివాలా పరిష్కార ప్రక్రియలో భాగంగా రుణ చెల్లింపు ప్రణాళికపై నిర్ణయం తీసుకోవడానికి అయిదుగురు సభ్యులతో కూడిన ధర్మాసనాన్ని ఎన్‌సీఎల్‌టీ ఏర్పాటు చేసింది. ఇలా ఐదుగురు సభ్యులతో ధర్మాసనం ఏర్పాటు చేయడం ఎన్‌సీఎల్‌టీ చరిత్రలో తొలిసారి. దీనిపై ఈ ధర్మాసనం నేడు విచారణ చేపట్టింది. ఈ క్రమంలో ద్విసభ్య తీర్పును నిలిపివేయడంతో పాటు ఆయన వ్యక్తిగత హామీదారుగా ఉన్న ఆస్తులను ఎవరికీ బదిలీ చేయకూడదని ఆదేశించింది. అన్ని పక్షాలకు నోటీసులు జారీ చేసింది.

# అయిష్టంగానే వచ్చి..

## 'యాపిల్'కు టాప్ గేర్.. టిమ్ కుక్ ప్రస్థానమిదీ!



- 1998లో టిమ్ కుక్ యాపిల్‌లో చేరారు
- అప్పట్లో యాపిల్ దివాలా అంచున ఉంది
- కాంపాక్ ఉద్యోగాన్ని వదిలి యాపిల్‌ను ఎంచుకున్నారు
- స్టీవ్ జాబ్స్‌తో భేటీ ఆయన నిర్ణయాన్ని మార్చింది
- జాబ్స్ విజన్ కుక్‌ను ఎంతగానో ఆకట్టుకుంది
- 2011లో యాపిల్ సీఈఓగా బాధ్యతలు చేపట్టారు
- 15 ఏళ్లపాటు సీఈఓగా సేవలందించారు
- యాపిల్ విలువ వి350 బిలియన్ల నుంచి వి4.5 ట్రిలియన్లకు పెరిగింది
- యాపిల్ షేర్లు 2,275% మేర పెరిగాయి
- యాప్ స్టోర్, ఐక్లౌడ్, యాపిల్ పే వంటి సేవలకు ప్రాధాన్యం
- యాపిల్ వాచ్, ఎయిర్‌పాడ్స్ విజయవంతమయ్యాయి
- వీ-సిరీస్ చిప్స్‌తో యాపిల్ కొత్త మైలురాయి
- 2024లో ఎలక్ట్రిక్ కార్ ప్రాజెక్ట్ రద్దు
- ఫోల్డబుల్ ఐఫోన్‌పై ఇంకా ఆసక్తి కొనసాగుతోంది
- ఇకపై ఎగ్జిక్యూటివ్ చైర్మన్‌గా టిమ్ కుక్ కొనసాగనున్నారు

హాయిగా సాగిపోతున్న ఉద్యోగం.. అప్పటికే దివాలా అంచున ఉన్న కంపెనీ నుంచి జాబ్ ఆఫర్. ఇలాంటి పరిస్థితుల్లో ఉన్న ఉద్యోగాన్ని వదులుకునే సాహసం ఎవరూ చేయరు. కానీ, ఒక్క భేటీ ఆ ఉద్యోగి నిర్ణయాన్ని మార్చింది. తర్వాతి కాలంలో ఆయన్ను కంపెనీకి సీఈఓను చేసింది. కంపెనీని సైతం ప్రపంచంలోనే అత్యంత విలువైన వాటిల్లో ఒకటిగా నిలిపింది. ఆ ఉద్యోగే టిమ్ కుక్. ఆయనతో భేటీ అయిన వ్యక్తే యాపిల్ సహ వ్యవస్థాపకుడు స్టీవ్ జాబ్స్. యాపిల్‌కు సుదీర్ఘకాలం పాటు సీఈఓగా వ్యవహరించిన టిమ్ కుక్ ఆ బాధ్యతల నుంచి వైదొలిగిన వేళ.. ఆ సంస్థలోకి ఆయన రాక ఎలా సాగిందనేది చూద్దాం.

అది 1998. టిమ్ కుక్.. కాంపాక్ అనే కంపెనీలో మంచి హోదాలో పనిచేస్తున్నారు. ఆ సమయంలో కాంపాక్ విలువ 30 బిలియన్ డాలర్లు. యాపిల్ కంపెనీ విలువ 3 బిలియన్ డాలర్లు మాత్రమే. పైగా దివాలా అంచున ఉంది. ఆ సమయంలో యాపిల్ నుంచి వచ్చిన జాబ్ ఆఫర్‌ను కుక్ తిరస్కరించారు. తాను పనిచేస్తున్న ఉద్యోగంలోనే తనకు ఆనందం ఉందని తెగేసి చెప్పారు. 2014లో ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో టిమ్ కుక్ ఈ విషయాన్ని చెప్పుకొచ్చారు.

**ఆ ఒక్క భేటీ మార్చింది**

జాబ్ ఆఫర్‌ను తిరస్కరించినా యాపిల్ నుంచి కుక్‌కు కాల్స్ వస్తూనే ఉన్నాయి. స్టీవ్ జాబ్స్‌తో భేటీ అని చెప్పగానే టిమ్ కుక్ కూడా కాస్త మెత్తబడ్డారు. దీంతో ఆయనపై ఉన్న గౌరవంతో సమావేశానికి అంగీకరించారు. వాస్తవానికి యాపిల్‌లో చేరాలనే ఉద్దేశమేదీ అప్పటి వరకు టిమ్‌కుక్‌కు లేదు. భేటీ ప్రారంభమైన కాసేపటికే జాబ్స్ తన ఆలోచనలను కుక్‌తో పంచుకోవడం ప్రారంభించారు. కంపెనీని ఎలా ముందుకు నడిపించాలి? వినియోగదారులను ఎలా ఆకట్టుకోవాలి? అనే అంశాలపై మాట్లాడడం మొదలుపెట్టారు. జాబ్స్ విజన్ కుక్‌ను అమితంగా ఆకట్టుకుంది. దీంతో కాంపాక్‌ను వీడి యాపిల్‌లో చేరాలని కుక్ నిర్ణయించుకున్నారు. స్నేహితులు, సలహాదారులు వారించినా యాపిల్‌లో చేరేందుకే మొగ్గు చూపారు. అలా 1998లో యాపిల్‌లో సీనియర్ వైస్‌ప్రెసిడెంట్‌గా చేరారు.

**3 దశాబ్దాల ప్రస్థానం.. 15 ఏళ్లుగా సీఈఓ**

యాపిల్‌లో టిమ్‌కుక్‌ది మూడు దశాబ్దాల ప్రస్థానం. వివిధ హోదాల్లో పనిచేశారు. 2011లో స్టీవ్ జాబ్స్ నుంచి నాయత్వ బాధ్యతలు చేపట్టారు. 15 ఏళ్లపాటు ఆ బాధ్యతల్లో కొనసాగారు. ఈ సుదీర్ఘ ప్రయాణంలో ఎన్నో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టారు. స్టీవ్ అప్పగించిన కంపెనీని అంతే బాధ్యతాయుతంగా ముందుకు నడిపించే వ్యక్తి కోసం ఏళ్ల పాటు అన్వేషించి.. టిమ్‌కుక్ తర్వాత ఆ బాధ్యతల్లో జాన్ టెర్నస్‌ను ఎంపిక చేశారు. కొత్త సీఈఓకు బాధ్యతలు అప్పగించి.. ఇకపై కంపెనీ ఎగ్జిక్యూటివ్ చైర్మన్‌గా కుక్ కొనసాగనున్నారు.

**ఆవిష్కరణలు.. కొత్త పుంతలు**

టిమ్ కుక్ హయాంలో యాపిల్ కంపెనీ రికార్డు వృద్ధి సాధించింది. ఆయన బాధ్యతలు చేపట్టే నాటికి కంపెనీ విలువ దాదాపు 350 బిలియన్ డాలర్లు ఉండగా.. ఆయన నాయకత్వంలో ఏకంగా 4.5 ట్రిలియన్ డాలర్లను దాటింది. ఈ కాలంలో యాపిల్ షేర్లు 2,275 శాతం మేర పెరిగాయి.

కేవలం ఉత్పత్తుల తయారీకే కాకుండా యాప్ స్టోర్, ఐక్లౌడ్, యాపిల్ మ్యూజిక్, యాపిల్ పే, యాపిల్ టీవీం వంటి సేవలపై టిమ్ కుక్ దృష్టిసారించారు.

2015లో ఈసీజీ, ఫాల్ డిటెక్షన్ ఫీచర్లతో విడుదలైన యాపిల్ వాచ్, 2016లో విడుదలైన ఎయిర్‌పాడ్స్ మార్కెట్లో సంచలనం సృష్టించాయి. ఇంటెల్ ప్రాసెసర్లపై ఆధారపడటం తగ్గించేసిన యాపిల్.. సొంతంగా వీ-సిరీస్' (యాపిల్ సిలికాన్) చిప్‌లను తయారు చేయడం ప్రారంభించింది. ఇది టెక్ ప్రపంచంలో ఒక పెద్ద మైలురాయి.

టిమ్ కుక్ హయాంలో వైఫల్యాలూ లేకపోలేదు. భారీగా పెట్టుబడులు పెట్టిన ఎలక్ట్రిక్ కార్ ప్రాజెక్ట్‌ను 2024లో రద్దు చేసింది. యాపిల్ నుంచి ఫోల్డబుల్ ఫోన్లు రాకపోవడం మరో వెలితి. కొత్త సీఈఓ చేతులమీదుగా ఫోల్డుబుల్ ఫోన్లు లాంచ్ అవుతాయని రూమర్లు వినిపిస్తున్నాయి.

# సరికొత్త అవతారంలో రష్మిక.. 'మైసా' రిలీజ్ డేట్ ఫిక్స్

కథానాయిక రష్మిక ప్రధాన పాత్రలో నటిస్తున్న యాక్షన్ థ్రిల్లర్ 'మైసా' . రవీంద్ర పుల్లె తెరకెక్కిస్తున్నారు. తాజాగా చిత్రబృందం ఈ సినిమా విడుదల తేదీని ఖరారు చేసింది. ఈ చిత్రాన్ని నవంబరు 27న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో భారీ స్థాయిలో విడుదల చేయనున్నట్లు అధికారికంగా ప్రకటించింది.ఈ రిలీజ్ డేట్ ప్రకటన సందర్భంగా మేకర్స్ పంచుకున్న క్యాప్షన్ ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. "సహజంగానే ఆమె దృఢమైనది.. ఎంచుకున్న మార్గంలో భయం లేనిది.. చెక్కుచెదరని ఆత్మవిశ్వాసం ఆమె సొంతం. మునుపెన్నడూ చూడని విధంగా 'మైసా' ప్రపంచంలో రష్మికను చూసేందుకు సిద్ధంగా ఉండండి" అంటూ చిత్ర బృందం సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేసింది. మునుపెన్నడూ లేని విధంగా రష్మిక ఈ సినిమాలో పూర్తిస్థాయి యాక్షన్ పాత్రలో కనిపించనున్నట్లు తెలుస్తోంది. విజయ్ దేవరకొండ కథానాయకుడిగా రాహుల్ సాంకృత్యాన్ దర్శకత్వంలో రూపొందుతున్న పాన్ ఇండియా చిత్రం 'రణబాలి' . రష్మిక కథానాయిక. పెళ్లి తర్వాత వీళ్లిద్దరూ కలిసి నటిస్తున్న చిత్రమిది. దసరా కానుకగా అక్టోబరు 16న ప్రేక్షకుల ముందుకు రానున్నట్లు ఇటీవలే చిత్ర బృందం స్పష్టం చేసింది.






## 6న టైటిల్... విడుదల తేదీ!



చిత్రీకరణలో గాయపడిన అగ్ర కథానాయకుడు నందమూరి బాలకృష్ణ ప్రస్తుతం కోలుకుంటున్నారు. మోకాలికి శస్త్రచికిత్స జరిగినా తన 111వ సినిమాని ప్రణాళిక మేరకే విడుదల చేయాలనే సంకల్పంతో ఉన్నారాయన. అందుకు తగ్గట్టుగానే చిత్రబృందం ఈ నెల 6న సినిమా పేరుని, విడుదల తేదీ వివరాల్ని వెల్లడిస్తున్నట్టు సోమవారం ప్రకటించింది. డిసెంబరులో ఈ సినిమా ప్రేక్షకుల ముందుకొచ్చే అవకాశాలున్నాయి. 'ఎన్.బి.కె.111' పేరుతో పట్టాలెక్కిన ఈ సినిమా గోపీచంద్ మలినేని దర్శకత్వంలో తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. విజయవంతమైన 'వీరసింహారెడ్డి' తర్వాత ఆ కలయికలో రూపొందుతున్న మరో చిత్రమిది. కాజల్ అగర్వాల్ కథానాయికగా నటిస్తోంది. వెంకట సతీశ్ కిలారు నిర్మిస్తున్నారు. ఇప్పటికే ఈ సినిమా ప్రచార చిత్రం విడుదలైన సంగతి తెలిసిందే. ముంబయి నేపథ్యంలో యాక్షన్ ప్రధానంగా రూపొందుతున్న సినిమా ఇదని స్పష్టమైంది. ఈ చిత్రానికి సంగీతం: తమన్, ఛాయాగ్రహణం: అరవింద్ ఎస్.కశ్యప్, కూర్పు: నవీన్ నూలి, ప్రొడక్షన్ డిజైన్: ఎ.ఎస్.ప్రకాశ్, సంభాషణలు: సాయిమాధవ్ బుర్రా.

## తెలుగు ప్రేక్షకుల ప్రేమే నా బలం: దుల్కర్ సల్మాన్



కథానాయకుడు దుల్కర్ సల్మాన్ ప్రధాన పాత్రలో, నహాస్ హిదాయత్ దర్శకత్వంలో తెరకెక్కిన ఫాంటసీ థ్రిల్లర్ 'ఐ యామ్ గేమ్' . ఆంటోనీ వర్గీస్, మిస్కిన్, నటి కయాదు లోహర్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ మూవీ సెప్టెంబరు 3న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లోని ఓ కాలేజీలో నిర్వహించిన ప్రమోషనల్ ఈవెంట్‌లో విద్యార్థులతో చిత్రబృందం ముచ్చటించింది. ఈ సందర్భంగా దుల్కర్ పలు ఆసక్తికర విషయాలు పంచుకున్నారు."స్కూల్ రోజుల్లో నాకు హిందీ, తమిళం, మలయాళం తప్ప తెలుగు ఏమాత్రం రాదు. 'ఓకే బంగారం' సినిమా తర్వాత తెలుగులో నాకు చాలా అవకాశాలు వచ్చాయి. భాష రాదు కాబట్టి నేను ఆ సినిమాలు చేయలేనని చెప్పేశాను. కానీ 'మహానటి' ఆఫర్ వచ్చినప్పుడు దర్శకుడు నాగ్ అశ్విన్ 'నేను నేర్పిస్తానని' చెప్పారు. అప్పుడు డైలాగ్స్ నేర్చుకునేందుకు రాత్రంతా నిద్రపోకుండా ప్రాక్టీస్ చేశాను. ఆ కష్టమే నాకు 'మహానటి' లాంటి బ్లాక్‌బస్టర్‌ను ఇచ్చింది. తెలుగు ప్రేక్షకులు నాపై చూపిస్తున్న ప్రేమే నా బలం, నా సంతోషం. ఈ సినిమా ఇండస్ట్రీ ఒక మ్యాజిక్. ఎవరైనా నిజాయతీగా కష్టపడితే ఇక్కడ కచ్చితంగా గుర్తింపు లభిస్తుంది" అని ఆయన పేర్కొన్నారు. తన తండ్రి అగ్ర కథానాయకుడు మమ్ముట్టి నుంచి నేర్చుకున్న అత్యుత్తమ సలహా ఏంటన్న ప్రశ్నకు దుల్కర్ ఆసక్తికరమైన సమాధానం ఇచ్చారు. "మా నాన్నగారు నా జీవితంలో పెద్దగా జోక్యం చేసుకోరు. నువ్వే ఏదైనా చేయి, తప్పులు చేసి నేర్చుకో అని చెబుతుంటారు. కానీ, ఎప్పుడూ నాకు ఒక సేఫ్టీ నెట్‌లా అండగా ఉంటారు. అలాంటి తండ్రి ఉండటం నా బిగ్గెస్ట్ బ్లెస్సింగ్" అని ఆయన ఆనందం వ్యక్తం చేశారు. 'ఐ యామ్ గేమ్' సినిమా ఒక మంచి థియేట్రికల్ ఎక్స్‌పీరియన్స్ ఇస్తుందని, ఇందులో తను మునుపెన్నడూ చేయని విభిన్నమైన, అన్‌లైకబుల్ పాత్రలో కనిపిస్తానని దుల్కర్ తెలిపారు. ఈ కార్యక్రమం చివర్లో విద్యార్థుల కోరిక మేరకు దుల్కర్ చెప్పిన 'అమ్మాడి', 'ఏమే సీతా' డైలాగ్స్ అక్కడి వారిని విశేషంగా ఆకట్టుకున్నాయి.



## అది నేను కాదు.. ఫేక్ వీడియో: శాలిని పాండే

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాంకేతికతతో సృష్టిస్తున్న డీప్‌ఫేక్ వీడియోలు నెట్టింట తీవ్ర కలకలం రేపుతున్నాయి. తాజాగా 'అర్జున్ రెడ్డి' హీరోయిన్ శాలిని పాండే కూడా వీటి బారిన పడ్డారు. ఆమెకు సంబంధించి ఏఐతో సృష్టించిన ఓ వీడియో నెట్టింట వైరల్‌గా మారింది. తన పేరుతో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్న ఫేక్ వీడియో, ఫొటోలపై ఆమె స్పందించారు. ఆ ఫొటోలు కృత్రిమ మేధ (ఏఐ)తో చేశారని తెలిపారు. ఈ విషయంపై సోషల్ మీడియా వేదికగా ఒక పోస్ట్ పెట్టారు. టెక్నాలజీని ఇలా ఉపయోగించడం సరికాదంటూ మండిపడ్డారు. 'ప్రస్తుతం నెట్టింట నా పేరుతో సర్క్యులేట్ అవుతున్న వీడియో పూర్తిగా ఫేక్. అది ఏఐతో చేసినది. అందులో ఉన్నది నేను కాదు. టెక్నాలజీని ఇలా మహిళలను కించపరిచేలా వాడటం అత్యంత దారుణం. దీన్ని నేను తీవ్రంగా ఖండిస్తున్నాను. దయచేసి ఆ వీడియో కనిపిస్తే ఎవరూ షేర్ చేయొద్దు, డౌన్‌లోడ్ చేయొద్దు. వెంటనే రిపోర్ట్ చేయండి" అని శాలిని పాండే ఇన్‌స్టాగ్రామ్ వేదికగా కోరారు.శాలినీ పాండే 2017లో విజయ్ దేవరకొండతో కలిసి 'అర్జున్ రెడ్డి' చిత్రంతో తెరంగేట్రం చేశారు. ఆ తర్వాత 'మహానటి', '118', 'జయేష్ భాయ్ జోర్దార్', 'మహారాజ్' వంటి చిత్రాల్లో నటించారు. ఆమె చివరిగా 'రాహు కేతు' చిత్రంలో కనిపించారు.



## ప్రతి పాత్ర ఓ హీరోగా... సీతారామయ్య గారి మనవరాలు

"ఒక అమ్మాయి కథ కాకుండా... ఒక పూర్తిస్థాయి జీవితాన్ని ఆవిష్కరించాలనే ప్రయత్నమే 'సీతారామయ్య గారి మనవరాలు'. ప్రతి ధారావాహికలోనూ భావోద్వేగాలు, డ్రామా ఉంటాయి. అంతకుమించి నేటితరానికి అవసరమైన విలువల్ని ఇందులో చెప్పాం" అన్నారు మలినేని రాధాకృష్ణ. ఆయన దర్శకత్వంలో రూపొందిన ఈ ధారావాహిక ఈటీవీలో సోమవారం రాత్రి 8.30 నుంచి మొదలైంది. తొలి రోజే విశేష ప్రేక్షకాదరణ పొందింది. సోమవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన విడుదలకు ముందస్తు వేడుకలో రెండు ఎపిసోడ్స్‌ని ప్రత్యేకంగా ప్రదర్శించారు. ఈ వేడుకకి ఈటీవీ డైరెక్టర్ సుజయ్ చెరుకూరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఆయన మాట్లాడుతూ "ఈ ధారావాహిక చూసిన ప్రతి ఒక్కరికీ సినిమా చూసిన అనుభూతి కలిగిందని నమ్ముతున్నా. ఈ రెండు ఎపిసోడ్స్‌ని చూసినప్పుడు కథలోని భావోద్వేగం స్పష్టంగా అర్థమైంది. బలమైన భావోద్వేగాలు ఎటువంటి ప్రేక్షకుడినైనా కథలో లీనం చేసి, కూర్చోబెడతాయి. ఇవే భావోద్వేగాలు, గాఢతని కొనసాగిస్తే ఈ ధారావాహిక బృందం అంతటికీ ఓ వరం అవుతుందని నా నమ్మకం. నటీనటులు, సాంకేతిక బృందం అంతటికీ నా అభినందనలు. శుభాకాంక్షలు" అన్నారు.దర్శకుడు మాట్లాడుతూ "మహాభారతంలో ప్రతి పాత్రకీ ప్రాధాన్యం ఉంటుంది. అదే తరహాలో ఇందులోని పాత్రల్ని రాశాం. సీతారామయ్య నుంచి శివ వరకూ ప్రతి పాత్ర కూడా ఇందులో హీరోనే. ఈటీవీ అనేది ఒక పెద్ద వేదిక. ఈ వేదికపై ఎన్నో అద్భుతాలు జరిగాయి. కొత్తతరానికి మనవైన విలువలు, మనవైన భావోద్వేగాల్ని చెప్పాలనే ఓ గొప్ప సంకల్పంతో ఈ ధారావాహికని తీశాం. తనకి తగిలిన గాయం కారణంగా ఓ అమ్మాయి ఇందులో గతాన్ని, వర్తమానాన్నీ మరిచిపోతూ ఉంటుంది. అంత కష్టం, అన్ని సవాళ్లు ఎదురైనా తన సంకల్పం కోసం ఎలా పరితపించిందన్నది కీలకం. ఎన్నో ప్రత్యేకతలున్న కథ ఇది" అన్నారు. ఈ కార్యక్రమంలో శివపార్వతి, ప్రశాంత్, మౌనిక, రచిత, శ్రీధర్, వెంకట చలపతి, స్క్రీన్‌ప్లే, సంభాషణల రచయిత మహేంద్ర వర్మ తదితరులు పాల్గొన్నారు.

# మిత కాఫీ గుండెకు హితం!

పొద్దున లేవగానే కాఫీ నోట్లో పడకపోతే చాలామందికి రోజు గడవదు. గుక్క గుట్కా హుషారు ఊపందుకుంటుంది. కాఫీ చేదు, చక్కెర తీపి, పాల కమ్మదనం కలగలిస్తే చెప్పేదేముంది? అమృతమైనా దిగుదుడువే! ఫిల్టర్ అయితేనేమి? ఇన్‌స్టాంట్ అయితేనేమి? దేని రుచి దానిదే. అందుకేనేమో ఒక కప్పుతో సరిపుచ్చుటమంటే మనసు చివుక్కుమంటుంది. రోజుకు మూడు నాలుగు సార్లు రుచి చూస్తే గానీ తనివి తీరదు. ఇంతకీ దీంతో ఒనగూరే ప్రయోజనాలేంటి? రోజుకు ఎన్ని కప్పులు లాగించాలి? పాలు, చక్కెర కలపాలా? వద్దా? ఉట్టి కాఫీ మాత్రమే తాగాలా? ఇలాంటి ప్రశ్నలన్నో మనసులో మెదలటం సహజమే. కానీ ఒక్కో పరిశోధన ఒక్కో రకంగా చెబుతుంటే ఎలా? అత్యున్నతస్థాయి అమెరికన్ హార్ట్ అసోసియేషన్‌కు చెందిన సర్క్యులేషన్ జర్నల్‌లో ప్రచురితమైన తాజా అధ్యయనం కొన్ని సందేహాలను నివృత్తి చేసింది. దీనిపై కాఫీ విషయంలో కొత్త శాస్త్రీయ ప్రకటనలుగా పరిగణించడం విశేషం.




చాలామందికి రోజుకు
**3 నుంచి 5 కప్పుల వరకు**
(రోజుకు కెఫీన్ 400 ఎంజీ వరకు)
బ్లాక్ కాఫీ సురక్షితం.

అంటే చక్కెర, తీపి పదార్థాలు, ఫ్లేవర్లు, క్రీమ్ వంటివి కలపని కాఫీ మేలన్నమాట.


## బ్లాక్ కాఫీతో కలిగే ప్రయోజనాలు

టైప్ 2 మధుమేహం ముప్పు తగ్గుతుంది.
గుండెజబ్బు, పక్షవాతం, గుండె వైఫల్యం ముప్పు తగ్గుతుంది.
కొన్నిరకాల అస్తవ్యస్త గుండెతీరు సమస్యల ముప్పు తగ్గుతుంది.
వయసుతో ముడిపడిన డిమెన్షియా, అల్జీమర్స్ వంటి జబ్బుల ముప్పు తగ్గే అవకాశముంది.
హెచ్చరిక: చక్కెర, రుచికారక సిరప్‌లు, పాలు, క్రీమ్ వంటివి కలిపితే మాత్రం ఈ ప్రయోజనాలు తగ్గొచ్చు. అదనంగా జతచేసే ఇలాంటి పదార్థాల ప్రభావాలను అర్థం చేసుకోవడానికి మరింత పరిశోధన చేయాల్సి ఉందంటాం నిపుణుల అభిప్రాయం. వీటితో క్యాలరీలు ఎక్కువగా లభిస్తాయి కారణం కావచ్చు.

**కాఫీలోని ముఖ్యమైన దినుసు కెఫీనే.**




మెదడు, కేంద్ర నాడీ వ్యవస్థను ఉత్తేజితం చేసేది ఇదే. మరింత శక్తిని ఉత్పత్తి చేసేలా, దాన్ని ఇంకాస్త ఎక్కువగా ఉపయోగించుకునేలా శరీరాన్ని ప్రోత్సహిస్తుంది. అందుకే అధిక రక్తపోటు, కొలెస్ట్రాల్, మధుమేహం, గుండెజబ్బు, పక్షవాతం, గుండె వైఫల్యం, గుండెలాగు తప్పటం, ఇతర గుండె సమస్యలపై కెఫీన్ చూపుతున్న ప్రభావం మీద జరిగిన పలు అధ్యయనాలను పరిశోధకులు విశ్లేషించారు. వాటన్నింటినీ గుదిగుచ్చి కొత్త విషయాలను వెలుగులోకి తెచ్చారు.




## కెఫీన్ ప్రభావం ఇలా..




అధిక రక్తపోటు మీద: కెఫీన్ ఎంత తీసుకుంటున్నారనే దాన్ని బట్టే రక్తపోటు మీద ప్రభావం కనిపిస్తోంది. కాఫీతో మొదట్లో తాత్కాలికంగా రక్తపోటు పెరుగుతున్నప్పటికీ.. అలవాటుగా రోజుకు 3 కప్పుల కన్నా ఎక్కువ తాగేవారికి అధిక రక్తపోటు ముప్పు తగ్గుతుంది.





**మధుమేహం మీద:** క్రమం తప్పకుండా బ్లాక్ కాఫీ తాగడంతో మధుమేహం ముప్పు తగ్గుతోంది. అయితే ఇందుకు కెఫీన్ కన్నా కాఫీలోని ఇతర పదార్థాలే దోహదం చేస్తున్నాయి.



**కొలెస్ట్రాల్ మీద:** కాఫీలోని కేఫ్‌స్టాల్ అనే పదార్థంతో చెడు (ఎల్డీఎల్) కొలెస్ట్రాల్ ఎక్కువవుతుంది. ఫిల్టర్ చేయని కాఫీతో కేఫ్‌స్టాల్ ఉంటుంది. ఫిల్టర్ లేదా ఇన్‌స్టాంట్ కాఫీలో ఉండదు.



**గుండెతయా మీద:** రోజుకు 1-3 కప్పుల కాఫీతో గుండెజబ్బు తప్పు ముప్పేమీ పెరగడం లేదు. కాకపోతే గుండె గుడి గది ఇంకాస్త ముందుగా కొట్టుకునే అవకాశం ఉంటుంది.



గుండెజబ్బు, పక్షవాతం మీద: రోజుకు 2-4 కప్పుల కాఫీ తాగేవారికి గుండెజబ్బు, గుండె వైఫల్యం, పక్షవాతం ముప్పు తగ్గుముఖం పడుతున్నాయి. అయితే 4 కప్పుల కన్నా ఎక్కువ తాగితే గుండె వైఫల్యం ముప్పు పెరిగే ప్రమాదం ఉంది.

## నిపుణుల సూచనలు

నిపుణుల సూచనలు
బ్లాక్ కాఫీనే ఉత్తమం.
రోజుకు 3-5 కప్పుల పరిమితి మంచిది.
శక్తి పానీయాలకు దూరంగా ఉండండి.
వ్యక్తిగత ఆరోగ్య పరిస్థితులను బట్టి మోతాదును నియంత్రించండి.


గమనిక: ఇది సాధారణ సమాచారం మాత్రమే. వ్యక్తిగత అవసరాలకు మీ వైద్యుడిని సంప్రదించండి.

# గర్భధారణకు వీర్య బ్యాక్టీరియా సాయం

పేగుల్లోనే కాదు, వీర్యద్రవంలోనూ బ్యాక్టీరియా ఉంటుంది! ఆశ్చర్యంగా అనిపించినా ఇదీ సంతాన సాఫల్యానికి తోడ్పడుతుంది. ఒకప్పుడు వీర్యద్రవం సూక్ష్మక్రిమి రహితమని భావించేవారు. కానీ ఇందులోనూ రకరకాల సూక్ష్మక్రిములు ఉంటున్నట్టు కనుగొన్నారు. ఇవి ప్రోస్టేట్ గ్రంథి, వృషణాలు, మూత్రకోశం నుంచి పుట్టుకొచ్చి, వీర్యంలో కలుస్తుంటాయి. శుక్రకణాల ఆరోగ్యం, కదలికల్లో కీలక పాత్ర పోషిస్తాయి. ల్యాక్టోబాసిలస్ రకం క్రిములు ఎక్కువగా ఉంటే శుక్రకణాలు పెద్దమొత్తంలో ఉంటాయి. వీటి కదలికలూ బాగుంటాయి. అదే హానికారక ప్రివోటెల్లా, యూరియాప్లాజ్మా, కొన్నిరకాల సూడోమోనాస్ జాతుల వంటి క్రిములు ఎక్కువైతే శుక్రకణాల నాణ్యత, కదలికల వేగం తగ్గుతాయి. వీటి ఆకారమూ అస్తవ్యస్తంగా ఉండొచ్చు. గర్భధారణలో వీటి పాత్రపై తాజా డెన్మార్క్ అధ్యయనం సరికొత్త విషయాలను వెలుగులోకి తెచ్చింది. కృత్రిమ గర్భధారణకు ప్రయత్నిస్తున్నవారిని, తరచూ గర్భస్రావానికి గురవుతున్న వారిని ఇందులో పరిశీలించారు. కృత్రిమ గర్భధారణ బృందంలో సుమారు 24% మగవారిలో, గర్భం నిలవని బృందంలో 41% మగవారిలో వీర్యంలోని బ్యాక్టీరియా అస్తవ్యస్తంగా ఉంటున్నట్టు తేలింది. వీర్యం బ్యాక్టీరియా సమతులంగా ఉన్నప్పుడు- కృత్రిమ గర్భధారణ బృందంలోని 85% దంపతులకు సంతానం కలగగా..



బ్యాక్టీరియా అస్తవ్యస్తమైన బృందంలో కేవలం 57% దంపతులకు మాత్రమే సంతానం కలగటం గమనార్హం.




# 'వెంటాడే' దగ్గు!

ఒకట్రెండు సార్లు దగ్గితే? పొలమారిందేమో అనుకుంటాం. ఒకట్రెండు రోజులుగా దగ్గుతుంటే? జలుబు, ఫ్లూ కావొచ్చని భావిస్తాం. వారమైనా తగ్గకపోతే? అలర్జీ, బ్రాంకైటిస్ వంటి సమస్యలు మనసులో మెదలుతాయి. మూడు, నాలుగు వారాలు దాటినా వేధిస్తుంటే? ఏమైందో ఏమోననే భయం పుట్టటం ఖాయం. నిజానికి జలుబు, ఫ్లూ, న్యుమోనియా వంటి వాటితో వచ్చే దగ్గు ఆయా సమస్యలు నయం కాగానే తగ్గుతుంది. కానీ దీర్ఘకాల దగ్గు అలా కాదు. వారాలు, నెలల తరబడి వెంటాడుతూ వస్తుంది. దీన్ని నిర్లక్ష్యం చేయటానికి లేదు.

సాధారణంగా దగ్గు రాగానే కంగారుపడతాం. కానీ అది మన శ్వాసకోశ వ్యవస్థను కాపాడే సహజ రక్షణ ప్రక్రియ. శ్వాసనాళాల్లోకి ధూళి, దుమ్ము లేదా క్రిములు చేరినప్పుడో.. కఫం (శ్లేష్మం) బాగా పేరుకున్నప్పుడో శరీరం వాటిని బయటకు పంపడానికి దగ్గు రూపంలోనే స్పందిస్తుంది. శ్వాసనాళాల్లోనే కాకుండా చెవి, ముక్కు చుట్టుపక్కల సైనస్ గదులు, గొంతు, అన్నవాహిక వంటి భాగాల్లోనూ అత్యంత సున్నితమైన నాడీ కణాలు ఉంటాయి. శ్వాసనాళాల్లో ఏదైనా నస లేదా ఆటంకం ఏర్పడగానే ఇవి వేగస్ నాడి ద్వారా మెదడుకు సంకేతాన్ని పంపుతాయి. దాన్ని అందుకున్న మెదడు వెంటనే శ్వాసకోశ, గొంతు కండరాలను బలంగా ఒత్తిడికి గురిచేసి గాలిని వేగంగా బయటకు నెట్టేలా ఆదేశిస్తుంది. ఈ క్రమంలోనే దగ్గు పుడుతుంది. అనవసరమైనవి లోపలికి పోకుండా కాపాడే ఇది ఊపిరితిత్తుల ఆరోగ్యానికి ఎంతో కీలకం. అయితే దగ్గు అన్నిసార్లూ మంచిదే అనుకోవటానికి లేదు.

కాలాన్ని బట్టి రకాలు

దగ్గు ఎంతకాలంగా వస్తుందనే దాన్ని బట్టి తీవ్రత, రకాలు ఆధారపడి ఉంటాయి.

అక్యూట్: మూడు వారాల కన్నా తక్కువ కాలం ఉండేది అక్యూట్ రకం. ఇది చాలావరకూ సాధారణ వైరల్ ఇన్ఫెక్షన్లతో వస్తుంది. అయితే పిల్లల్లో శ్వాసనాళాల్లోకి ఆహారం, ద్రవాలు పోవటం, ఊపిరితిత్తుల్లో వాపు ప్రక్రియతోనూ రావొచ్చు.

సబ్ అక్యూట్: మూడు నుంచి ఎనిమిది వారాల వరకు ఉండేది.



క్రానిక్: ఎనిమిది వారాలకు మించి కొనసాగేది క్రానిక్ రకం. ఇది చాలా విసుగు కలిగిస్తుంది. అంతేకాదు, నిద్ర సరిగా పట్టకపోవటం, తీవ్ర అలసట వంటి ఇబ్బందులకూ గురిచేస్తుంది. రెండు నెలలు దాటినా దగ్గు తగ్గకపోతే ఊపిరితిత్తుల్లో తీవ్రమైన సమస్యలు, క్యాన్సర్ కణితులు, ఇంటర్‌స్టీషియల్ లంగ్ డిసీజ్ (ఐఎల్‌డీ) వంటి జబ్బులు ఉన్నాయేమోనని నిశితంగా పరీక్షించాల్సి ఉంటుంది. ఇలాంటి పరిస్థితుల్లో సొంత వైద్యంతో, దగ్గు మందులతో తాత్కాలికంగా లక్షణాలను అణచివేయటం సరికాదు. దగ్గును ఒక జబ్బుకు సంకేతంగా మాత్రమే కాకుండా, దానికదే ఒక ప్రత్యేక సమస్యగా భావించాల్సి ఉంటుంది. దగ్గుకు కారణమవుతున్న అంశాలను గుర్తించి చికిత్స చేయటం చాలా ముఖ్యం.

ఇతర లక్షణాలూ..

దీర్ఘకాలిక దగ్గులో కొన్ని ఇతర లక్షణాలూ కనిపించొచ్చు.

ముక్కు కారడం లేదా ముక్కు దిబ్బడ
గొంతు వెనుక భాగంలో కఫం జారటం (పోస్ట్‌నాసల్ డ్రిప్)
తరచూ గొంతును సరిచేసుకోవడం
గొంతు నొప్పి
బొంగురు గొంతు (స్వరం మారడం)
ఆయాసం, గాలి సరిగా అందకపోవటం (పిల్లనగ్రోవి ఊదినట్లు పిల్లికూతలు)
ఛాతీలో మంట (అసిడిటీ), నోట్లోకి పుల్లటి నీరు రావటం
దగ్గినప్పుడు అరుదుగా రక్తం పడటం

# వరద నీటిలో నడుస్తున్నారా?

మురుగుతో కలిసిన వరద నీటిలో నడిస్తే పాదాలు, కాళ్లకు ఇన్‌ఫెక్షన్లు తలెత్తొచ్చు. ముఖ్యంగా చర్మం కింది పొర వాపు (సెల్యులైటిస్) పెద్ద చిక్కే తెచ్చిపెడుతుంది. ఇది ప్రధానంగా స్టెఫలోకాకస్, స్ట్రెప్టోకాకస్ బ్యాక్టీరియాతో వస్తుంది. ఇవి చర్మం గీసుకుపోయిన చోటు నుంచి తేలికగా లోపలికి వెళ్లి, ఇన్‌ఫెక్షన్‌కు దారితీస్తాయి. ఈ సమస్య కాళ్లు, పాదాలు, వేళ్లలో ఎక్కువ. చాలావరకూ చర్మం దిగువ, కొవ్వు పొరలకే పరిమితమవుతుంది.

సెల్యులైటిస్‌లో ఇన్‌ఫెక్షన్ తలెత్తిన చోట చర్మం ఎరుపెక్కుతుంది. కాలు వాపు, ఉబ్బు, తీవ్రమైన నొప్పి, బొబ్బల వంటివీ కనిపిస్తాయి. చూడటానికి చర్మం చిన్న గుంతలు పడినట్టుగా నారింజ తొక్కలా కనిపిస్తుంది. కొందరికి జ్వరం, చలి, బలహీనత కూడా తలెత్తొచ్చు. దీనికి యాంటీబయాటిక్ మాత్రలు అంతగా పనిచేయవు. రక్తనాళం ద్వారా 7-10 రోజులు యాంటీబయాటిక్స్ ఇవ్వాల్సి ఉంటుంది. నిర్లక్ష్యం చేస్తే సమస్య ముదిరి, ఇన్‌ఫెక్షన్ రక్తంలోకి వ్యాపించే ప్రమాదమూ ఉంది.

నివారణ ఉత్తమం

వర్షపు నీటిలో తడిచినప్పుడు ఇంటికి వచ్చాక వెచ్చటి నీటితో శుభ్రంగా పాదాలు కడుక్కోవాలి. గాట్లు




ఉన్నట్టయితే యాంటీబయాటిక్ మలాము రాసుకోవాలి. ఒకవేళ ఒళ్లంతా తడిస్తే వేడి నీటితో స్నానం చేయాలి.

పాదాలు పొడిగా ఉండేలా, గాలి తగిలేలా చూసుకోవాలి. వర్షాకాలంలో బయటకు వెళ్లేటప్పుడు నీటికి తడవని షూ వేసుకుంటే మేలు. పూర్తిగా ఆరిన తర్వాతే చెప్పులు, షూ తిరిగి ధరించాలి. చెప్పులు వేసుకోకుండా ఆరుబయట, వాననీటిలో నడవొద్దు.

మధుమేహం వంటి సమస్యలుంటే డాక్టర్ సలహా మేరకు ప్రత్యేక చెప్పులు, షూ వేసుకోవాలి. తరచూ పాదాలు, కాళ్లను గమనించాలి. ఎరుపు, వాపు వంటి లక్షణాలేవైనా ఉన్నాయేమో చూసుకోవాలి. ఇతరుల పాదరక్షలను వేసుకోవద్దు.

# టర్బినేట్స్‌తోనూ దిబ్బడ

చాలాకాలంగా ముక్కు దిబ్బడ వేధిస్తుంటే ముందుగా గాలిగదుల వాపు (సైనసైటిస్) సమస్యే గుర్తుకొస్తుంది. నిజానికి ముక్కులో వెలుపలి వైపు గోడలో ఉండే టర్బినేట్స్ కూడా కారణం కావచ్చు. ఇవి జిగురుపొరతో కూడుకొని ఉంటాయి. ముక్కు మొదట్లో ఉండే పెద్ద టర్బినేట్ శ్వాస తీసుకుంటున్నప్పుడు గాలి ఉష్ణోగ్రత, తేమను నియంత్రిస్తుంది. గాలితో పాటు లోపలికి వచ్చే దుమ్ము వంటి వాటిని వడ గడుతుంది. ఇలా ముక్కును కాపాడుతుంది. ఇది ఉబ్బితే గాలి ప్రవాహానికి అడ్డు తగులుతుంది. ఫలితంగా ముక్కు దిబ్బడ, ఆయాసం, నుదురు నొప్పి వంటి లక్షణాలు తలెత్తుతాయి. ముక్కుదూలం ఒక పక్కకు వంగటం, అలర్జిక్ రైనైటిస్, నాన్ అలర్జిక్ రైనైటిస్, దుమ్ము ధూళి, పొగ వంటి రకరకాల అంశాలు టర్బినేట్స్ ఉబ్బటానికి దారితీస్తుంటాయి. కొందరు గర్భిణుల్లోనూ ఇది కనిపిస్తుంటుంది.



తెలంగాణ ట్రైనెట్ న్యూస్
నిజం • బాధ్యత • నిబద్ధత
తెలుగు దిన పత్రిక



# కృష్ణాష్టమి 2026.. పూజా సమయం, ఉపవాస నియమాలు ఇవే.!

శ్రీకృష్ణ జన్మాష్టమి హిందువులు ఎంతో భక్తిశ్రద్ధలతో జరుపుకునే పండుగ. విష్ణుమూర్తి ఎనిమిదో అవతారమైన శ్రీకృష్ణుడి జన్మదినాన్ని పురస్కరించుకుని ఈ వేడుకలను నిర్వహిస్తారు.

తెలుగు పంచాంగం ప్రకారం.. 2026లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను సెప్టెంబర్ 4, శుక్రవారం నిర్వహించనున్నారు. శ్రీకృష్ణుడు అర్ధరాత్రి సమయంలో జన్మించాడనే విశ్వాసం ఉండటంతో.. ఆ సమయానికి ప్రత్యేక పూజలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది.




అష్టమి తిథి: సెప్టెంబర్ 4న తెల్లవారుజామున 2:25 గంటలకు ప్రారంభమై.. సెప్టెంబర్ 5న అర్ధరాత్రి 12:13 గంటలకు ముగుస్తుంది.

రోహిణి నక్షత్రం: సెప్టెంబర్ 4న రాత్రి 11:04 గంటల వరకు ఉంటుంది. శ్రీకృష్ణుడు రోహిణి నక్షత్రంలో జన్మించాడని భక్తుల విశ్వాసం.

కృష్ణుడి జన్మ సమయం అర్ధరాత్రి కావడంతో.. ఈసారి సెప్టెంబర్ 4, శుక్రవారం రోజునే జన్మాష్టమి వేడుకలు నిర్వహించాలని పండితులు సూచిస్తున్నారు.

పూజా ముహూర్తం: సెప్టెంబర్ 4న రాత్రి 11:57 గంటల నుంచి 12:43 గంటల వరకు ఉంటుంది. ఈ నిశిత కాలంలో బాలకృష్ణుడికి ప్రత్యేక పూజలు చేసి.. జన్మాష్టమి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తారు.

అర్ధరాత్రి పూజకు ఎందుకు ప్రాధాన్యం?

జన్మాష్టమి పూజల్లో అర్ధరాత్రి సమయానికి ప్రత్యేక ప్రాధాన్యం ఉంది. శ్రీకృష్ణుడు నిశిత కాలంలో జన్మించాడని భక్తుల విశ్వాసం. అందుకే భక్తులు ఆ సమయంలో భజనలు, కీర్తనలు చేస్తూ శ్రీకృష్ణుడిని పూజిస్తారు. పూజ అనంతరం బాలకృష్ణుడి విగ్రహాన్ని ఉయ్యాలలో వేసి ఊపడం కూడా ముఖ్యమైన ఆచారం.

జన్మాష్టమి పూజా విధానం


జన్మాష్టమి సందర్భంగా ఇళ్లు, దేవాలయాలను ప్రత్యేకంగా అలంకరిస్తారు. బాలకృష్ణుడి విగ్రహాన్ని అందంగా అలంకరించి పూజలు చేస్తారు. పూలు, పండ్లు, వెన్న, పాలు వంటి నైవేద్యాలను సమర్పిస్తారు. పిల్లలకు కృష్ణుడు, రాధ వేషాలు వేయించడం కూడా జన్మాష్టమి వేడుకల్లో ప్రత్యేక ఆకర్షణగా ఉంటుంది.

జన్మాష్టమి ఉపవాసం నియమాలు

శ్రీకృష్ణుడు అర్ధరాత్రి జన్మించాడనే విశ్వాసంతో జన్మాష్టమి రోజంతా భక్తులు ఉపవాసం పాటిస్తారు. అర్ధరాత్రి సమయంలో బాలకృష్ణుడికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఉపవాసాన్ని విరమించే సంప్రదాయం ఉంది. ఈసారి సెప్టెంబర్ 4న అర్ధరాత్రి పూజలు పూర్తైన తర్వాత, సెప్టెంబర్ 5న రాత్రి 12:43 గంటల తర్వాత ఉపవాస దీక్షను విరమించవచ్చని చెబుతున్నారు. అయితే కొన్ని ప్రాంతాల్లో సూర్యోదయం తర్వాతే ఉపవాసాన్ని విరమించే ఆచారం కూడా ఉంది. కాబట్టి మీ ప్రాంతంలోని పంచాంగం, సంప్రదాయాన్ని అనుసరించడం మంచిది.

# వినికిడి లోపం.. మెదడును బలహీనపరుస్తుందా?

వయసు పెరిగే కొద్దీ వినికిడి తగ్గడం చాలామందిలో కనిపించే సాధారణ సమస్య. అయితే దీనిని కేవలం చెవులకు సంబంధించిన సమస్యగా భావించి నిర్లక్ష్యం చేయకూడదు. వినికిడి లోపానికి, జ్ఞాపకశక్తి తగ్గడం, ఆలోచనా సామర్థ్యం దెబ్బతినడం, డిమెన్షియా వంటి సమస్యలకు మధ్య సంబంధం ఉండొచ్చని పలు అధ్యయనాలు సూచిస్తున్నాయి.



వినికిడి సరిగా లేకపోతే ఇతరులు మాట్లాడే మాటలను అర్థం చేసుకోవడానికి మెదడు ఎక్కువగా శ్రమించాల్సి రావచ్చు. దీనికి తోడు కొంతమంది సామాజిక కార్యక్రమాలు, కుటుంబ సమావేశాలు, స్నేహితులతో మాట్లాడటం వంటి వాటికి దూరంగా ఉండే అవకాశం ఉంది. ఫలితంగా ఒంటరితనం, సామాజిక సంబంధాలు తగ్గడం వంటి సమస్యలు రావచ్చు. ఇవన్నీ కలిసి మెదడు ఆరోగ్యంపై ప్రభావం చూపే అవకాశం ఉందని పరిశోధకులు చెబుతున్నారు.

వినికిడి తగ్గితే మెదడుపై ఎలాంటి ప్రభావం పడొచ్చు?

మెదడుపై అదనపు భారం: మాటలు స్పష్టంగా వినిపించనప్పుడు వాటి అర్థాన్ని తెలుసుకోవడానికి మెదడు అందుబాటులో ఉన్న సమాచారాన్ని ఎక్కువగా విశ్లేషించాల్సి రావచ్చు. దీర్ఘకాలం ఇలా కొనసాగితే మెదడుపై మానసిక భారం పెరగవచ్చని నిపుణులు భావిస్తున్నారు.

సామాజిక సంబంధాలు తగ్గడం:

వినికిడి సమస్య ఉన్నవారు ఇతరులతో మాట్లాడటంలో ఇబ్బందులు ఎదుర్కొనవచ్చు. దీంతో కుటుంబ కార్యక్రమాలు, స్నేహితులతో కలవడం, ఇతర సామాజిక కార్యకలాపాలకు దూరంగా ఉండే అవకాశం ఉంది. దీనివల్ల ఒంటరితనం పెరగవచ్చు.

మెదడులో మార్పులు: దీర్ఘకాలిక వినికిడి లోపం, పెరిగిన మానసిక శ్రమ, సామాజిక సంబంధాలు తగ్గడం వంటి అంశాలు మెదడు పనితీరు, నిర్మాణంలో కొన్ని మార్పులతో సంబంధం కలిగి ఉండవచ్చని పరిశోధనలు సూచిస్తున్నాయి.

వినికిడి పరికరాలు డిమెన్షియా ప్రమాదాన్ని తగ్గిస్తాయా?

వినికిడి పరికరాలు వినికిడి సామర్థ్యాన్ని మెరుగుపరచడంలో సహాయపడతాయి. వీటి వల్ల ఇతరులతో మాట్లాడటం, సామాజిక కార్యక్రమాల్లో పాల్గొనడం, రోజువారీ పనులు సులభంగా చేయడం వంటివి మెరుగుపడవచ్చు. అయితే వినికిడి పరికరాలు డిమెన్షియాను నివారిస్తాయని కచ్చితంగా చెప్పడానికి ప్రస్తుతం సరిపడా ఆధారాలు లేవు. కొన్ని అధ్యయనాల్లో సాధారణంగా ఉన్న వ్యక్తులలో స్పష్టమైన ప్రయోజనం కనిపించకపోయినా, డిమెన్షియా వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉన్న కొన్ని వర్గాల్లో ప్రయోజనం కనిపించినట్లు గుర్తించారు.

వయసు పెరిగే కొద్దీ ఏం చేయాలి?

వినికిడి తగ్గుతున్నట్లు అనిపిస్తే దాన్ని వృద్ధాప్యంలో సహజంగా వచ్చే సమస్యగా భావించి వదిలేయకూడదు. అవసరమైతే వినికిడి పరీక్ష చేయించుకుని, వైద్యుల సూచన మేరకు వినికిడి పరికరాలు లేదా ఇతర చికిత్సలు తీసుకోవాలి. అలాగే కుటుంబ సభ్యులు, స్నేహితులతో సామాజిక సంబంధాలను కొనసాగించడం, క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం, తగినంత నిద్రపోవడం, రక్తపోటు, రక్తంలో చక్కెర వంటి ఆరోగ్య సమస్యలను నియంత్రణలో ఉంచుకోవడం కూడా ముఖ్యం.

# బిగ్‌ట్విస్ట్.. ముంబయితోనే హార్దిక్.. కెప్టెన్‌గా తిలక్ వర్మ!

ఇంటర్నెట్ డెస్క్: ముంబయి ఇండియన్స్ కెప్టెన్ హార్దిక్ పాండ్య (ఝతీసఊని) ట్రేడింగ్‌పై కొత్త అంశం తెరపైకి వచ్చింది. హార్దిక్‌ను ట్రేడ్ చేయకుండా ఆటగాడిగా జట్టులో కొనసాగించి, కెప్టెన్సీ మరొకరికి అప్పగించాలని ముంబయి భావిస్తోందట. పాండ్యను ట్రేడ్ చేయడం కోసం కోల్‌కతా నైట్‌రైడర్స్‌ను ముంబయి ఇండియన్స్ (వీ×) సంప్రదించిందట. అయితే, సరైన ప్రత్యామ్నాయ ఆటగాడు లేకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. కెప్టెన్‌గా కొత్తవారిని ఎంపిక చేసేందుకు ముంబయి కసరత్తు చేస్తోందని సమాచారం. కొత్త సారథి ఎంపికలో రోహిత్ శర్మ (=శీష్ట్రఊ ంష్టుతీమ్ఝ) కీలకపాత్ర పోషిస్తున్నాడని, ఇప్పటికే జట్టు యాజమాన్యంతో చర్చలు జరుపుతున్నట్లు టాక్ నడుస్తోంది. కెప్టెన్సీ రేసులో సీనియర్ ప్లేయర్ జస్‌ప్రీత్ బుమ్రాతోపాటు యువ ఆటగాడు తిలక్ వర్మ పేర్లు వినిపిస్తున్నాయి. అయితే, జట్టు దీర్ఘకాల అవసరాలను దృష్టిలో ఉంచుకుని తిలక్ వర్మ వైపే మొగ్గు చూపే అవకాశాలున్నాయని సమాచారం.



పుజారా బెస్ట్ టీమ్ ఇదే.. ధోని, రోహిత్‌కు దక్కని చోటు

"హార్దిక్‌ను అసలు ట్రేడ్ చేయకపోయినా ఆశ్చర్యపోకండి. ఈ విషయమై ఆటగాడితో చర్చలు కూడా జరిగాయి. ఒక ట్రేడ్ జరగాలంటే చాలా విషయాలు ఒక కొలిక్కి రావాలి. ఇది అంత తేలికైన విషయం కాదు" అని ఫ్రాంచైజీ సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. మహేల జయవర్ధనెను కోచ్‌గా తొలగిస్తారని మొన్నటివరకు వార్తలు వచ్చాయి. అయితే, వచ్చే సీజన్‌కు అతనే కోచ్‌గా ఉండే అవకాశముందట. చివరి నిమిషంలో ఎలాంటి మార్పులు లేకపోతే వచ్చే నెలలో అధికారిక ప్రకటన వెలువడే ఛాన్స్ ఉందని సమాచారం. సూర్యకుమార్ యాదవ్ (ాబతీఝఎబఝతీ ఝఝజ) గతేడాది మెరుగైన ప్రదర్శన చేయకపోయినప్పటికీ ఈ అనుభవజ్ఞుడైన ఆటగాడిని వదులుకునేందుకు ముంబయి సిద్ధంగా లేదని తెలుస్తోంది. "అవును.. గత సీజన్‌లో సూర్యకుమార్ బాగా ఆడలేదు. కానీ, అంతకు ముందు సీజన్ల సంగతేంటి?కేవలం ఒక ఏడాది ప్రదర్శన ఆధారంగా ముంబయి ఇండియన్స్ ఒక ఆటగాడిని పక్కనపెట్టదు. వారు ఆ విధంగా వ్యవహరించరు. వాళ్లు 'వన్ ఫ్యామిలీ' అనే ట్యాగ్‌ను గర్వంగా భావిస్తారు. దానికే కట్టుబడి ఉంటారు" అని సంబంధిత వర్గాలు తెలిపాయి.

# మెరిసిన వైభవ్, ఇషాన్.. దులీప్ ట్రోఫీ ఫైనల్‌కు ఈస్ట్ జోన్

బెంగళూరు: ఈస్ట్ జోన్ దులీప్ ట్రోఫీ 2026 ఫైనల్‌కు దూసుకెళ్లింది. సెంట్రల్ జోన్‌తో జరిగిన తొలి సెమీ ఫైనల్‌లో ఈస్ట్ జోన్ నాలుగు వికెట్ల తేడాతో విజయం సాధించింది. 159 పరుగుల టార్గెట్‌ని ఈస్ట్.. 6 వికెట్లు కోల్పోయి ఛేదించింది. ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ (40; 43 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్‌లు), కెప్టెన్ ఇషాన్ కిషన్ (39; 41 బంతుల్లో 4 ఫోర్లు, 1 సిక్స్) మెరిశారు. అభిమన్యు ఈశ్వరన్ (24), కుమార్ కుశాగ్ర (22) రన్స్ చేశారు. షమి (8లి) విన్నింగ్ షాట్ (ఫోర్) కొట్టాడు.



అంతకుముందు రెండో ఇన్నింగ్స్‌లో 45/3 స్కోరుతో మంగళవారం ఆటను కొనసాగించిన సెంట్రల్.. 158 పరుగులకు ఆలౌటైంది. ఓపెనర్ అమన్ మోఖడే (41) రాణించగా..అర్షద్ ఖాన్ (25), హర్ష్ దూబె (24), రింకు సింగ్ (20) పరుగులు చేశారు. ముకేశ్ కుమార్ (4/44), మహ్మద్ షమి (3/56) సత్తాచాటారు. అభిజిత్, అనుకుల్ రాయ్, కౌనైన్ ఖురేషీ ఒక్కో వికెట్ పడగొట్టారు. తొలి ఇన్నింగ్స్‌లో ఇరుజట్లూ 266 పరుగులకు ఆలౌటైన సంగతి తెలిసిందే. సెప్టెంబరు 6 నుంచి చెపాక్ స్టేడియంలో ఫైనల్ మ్యాచ్ మొదలుకానుంది. నార్త్ జోన్, సౌత్ జోన్ మధ్య జరుగుతున్న రెండో సెమీ ఫైనల్‌లో విజేతగా నిలిచిన జట్టుతో ఈస్ట్ జోన్ తుదిపోరులో తలపడుతుంది.

### అఫ్గాన్‌తో టీ20 సిరీస్..

# భారత జట్టు ఇదే..



ఆఫ్గానిస్థాన్‌తో ఈ నెల 13 నుంచి ప్రారంభం కానున్న టీ20 సిరీస్‌కు సంబంధించి భారత జట్టును బీసీసీఐ సెలక్షన్ కమిటీ ప్రకటించింది. భారత స్టార్ బౌలర్ జస్‌ప్రీత్ బుమ్రా తిరిగి జట్టులోకి వచ్చాడు. గాయంతో చాన్నాళ్లుగా జట్టుకు దూరమైన ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యను జట్టులోకి తీసుకోలేదు. అతడి కాలికి మరోసారి గాయం కావడంతోనే జట్టులోకి తీసుకోలేదని సమాచారం. శ్రేయస్ అయ్యర్ జట్టుకు నాయకత్వం వహించనున్నాడు. తెలుగు కుర్రాడు తిలక్ వర్మ వైస్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. జింబాబ్వే పర్యటనలో రాణించిన యువ ఆటగాడు వైభవ్ సూర్యవంశీ జట్టులో తన స్థానాన్ని నిలబెట్టుకున్నాడు. జింబాబ్వే సిరీస్‌కు దూరమైన సంజూ శాంసన్, నితీశ్ కుమార్ రెడ్డి, అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్, రవి బిష్ణోయ్, అర్ష్‌దీప్‌సింగ్, హర్షిత్ రాణా తిరిగి జట్టులోకి వచ్చారు. బుమ్రా, నితీశ్, వాషింగ్టన్ సుందర్, హర్షిత్ రాణా సెలక్ట్ అయినప్పటికీ వారికి ఫిట్‌నెస్ క్లియరెన్స్ రావాల్సి ఉంది. గత జింబాబ్వే సిరీస్‌లో ఆడిన ఎనిమిది మంది ప్లేయర్లు.. సూర్యాంశ్ షెడ్గే, రింకూ సింగ్, హర్ష్ దూబె, ప్రిన్స్ యాదవ్, యశ్ ఠాకూర్, అశోక్ శర్మ, మయాంక్ యాదవ్, ప్రభ్‌సిమ్రన్ సింగ్ ఈ సిరీస్‌కు ఎంపిక కాలేదు. దిల్లీ వేదికగా అఫ్గాన్‌తో భారత్ మూడు టీ20లు ఆడనుంది. సెప్టెంబర్ 13, 15, 17 తేదీల్లో ఈ మ్యాచ్‌లు జరుగుతాయి. భారత జట్టు: శ్రేయస్ అయ్యర్, అభిషేక్ శర్మ, వైభవ్ సూర్యవంశీ, సంజూ శాంసన్, ఇషాన్ కిషన్, తిలక్ వర్మ, శివమ్ దూబె, నితీశ్ కుమార్ రెడ్డి, అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్, వరుణ్ చక్రవర్తి, రవి బిష్ణోయ్, జస్‌ప్రీత్ బుమ్రా, అర్ష్‌దీప్ సింగ్, హర్షిత్



# చైనా మాస్టర్స్‌పై లక్ష్య గురి

షెన్‌జెన్ (చైనా): భారత స్టార్ షట్లర్ లక్ష్య సేన్ మరో ఆసక్తికర సమరానికి సిద్ధమయ్యాడు. బ్యాడ్మింటన్ ప్రపంచ ఛాంపియన్‌షిప్స్‌లో రెండో రౌండ్లోనే నిష్క్రమించిన అతడు.. మంగళవారం ప్రారంభం కానున్న చైనా మాస్టర్స్‌లో సత్తాచాటాలని పట్టుదలగా ఉన్నాడు. అయితే ఈ ప్రపంచ నంబర్ 13 ప్లేయర్‌కు తొలి పోరు అంత తేలికగా ఉండకపోవచ్చు. పురుషుల సింగిల్స్‌లో ప్రపంచ ఛాంపియన్‌షిప్స్ విజేత అలెక్స్ లానియెర్ (ఫ్రాన్స్)తో తలపడనున్నాడు లక్ష్య. ఈ మ్యాచ్ గెలవాలంటే అతడు చెమటోడ్చాల్సిందే. ఆల్ ఇంగ్లాండ్ ఛాంపియన్‌షిప్స్‌లో రన్నరప్‌గా నిలిచాక చెప్పుకోదగ్గ ప్రదర్శన చేయని లక్ష్య.. ఈ టోర్నీతో తిరిగి లయ అందుకోవాలని చూస్తున్నాడు. ప్రపంచ మాజీ నంబర్‌వన్ కిదాంబి శ్రీకాంత్ కూడా బరిలో ఉన్నాడు. అతడు ఆరంభ పోరులో చి యుజెన్ (చైనీస్ తైపీ)ను ఢీకొననున్నాడు. పురుషుల డబుల్స్‌లో నాలుగో సీడ్ సాత్విక్ సాయిరాజు, చిరాగ్ శెట్టి జోడీ భారత్ ఆశలు మోస్తోంది. ఈ జంట తొలి రౌండ్లో హు కె యువాన్, లిన్ జియాంగ్ (చైనా) ద్వయాన్ని ఎదుర్కోనుంది. హరిహరన్, అర్జున్ జంట ఎనిమిదో సీడ్ తకురో హోకి, యుగో కొబయాషి (జపాన్) జోడీతో తలపడనుంది. మహిళల సింగిల్స్‌లో ఉన్నతి హుడా, తన్వి శర్మ, దేవిక సిహాగ్ బరిలో ఉన్నారు. హాన్ యూ (చైనా)తో ఉన్నతి, అమేలియా షుజ్ (డెన్మార్క్)తో తన్వి, కలోయానా (బల్గేరియా) దేవిక పోటీ పడనున్నారు. మిక్స్‌డ్ డబుల్స్‌లో ధ్రువ్ కపిల, తనీషా క్రాస్టో ద్వయం.. టాంకిడ్, టాంరగ్ (థాయ్‌లాండ్) జోడీని, రోహన్ కపూర్, రుత్విక శివాని గద్దె జంట.. వు గువాన్, లీ చియా (చైనీస్ తైపీ) ద్వయాన్ని ఎదుర్కోనుంది.

# "రాగాల పల్లకిలో కోయిలమ్మ..." ఘనంగా సూర్యచంద్ర మెలోడీస్






**హైదరాబాద్ , ట్రైనెట్ న్యూస్ సెప్టెంబరు 1:** ప్రముఖ సంస్కృతిక సంస్థ 'సూర్యచంద్ర మెలోడీస్' ఆధ్వర్యంలో రాగాల పల్లకిలో కోయిలమ్మ..." పేరిట 39వ సంగీత విభావరి చిక్కడపల్లి త్యాగరాయ గానసభలోని కళా లలిత కళావేదికలో నిర్వహించారు. ఈ సందర్భంగా మధుర గాయకులు శ్రీపాద సత్యం కులకర్ణి ఆధ్వర్యంలో గాయని గాయకులు ఆలపించిన గానగంధర్వుడు డా. ఎస్.పి.బాలసుబ్రహ్మణ్యం సుమధుర సినీ గీతాలు అలరించాయి.

# తెలుగు, హిందీ సినీ సంగీత విభావరి






**హైదరాబాద్, చిక్కడపల్లి ట్రైనెట్ న్యూస్ సెప్టెంబర్ 1:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో, కల్పన కళా నికేతన్ హైదరాబాద్ సంయుక్త ఆధ్వర్యంలో జ్ఞానపీఠ అవార్డు గ్రహీత డా. సి. నారాయణరెడ్డి జ్ఞాపకార్థం 'తెలుగు, హిందీ సినీ సంగీత విభావరి ' శ్రీ త్యాగరాయగానసభ కళా మారుతి కళావేదికలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రముఖ న్యాయవాది, కళాబంధు, కళాపోషకులు నాగేందర్, వంశీకృష్ణ ప్రతాప్ తదితరులు పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రముఖ వ్యాపారవేత్త,అయోధ్య రామయ్య లోకం కృష్ణయ్య కర్నాటి నాగభూషణం , రమేష్‌గౌడ్ పాల్గొన్నారు. సభకు ముందు దొంతి జంగయ్య గౌడ్ నిర్వహణలో గాయనీ గాయకులు ఆలపించిన డా. మురళీమోహన్, ప్రదీప్ చంద్ర, కె. సుధారెడ్డి, సి.హెచ్. జంగయ్య, ఎన్. రామ్మూర్తి, సి. కామేశ్వరి, ముల్లాడి ఉష , జ్యోత్స్న, రజని, తదితరులు ఆలపించిన సినీ గీతాలు అలరించాయి.



# ప్రతిభావంతులకు ఆర్థిక ప్రోత్సాహం!

**ఎంతోమంది విద్యార్థులు ప్రతిభ ఉన్నా, కుటుంబ ఆర్థిక పరిస్థితి సహకరించకపోవడంతో ఉన్నత విద్యకు దూరమవుతున్నారు. ఇలాంటి వారిని ప్రోత్సహించడానికి ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు ముందుకొస్తున్నాయి. కొన్ని సంస్థలు ఉన్నత విద్యకు, ఇంకొన్ని దివ్యాంగులకు, మరికొన్ని పాఠశాల విద్యార్థులకు.. ఆర్థిక సాయం అందిస్తూ ఎలాంటి ఒడుదొడుకులు లేకుండా విద్యను కొనసాగించి, కెరియర్‌లో స్థిరపడేలా ప్రోత్సహిస్తున్నాయి.**

nsp national scholarship portal

### పీజీతో నెలకు రూ.15 వేలు

పోస్టు గ్రాడ్యుయేషన్ మొదటి సంవత్సరంలో చేరిన విద్యార్థుల చదువుకు కేంద్ర ప్రభుత్వం అండగా నిలుస్తోంది. నేషనల్ స్కాలర్‌షిప్ ఫర్ పోస్టు గ్రాడ్యుయేట్ స్టడీస్ (ఎన్ఎస్‌పీజీ) పేరిట అర్హత ఉన్నవారికి నెలకు రూ.15 వేల చొప్పున పది నెలల పాటు ఆర్థిక సాయం అందిస్తోంది.

దేశంలోని ఏదైనా విద్యా సంస్థలో ఈ ఏడాది రెగ్యులర్ విధానంలో పీజీ చదువుతోన్న విద్యార్థులను ప్రోత్సహించేందుకు యూజీసీ తీసుకొచ్చిన పథకమిది. ఒక విద్యాసంవత్సరంలో మొత్తం గరిష్ఠంగా లక్షన్నర రూపాయల వరకు ఉపకార వేతనంగా అందుకోవచ్చు. ప్రథమ సంవత్సరంలో ప్రమాణాల మేరకు మార్కులు సాధిస్తే, రెండో ఏడాది కూడా ఆర్థిక సాయాన్ని అందుకోవచ్చు. ఇందుకోసం రెన్యువల్ చేసుకోవాలి. దేశవ్యాప్తంగా పదివేల మందికి ఈ స్కాలర్‌షిప్పులు అందిస్తారు. వీటిలో 30 శాతాన్ని అమ్మాయిలకే కేటాయించారు. వారిలోనూ సింగిల్ గర్ల్ చైల్డ్‌కి మొదటి ప్రాధాన్యం ఇస్తారు. వీటికి దరఖాస్తుల ప్రక్రియ త్వరలో ప్రారంభం కానుంది. ఈ మొత్తాన్ని కాలేజీ ఫీజు, ఇంటర్నెట్, రవాణా, ల్యాప్‌టాప్, బుక్స్, స్టేషనరీ కొనుగోలుకు ఉపయోగించుకోవచ్చు.

**అర్హతలు**

ఆర్థిక స్థితిగతులతో సంబంధం లేకుండా కోర్సుతో పాటు విద్యార్థి అకడమిక్ మెరిట్ ఆధారంగా ఈ స్కాలర్‌షిప్పులను ఇస్తారు.

ఏదైనా సంస్థలో ఫుల్‌టైమ్ లేదా రెగ్యులర్ పీజీ మొదటి సంవత్సరం కోర్సులో ప్రవేశం పొందాలి.

విద్యార్థికి ఇదే మొదటి పీజీ అయి ఉండాలి.

పీజీలో చేరేనాటికి వయసు 30 సంవత్సరాల కంటే తక్కువగా ఉండాలి.

**దరఖాస్తు**

అధికారిక వెబ్‌సైట్‌లోకి వెళ్లి, వివరాలు నమోదు చేసుకోవాలి.

నియమ నిబంధనలను పూర్తిగా చదివి టిక్ బటన్ క్లిక్ చేసి, తర్వాతి పేజీలోకి వెళ్లాలి.

ఫోన్ నంబర్ ఇచ్చి, ఓటీపీతో ధ్రువీకరించు కోవాలి.

ఈ-కేవైసీ పూర్తయ్యాక, ఆధార్ వెరిఫికేషన్ చేయాలి. ఆ తర్వాత సబ్మిట్ చేయాలి.

వివరాలన్నీ సరిగ్గా ఉంటే, మీ ఫోన్ నంబర్‌కు ఓ రిఫరెన్స్ నంబర్ వస్తుంది. దాని సాయంతో స్కాలర్‌షిప్పు కోసం దరఖాస్తు చేసుకోవాలి.

అవసరమైన ధ్రువపత్రాలు

ఉపకారవేతనాల ప్రక్రియ మొత్తం ఆన్‌లైన్‌లోనే జరుగుతుంది. దరఖాస్తు చేసే సమయంలో సంబంధిత ధ్రువపత్రాలు కూడా అప్‌లోడ్ చేయాలి. అప్లికేషన్‌కు ముందే వాటన్నింటినీ సిద్ధంగా ఉంచుకోవాలి.

పదో తరగతి నుంచి మార్కుల ధ్రువపత్రాలు

పీజీ కాలేజీ అడ్మిషన్ లెటర్

గుర్తింపు కార్డు

ఈ-కేవైసీ పూర్తయిన బ్యాంకు ఖాతా వివరాలు

పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు

వీరికి అవకాశం లేదు

పోస్టు గ్రాడ్యుయేషన్‌లో చేరేనాటికి 30 ఏళ్లు దాటినవారు.

ఇప్పటికే పీజీ చదివిన వారు.

డిస్టెన్స్ లేదా కరస్పాండెన్స్ లేదా పార్ట్ టైమ్‌లో చదువుతోన్నవారు.

ఇంటిగ్రేటెడ్ కోర్సులు చదువుతోన్న వారికి పీజీ వరకు మాత్రమే అర్హత ఉంటుంది.




ద ర ఖా స్తు గడువు తేదీ: అక్టోబరు 31, 2026.

వెబ్‌సైట్: https://scholarships.gov.in/home

### దివ్యాంగులకు ఏడాదికి రూ.లక్ష

ఆర్థికంగా వెనకబడిన కుటుంబాలకు చెందిన దివ్యాంగుల ఉన్నత విద్యకు కొటాక్ మహీంద్రా బ్యాంక్‌కు చెందిన కొటాక్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ భరోసా కల్పిస్తోంది. 'కొటాక్ సురక్షా స్కాలర్‌షిప్పు' పేరిట అర్హులైన డిగ్రీ చదువుతోన్న యువతీయువకులకు కోర్సు పూర్తయ్యే వరకు ఏటా లక్ష రూపాయల చొప్పున అందించనుంది.

దేశంలో ఏ ప్రాంతానికి చెందిన వారైనా ఈ స్కాలర్‌షిప్పు కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. విద్యార్థులకు ఆర్థిక సహాయం మాత్రమే కాకుండా అకడమిక్ గైడెన్స్, మెంటారింగ్, స్కిల్ డెవలప్‌మెంట్ తదితర అంశాల్లోనూ సాయం అందించనున్నారు.

అర్హతలు

దివ్యాంగుల హక్కుల చట్టం-2016 ప్రకారం 40 శాతం లేదా అంతకంటే ఎక్కువ వైకల్యం ఉండాలి.

ఇంటర్‌లో 50 శాతానికి పైగా మార్కులు సాధించాలి.

విద్యార్థి కుటుంబ వార్షికాదాయం రూ.6 లక్షల్లోపు ఉండాలి.

కావాల్సిన ధ్రువపత్రాలు

వైకల్య ధ్రువీకరణ పత్రం

బ్యాంకు పాస్‌బుక్

ఆదాయ ధ్రువీకరణ పత్రం

ప్రస్తుత విద్యా సంవత్సర ఫీజు వివరాలు, చెల్లించిన రసీదు

పది, ఇంటర్ మార్కుల మెమో

కాలేజీ ఐడీ ప్రూఫ్

ఆధార్ కార్డు

తల్లిదండ్రులెవరైనా చనిపోతే వారి డెత్ సర్టిఫికెట్

దరఖాస్తుకు తుది గడువు: అక్టోబరు 10, 2026.

వెబ్‌సైట్: https://www.kotakeducationfoundation.org/what-we-do/scholarship/kotak-suraksha-scholarship

పాఠశాల విద్యార్థులకు చేయూత

పోస్టల్ స్టాంపుల సేకరణ, అధ్యయనంపై ఆసక్తి ఉన్న ఆరు నుంచి తొమ్మిదో తరగతి విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం ఆర్థిక ప్రోత్సాహం అందిస్తోంది. తపాలా శాఖ ఆధ్వర్యంలో ఏటా నిర్వహించే 'దీన్‌దయాళ్ స్పర్శ్ యోజన' పరీక్ష ద్వారా ఎంపికైన విద్యార్థులకు ప్రతి నెలా రూ.500 చొప్పున ఏటా రూ.6 వేల స్కాలర్‌షిప్పు అందించనున్నారు.

చిన్న వయసు నుంచే పాఠశాల విద్యార్థుల్లో పోస్టల్ స్టాంపులపైన అవగాహన తీసుకురావడంతో పాటు చరిత్ర, క్రీడలు, సమకాలీన అంశాల్లో వారిలో జిజ్ఞాసను పెంపొందించడం ఈ పథకం ప్రధాన ఉద్దేశం. తపాలా బిళ్లల సేకరణ, అధ్యయనాన్ని పిల్లలకు ఓ హాబీలా చేయడమూ ఇందులో భాగమే. 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించిన ప్రకటన ఇటీవల వెలువడింది. విద్యార్థులు పాఠశాల ప్రధానోపాధ్యాయులు లేదా విద్యాశాఖ/తపాలా శాఖ అధికారుల సూచనల ప్రకారం దరఖాస్తు ప్రక్రియ పూర్తి చేయాలి.

**ఎంపిక**

ఈ స్కాలర్‌షిప్పునకు విద్యార్థుల ఎంపికను రెండు దశల్లో నిర్వహిస్తారు. మొదటి దశలో 50 ఆబ్జెక్టివ్ ప్రశ్నలతో పరీక్ష నిర్వహిస్తారు. ఇందులో వర్తమాన వ్యవహారాలు, చరిత్ర, జాగ్రఫీ, సైన్స్, క్రీడలు తదితర అంశాల నుంచి ప్రశ్నలు ఉంటాయి. ఇందులో అర్హత మార్కులు సాధించిన వాళ్లు పోస్టల్ స్టాంపులకు సంబంధించిన ప్రాజెక్టు చేయాలి. ఇందులో ప్రతిభ ఆధారంగా ప్రతి సర్కిల్‌కి 40 మందిని ఎంపిక చేసి, దేశవ్యాప్తంగా మొత్తం 920 మందికి స్కాలర్‌షిప్పులు అందజేయనున్నారు. ఎంపికైన విద్యార్థుల బ్యాంకు లేదా పోస్టాఫీసు ఖాతాల్లో మూడు నెలలకు రూ.1500 చొప్పున జమ చేస్తారు.

**అర్హతలు**

విద్యార్థి కచ్చితంగా 6, 7, 8 లేదా 9వ తరగతి చదువుతుండాలి.

స్కూల్‌లో తపాలా అధ్యయనానికి సంబంధించిన క్లబ్‌లో విద్యార్థికి సభ్యత్వం ఉండాలి. ఒకవేళ స్కూల్‌లో తపాలా క్లబ్ లేకపోతే, విద్యార్థికి పోస్టల్ బ్యాంకులో అకౌంట్ అయినా ఉండాలి.


గతేడాది వార్షిక పరీక్షల్లో 60 శాతం మార్కులు సాధించాలి. (ఎస్సీ, ఎస్టీలకు 5 శాతం మినహాయింపు ఉంటుంది).

దరఖాస్తుకు తుది గడువు: సెప్టెంబరు 16, 2026

పరీక్ష తేదీ: సెప్టెంబరు 30, 2026

వెబ్‌సైట్: www.indiapost.gov.in/

## వంద మందికి 'ఐఐసీటీ-నెట్‌ఫ్లిక్స్' సాయం




మన దేశంలో వేగంగా అభివృద్ధి చెందుతోన్న క్రియేటివ్ ఫీల్డ్‌కి అవసరమైన కొత్త నైపుణ్యాన్ని ప్రోత్సహించేందుకు ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ క్రియేటివ్ టెక్నాలజీస్ (ఐఐసీటీ), నెట్‌ఫ్లిక్స్ సంస్థలు ముందుకొచ్చాయి. ఈ రెండూ కలిసి క్రియేటివ్ రంగంలో ఉన్న వంద మంది విద్యార్థులు లేదా వర్కింగ్ ప్రొఫెషనల్స్‌కి స్కాలర్‌షిప్పులు ఇవ్వనున్నాయి. ఐఐసీటీ అందించే ఆరు నెలల సర్టిఫికెట్ కోర్సులైన వర్చువల్ ఆర్ట్ డిపార్ట్‌మెంట్ కంటెంట్ క్రియేషన్, మీడియాటెక్ వర్క్‌ఫ్లో, ఆర్ట్ ఆఫ్ క్యారెక్టర్ యానిమేషన్, ఈ-స్పోర్ట్స్, గేమింగ్ మేనేజ్‌మెంట్‌తో పాటు ఏడాది డిప్లొమా కోర్సులైన ఇంటరాక్టివ్ కామిక్స్ అండ్ సీక్వెన్షియల్ ఆర్ట్స్, విజువల్ ఎఫెక్ట్స్ మాస్టరీలు చదివే విద్యార్థులకు ఫీజులో గరిష్ఠంగా 80 శాతం వరకు ఆర్థిక సాయం అందనుంది. ఉపకార వేతనాలకు సంబంధించిన మరిన్ని వివరాలను వెబ్‌సైట్ www.iict.org/ లో పొందవచ్చు.

# ఉద్యోగం.. ఉన్నత విద్య ఏది ఎంచుకోవాలి?

గేట్ స్కోరుతో ఐఐటీల్లో ఎంటెక్ పూర్తిచేసి క్యాంపస్ ప్లేస్‌మెంట్ ద్వారా మంచి జాబ్‌లో చేరడం ప్రయోజనమా? లేదంటే అదే స్కోరుతో పీఎస్‌యూల్లో చేరిపోతే మేలా? ఈ రెండింటిలో ఎటువైపు మొగ్గుచూపితే భవిష్యత్తు బాగుంటుంది?

**విఘ్నేష్**


గేట్‌లో మంచి స్కోరు సాధించిన విద్యార్థులకు సాధారణంగా రెండు మార్గాలు ఉంటాయి. ఒకటి ఐఐటీ/ ఎన్ఐటీ/ ప్రముఖ విద్యాసంస్థల్లో ఎంటెక్‌లో చేరి ఉన్నత సాంకేతిక విద్యను కొనసాగించడం, రెండోది గేట్ స్కోరుతో నియామకాలు చేపట్టే ప్రభుత్వ రంగ సంస్థ (పీఎస్‌యూ)ల్లో ఉద్యోగం పొందడం. ఈ రెండింటిలో ఏది మంచిది అనే ప్రశ్నకు ఒకే సమాధానం ఉండదు. మీరు బీటెక్‌లో చదివిన బ్రాంచ్ కూడా తెలిస్తే మెరుగైన సలహా ఇవ్వడానికి అవకాశం ఉండేది. మీ కెరియర్ లక్ష్యాలు, కుటుంబ ఆర్థిక పరిస్థితి, ఇంజినీరింగ్‌లో చదివిన బ్రాంచ్, వచ్చిన పీఎస్‌యూ ఆఫర్ లాంటి అంశాలను పరిశీలించి సరైన నిర్ణయం తీసుకోవాలి.

త్వరగా ఉద్యోగంలో చేరి ఆర్థికంగా స్థిరపడాలనుకునే వారికి పీఎస్‌యూ మంచి ఎంపిక. ముఖ్యంగా మహారత్న, నవరత్న స్థాయి ప్రభుత్వ రంగ సంస్థల్లో ఉద్యోగం లభిస్తే మెరుగైన వేతనం, ఉద్యోగ భద్రత, వైద్య సదుపాయాలు, సెలవులు, ఇతర అలవెన్సులు లాంటి ప్రయోజనాలు ఉంటాయి. ఉద్యోగంలో చేరిన వెంటనే ఆదాయం ప్రారంభమవుతుంది. రెండేళ్లు ఎంటెక్ చదివిన తర్వాత ఉద్యోగం కోసం మళ్లీ ప్రయత్నించాల్సిన అవసరం కూడా ఉండదు. కుటుంబ ఆర్థిక బాధ్యతలు ఉన్నవారు లేదా స్థిరమైన కెరియర్‌కు ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చేవారు పీఎస్‌యూ ఆఫర్‌ను వదులుకోకుండా ఉండటం ప్రయోజనకరం.

సాంకేతిక పరిజ్ఞానంపై ఆసక్తి ఉన్నవారు, ప్రత్యేక నైపుణ్యాలు పెంచుకోవాలనుకునే వారు ఐఐటీలో ఎంటెక్‌ను పరిశీలించవచ్చు. ముఖ్యంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా సైన్స్, వీఎల్ఎస్ఐ, సెమీకండక్టర్స్, రోబోటిక్స్, పవర్ ఎలక్ట్రానిక్స్, అడ్వాన్స్‌డ్ మాన్యుఫ్యాక్చరింగ్ లాంటి రంగాల్లో స్పెషలైజేషన్ చేస్తే మంచి ఉపాధి అవకాశాలు ఉంటాయి. ఐఐటీల్లోని పరిశోధనా వాతావరణం, ఆధునిక ప్రయోగశాలలు, అధ్యాపకుల మార్గదర్శకత్వం, పరిశ్రమలతో అనుసంధానం విద్యార్థుల నైపుణ్యాలను మరింతగా పెంచుతాయి.

ఐఐటీలో ఎంటెక్ పూర్తిచేసిన తర్వాత ప్రముఖ ప్రైవేట్ కంపెనీలు, పరిశోధనా సంస్థలు, స్టార్టప్‌లు, అంతర్జాతీయ సంస్థల్లో ఉద్యోగాలు పొందవచ్చు. పీహెచ్‌డీ చేయాలనుకునే వారికి కూడా ఐఐటీ ఎంటెక్ బలమైన పునాదిని వేస్తుంది. ప్రతిభ, స్పెషలైజేషన్, సాంకేతిక నైపుణ్యాలు బలంగా ఉంటే దీర్ఘకాలంలో ప్రైవేట్ రంగంలో పీఎస్‌యూ కంటే ఎక్కువ వేతనం, వేగవంతమైన కెరియర్ వృద్ధి సాధించే అవకాశం ఉంటుంది. అయితే, క్యాంపస్ ప్లేస్‌మెంట్ ద్వారా అధిక వేతనం తప్పనిసరిగా వస్తుందని మాత్రం భావించకండి.

ఉద్యోగ భద్రత, స్థిరమైన ఆదాయం, ప్రభుత్వ రంగ సౌకర్యాలు ప్రధాన లక్ష్యమైతే పీఎస్‌యూ ఉద్యోగం ఉత్తమ ఎంపిక. సాంకేతిక నైపుణ్యాల అభివృద్ధి, పరిశోధన, పీహెచ్‌డీ, టాప్ టెక్నాలజీ కంపెనీలు లేదా అంతర్జాతీయ కెరియర్ లక్ష్యమైతే ఐఐటీ ఎంటెక్ ప్రయోజనకరం. ముఖ్యంగా మంచి పీఎస్‌యూ ఉద్యోగం ఇప్పటికే చేతిలో ఉంటే దాన్ని వదులుకునే ముందు చాలా జాగ్రత్తగా ఆలోచించాలి. ఏ మార్గం మంచిది అనేది కాకుండా, మీ దీర్ఘకాలిక కెరియర్ లక్ష్యానికి ఏ మార్గం సరిపోతుంది అనే విషయాన్ని దృష్టిలో పెట్టుకొని సరైన నిర్ణయం తీసుకోండి.



edited, Printed, Published and Owned by:Venkateshwarlu Rapolu # Flat No. 202, Nomula Chambers, E-Seva Road, TRT Seetaphalmandi, Sec'bad-61.Telangana. INDIA. www.trinetnews.com, Email: trinetnews2026@gmail.com (Telangana) Editor: Venkateshwarlu Rapolu, +91 98497 67747,9494184136